www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
హైదరాబాద్ సిటీ*
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 140
మంగళవారం | 3-9-2024
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య ఉ. 7.24 తదుపరి పాడ్యమి; నక్షత్రం: పుబ్బ తె. 3.10 తదుపరి ఉత్తర; వర్జ్యం: ఉ.9.16-11.04; దుర్ముహూర్తం: ఉ.8.32-9.21, రా.10.13-10.58; అమృతఘడియలు: రా.8.00-9.48; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.23
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఖమ్మంలో మున్నేరు వరదకు ఓ ఇంట్లో పేరుకున్న బురద.. దెబ్బతిన్న సామగ్రి వద్ద దీనంగా బాధితులు

ఏపీ పరిధిలోని గరికపాడు వద్ద హైదరాబాద్-విజయవాడ వైపు పాతవంతెన చివరలో కుంగిన రోడ్డు



జలసాగరాలు
14

నాగార్జున సాగర్‌కు 5.41 లక్షల క్యూసెక్కుల వరద

శ్రీరాంసాగర్‌కు 2.04 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

రెండేళ్ల తర్వాత ప్రాజెక్టు 41 గేట్లు ఎత్తి నీటి విడుదల

15 జిల్లాలకు రెడ్ అలర్ట్.. నేడు, రేపు భారీ వర్షాలు?

మొత్తం 481 రైళ్లు రద్దు.. 152 దారి మళ్లింపు

నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం పానగల్‌లో నీట మునిగిన పత్తి చేలు



నష్టం అంచనా 5,438 కోట్లు
13

రోడ్లు భవనాల శాఖకు రూ.2,362 కోట్లు

32 జిల్లాల్లో 84 చోట్ల తెగిపోయిన రోడ్లు

మునిసిపల్ శాఖ పరిధిలో రూ.1,150 కోట్లు..

4.15 లక్షల ఎకరాల్లో పంట నష్టం.. విలువ 415కోట్లు

సాగునీటి పారుదల శాఖ పరిధిలో రూ.629కోట్లు



ఖమ్మంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులు పట్టుకొని రోదిస్తున్న వరద బాధిత మహిళ

ఎకరాకు ₹ పదివేలు

పంట నష్టపోయిన రైతులకు పరిహారం

ఆందోళన వద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుంది

వరద బాధిత కుటుంబాలకు సీఎం రేవంత్ హామీ

వర్షంలోనే ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో పర్యటన

గండిపడిన సాగర్ ఎడమకాలువ సందర్శన

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా 5 లక్షలు

బాధిత జిల్లాలకు రూ.5 కోట్లు తక్షణ సాయం

ఇల్లు కూలిన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు

ప్రధాని రావాలి.. తక్షణం రూ.2వేల కోట్లు ఇవ్వాలి

కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలి: రేవంత్

ఎన్డీఆర్ఎఫ్ తరహాలో టీజీ-డీఆర్ఎఫ్ ఏర్పాటు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

వానలు, వరదలతో నష్టపోయిన వారిని ఆదుకుంటామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. భారీ వర్షాలతో ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, 16 మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, రహదారులు, కాలువలు, చెరువులకు గండ్లు పడడంతో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్లు, స్తంభాలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ప్రాథమిక అంచనాల్లో రూ.5,438 కోట్ల ఆస్తి నష్టం వాటిల్లినట్టు తెలిపారు. అయితే ఇంకా వర్షాలు కురుస్తున్నాయని, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లోనూ వర్షాలు పడుతున్నాయని సమాచారం

మిగతా 12వ పేజీలో...

వాన వరద.. తీరని వ్యథ
13

173 మండలాల్లో భారీ వర్షాలు

కామారెడ్డి సదాశివనగర్‌లో 24 సెం.మీ

ఖమ్మంలో 70 వేల ఎకరాల్లో పంట నష్టం

1000 కోట్ల నష్టం.. ప్రాథమిక అంచనా

ఉమ్మడివరంగల్‌లో 35 వేల ఎకరాల మునక

ఊపిరి పీల్చుకుంటున్న నల్లగొండ వాసులు

కన్నీరు మున్నేరు
13

ఊర్లలోకి వరద.. ఇళ్లలో మోకాలిలోతు బురద

పనికిరాకుండాపోయిన బియ్యం, పప్పులు

కట్టుబట్టలతో మిగిలిన వేలమంది బాధితులు

విల్లాల విలవిల!

మోకాలిలోతు మోకాలి లోతు నీళ్లు

212 విల్లాలకు దారులు బంద్
12

అంటువ్యాధుల ముప్పు?
10

వర్షాలు, వరదల తర్వాత విజృంభించే ప్రమాదం

టైఫాయిడ్, డయేరియా, కలరా ప్రబలే చాన్స్

ఇప్పటికే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా తీవ్రత

ముంపులోనే 2 లక్షలమంది!
14

సాయం కోసం వేలమంది ఎదురుచూపు

ఇంకా వరద గుప్పిట విజయవాడ నగరం

ఇటు కృష్ణా వరద.. అటు బుడమేరు ఉగ్రరూపం

ప్రకాశం బ్యారేజీ 'కౌంటర్' కట్

వరద ఉధృతికి కొట్టుకు వచ్చిన బోట్లు

గేట్లకు సపోర్టుగా ఉండే కౌంటర్ వెయిట్లతో ఢీ

69వ గేటు దగ్గర విరిగిన కౌంటర్ వెయిట్

హైదరాబాద్-విజయవాడ రాకపోకలు షురూ
12

నార్కట్‌పల్లి-అద్దంకి మీదుగా విజయవాడకు

590 బస్సుల రద్దు.. కేసముద్రం రైల్వేట్రాక్‌కు మరమ్మతులు


2

వ్యవసాయాభివృద్ధికి.. ఏడు కొత్త పథకాలు

ఆమోదించిన కేంద్ర మంత్రివర్గం

రూ. 14 వేల కోట్ల నిధులకు పచ్చజెండా

రైతు ఆదాయం పెంపే లక్ష్యం: అశ్వినీవైష్ణవ్

ఎస్‌బీఐ ఎండీగా రామ మోహనరావు

కీలక పదవిలో మరో తెలుగు తేజం
11

1 కాలితో శీతల్ రామబాణం..



నితేశ్, సుమిత్‌కు స్వర్ణాలు

పారాలింపిక్స్ బ్యాడ్మింటన్‌లో 4 పతకాలు

డిస్కస్ త్రోలో రజతం సాధించిన యోగేశ్

ఆర్చరీలో శీతల్ జోడీకి కాంస్యం

బుల్డోజర్ న్యాయం సరికాదు

నిందితుడైతే.. ఇంటిని కూల్చేస్తారా?.. దోషిగా తేలినా అలా చేయకూడదు



నిబంధనల ప్రకారమే నడుచుకోవాలి

దీనిపై మార్గదర్శకాలు రూపొందిస్తాం

సమస్య దేశవ్యాప్తం.. పరిష్కారం చూపుతాం

కూల్చివేతలను అడ్డుకోవాలన్న పిటిషన్లపై

విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

తదుపరి విచారణ 17కు వాయిదా

రైతు సమస్యలపై సుప్రీం కోర్టు కమిటీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: క్రిమినల్ కేసుల్లో నిందితులైనంత మాత్రాన వారి ఇళ్లను ఎలా కూల్చివేస్తారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ప్రస్తుతం నిందితుల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తున్న సంగతి తెలిసిందే. అక్రమ కట్టడాలన్న ఆరోపణలతో వాటిని కూల్చేస్తున్నారు. ఈ కూల్చివేతలు వివాదాస్పదంగా మారుతున్నాయి. బుల్డోజర్ న్యాయం పేరిట జరుగుతున్న ఈ కూల్చివేతలను అడ్డుకోవాలంటూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. కేవలం నిందితులన్న కారణంతో వారి ఇంటిని ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించింది. ఒకవేళ దోషిగా నిర్ధారణ అయినా.. చట్టంలోని నిబంధనల ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అదేసమయంలో అక్రమ నిర్మాణాలు లేదా రహదారులను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను తాము రక్షించబోమని తేల్చిచెప్పింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ.. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇప్పటికే

మిగతా 2వ పేజీలో...

కోర్టు మారినా.. విషయం మారదు కదా?
2

ఓటుకు నోటు కేసు.. బదిలీ పిటిషన్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్య

కవితకు బెయిల్ వ్యాఖ్యలపై పిటిషనర్ల ఐఏ దాఖలు

2 వారాల్లో జవాబు చెప్పాలి.. సీఎం రేవంత్‌కు బెంచ్ ఆదేశాలు



'మహా' హైదరాబాద్!

ఔటర్‌కు ఆనుకొని ఉన్న 45 గ్రామాలు జీహెచ్ఎంసీ పరిధిలోకి

సమీప మునిసిపాలిటీల్లో విలీనం.. ఆర్డినెన్స్ జారీ చేసిన సర్కారు

3 జిల్లాల్లోని ఈ గ్రామాలు ఇక మీదట గ్రేటర్ హైదరాబాద్‌లోకి

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ విస్తరణలో కీలక అడుగు పడింది. హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ) పరిధిని విస్తరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఔటర్ రింగు రోడ్డు వరకూ జీహెచ్ఎంసీ పరిధిలోకి తీసుకొస్తామని ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. హైదరాబాద్ మహానగర పరిధిని పెంచి, ప్రగతి పథంలో నడిపిస్తామని ఇటీవల అసెంబ్లీలోనూ వెల్లడించారు. నగరాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అనేక సందర్భాల్లో తెలిపారు. ఇప్పుడు ఆ దిశగా కీలక ముందడుగు పడింది. ఔటర్ రింగు రోడ్డును ఆనుకొని ఉన్న 45 గ్రామాలను సమీప మునిసిపాలిటీల్లో విలీనం చేస్తూ ప్రభుత్వం సోమవారం రాత్రి తెలంగాణ పురపాలక చట్ట సవరణ ఆర్డినెన్స్ 2024ను జారీ చేసింది. ఈ మేరకు జీవో ఎం.ఎస్ నంబరు 73ను విడుదల చేసింది. అంటే ఇక ఆయా గ్రామాలు పంచాయతీలు కావు. అక్కడ పంచాయతీ ఎన్నికలు కూడా నిర్వహించరు. మరోవైపు కొంతకాలం తర్వాత ఈ మునిసిపాలిటీలను జీహెచ్ఎంసీ పరిధిలోకి తేనున్నారని సమాచారం. అందుకోసం చట్టసవరణ చేస్తారని తెలిసింది. మునిసిపాలిటీల్లో

మిగతా 2వ పేజీలో...

రాష్ట్రానికి 1,880 కోట్లు!
3



మూణ్నెల్ల గ్రాంట్లు కలిపి

జూలైలో విడుదల చేసిన కేంద్రం

కేంద్ర పన్నుల్లో వాటాగా 4,907 కోట్లు

జులైలోనే రూ.10,392 కోట్ల

రుణం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం

కాగ్ నివేదికలో వెల్లడి

కులగణనకు ఓకే

గణన వివరాలు సమాజ హితానికే ఉపయోగపడాలి

ఎన్నికల్లో ప్రచారాంశంగా వాడుకోకూడదు: ఆరెస్సెస్

తిరువనంతపురం, సెప్టెంబరు 2: జాతీయ కులగణనకు అనుకూలంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కీలక ప్రకటన చేసింది. అయితే కులగణన ప్రక్రియ అనేది సమాజ హితానికి, కులాల ఉన్నతికి ఉపయోగపడాలే తప్ప 'రాజకీయాంశం' ఎంతమాత్రం కాకూడదని హితవు పలికింది. ఎన్నికల ప్రచారాంశం కోసమో, రాజకీయ ప్రయోజనాల కోసమో కులగణన వివరాలు (డేటా) ఉపయోగించకూడదని స్పష్టం చేసింది. కులగణన అనేది సున్నితమైన అంశమని, అయితే

మిగతా 2వ పేజీలో...


3

2 నుంచి 5 రెట్లు పెంపు!

ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగంలో భూముల విలువ భారీగా పెంపు

సగటున 200%.. కొన్ని గ్రామాల్లో 500 శాతం వరకు!

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఆగమేఘాలపై విలువల సవరణ

రహదారికి 1946 హెక్టార్లు అవసరమని గుర్తింపు

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో విజయ్ నాయర్‌కు బెయిల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో ఆప్ నేత విజయ్ నాయర్‌కు బెయిల్ మంజూరైంది. సుమారు 23 నెలల పాటు జైలులో ఉన్న నాయర్.. పీఎంఎల్‌ఏ కేసులో బెయిల్ కోసం గత నెల 12న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భాటిల ధర్మాసనం విచారణ జరిపింది. సోమవారం తుది తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా ఇటీవల ఈ కేసులో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా బెయిల్ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం బెయిల్ నిబంధనలపై చేసిన వ్యాఖ్యలను ఉటంకించింది. ఈ కేసులో గత నెల 9న సిసోడియాకు, 27న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వచ్చిన విషయం తెలిసిందే.! నాయర్ కూడా 23 నెలల పాటు(2022 నవంబరు 13 నుంచి) జైలులో ఉన్న నేపథ్యంలో రాజ్యాంగంలోని 21వ అధికరణ(జీవించే హక్కు)ను అనుసరించి బెయిల్ మంజూరు చేస్తున్నట్లు జస్టిస్ హృషికేశ్ రాయ్ ధర్మాసనం స్పష్టం చేసింది.

ఆర్‌జీ కర్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ ఘోష్ అరెస్టు

కోల్‌కతా, సెప్టెంబరు 2: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌ను సీబీఐ సోమవారం అరెస్టు చేసింది. ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఈ చర్య తీసుకొంది. ఆ కళాశాలలో ట్రైనీ డాక్టరుపై అత్యాచారం, హత్య జరిగిందన్న కేసులో ఆయనను వరుసగా 15 రోజుల పాటు ప్రశ్నించింది. అనంతరం ఆర్థికంగా అవకతవకలకు పాల్పడ్డారన్న మరో కేసులో అరెస్టు చేసింది. ప్రిన్సిపాల్‌గా ఉన్నప్పుడు పలు అక్రమాలకు పాల్పడ్డారంటూ ఆ కళాశాల మాజీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అఖ్తర్ ఆలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్య తీసుకొంది.

రూ.10వేలిస్తేనే కాపాడతాం..

» ఈతగాళ్ల డిమాండ్.. యూపీలో అధికారి గల్లంతు

కాన్పూర్, సెప్టెంబరు 2: గజ ఈతగాళ్ల దురాశ, నిర్లక్ష్యం వల్ల ఓ అధికారి గంగానదిలో గల్లంతైన ఘటన ఉత్తరప్రదేశ్‌లో వెలుగుచూసింది. వారాణసీ ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆదిత్యవర్ధన్ సింగ్(45) స్నేహితులతో కలిసి శనివారం మధ్యాహ్నం ఉన్నావ్ బిల్హౌర్‌లోని నానమౌ ఘాట్ వద్దకు పుణ్యస్నానానికి వెళ్లాడు. నది గట్టు నుంచి లోపలికి వెళ్లడం, నీటి ప్రవాహం తీవ్రంగా ఉండటంతో కొట్టుకుపోయాడు. ఆయనను కాపాడాలని స్నేహితులు అక్కడ ఉన్న ఈతగాళ్లను వేడుకున్నారు. కానీ, వారు రూ.10వేలు కావాలని డిమాండ్ చేశారు. నగదు లేకుంటే ఆన్‌లైన్ ద్వారా చెల్లింపు చేయాలని పట్టుబట్టారు. కానీ, డబ్బును బదిలీ చేసేలోపే ఆదిత్య ప్రవాహంలో గల్లంతయ్యాడు. ఆదిత్య కోసం ఆదివారం గాలింపు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదని బిల్హౌర్ ఏసీపీ అజయ్ కుమార్ త్రివేది పేర్కొన్నారు.

'మహా' హైదరాబాద్!

(మొదటి పేజీ తరువాయి)

విలీనం చేసిన ఈ 45 గ్రామాల్లో అత్యధికం మేడ్చల్ జిల్లా పరిధిలో ఉన్నాయి. జిల్లాలోని 23 గ్రామాలను 7 పురపాలికల్లో విలీనం చేశారు. అలాగే రంగారెడ్డి జిల్లాలోని 11 గ్రామాలను 4 పురపాలికల్లో, సంగారెడ్డి జిల్లాలోని 11 గ్రామాలను 2 పురపాలికల్లో విలీనం చేశారు. ప్రస్తుతం మునిసిపాలిటీల్లో విలీనమవడం.. తర్వాత గ్రేటర్‌లో కూడా కలిపితే ఔటర్‌ను ఆనుకొని ఉన్న ఈ గ్రామాల రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. అదే సమయంలో ఇప్పటివరకు పంచాయతీలుగా ఉన్న ఈ గ్రామాలకు పెద్దగా పన్నుల్లేవు. విలీనమైనందున పన్నుల రాబడి కూడా బాగా పెరుగుతుందని భావిస్తున్నారు.

మేడ్చల్ జిల్లా పరిధిలో..

మునిసిపాలిటీ	విలీన గ్రామాలు
ఘట్‌కేసర్	మర్రిపల్లిగూడ, ఏదులాబాద్, ఘనాపూర్
నాగారం	కీసర, రాంపల్లిదాయర, యాద్గార్‌పల్లి, చీర్యా
తూంకుంట	బాబాగూడ, బొమ్మరాశిపేట, శామీర్‌పేట
మేడ్చల్	రాయిలాపూర్, పూడురు
గుండ్లపోచంపల్లి	గౌడవెల్లి, మునీరాబాద్
దమ్మాయిగూడ	తిమ్మాయిపల్లి, నర్సంపల్లి, కరీంగూడ, గోధుమకుంట
పోచారం	చౌదరిగూడ, వెంకటాపూర్, కాచవాని సింగారం, కొర్రెముల, ప్రతాప్‌సింగారం

రంగారెడ్డి జిల్లా పరిధిలో..

మునిసిపాలిటీ	విలీన గ్రామాలు
పెద్ద అంబర్‌పేట	కుత్బుల్లాపూర్, తారామతిపేట, గౌరెల్లి, బాచారం
శంషాబాద్	రషీద్‌గూడ, బహదూర్‌గూడ, హమీదుల్లానగర్, చిన్న గోల్కొండ, పెద్ద గోల్కొండ
శంకర్‌పల్లి	మీర్జాగూడ
తుక్కుగూడ	హర్షగూడ

సంగారెడ్డి జిల్లా పరిధిలో..

మునిసిపాలిటీ	విలీన గ్రామాలు
అమీన్‌పూర్	ఐలాపూర్, ఐలాపూర్‌తండా, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ, దాయర, సుల్తాన్‌పూర్
పటాన్‌చెరు	పోచారం, ముత్తంగి, కార్దనూర్, పాటి, ఘనాపూర్

సెబీ చైర్మన్ మాధవికి ఏడేళ్లుగా ఐసీఐసీఐ నుంచీ జీతం!

2017 నుంచి రూ.16.8 కోట్లు పొందారు.. ఇది సెబీ చట్టంలోని సెక్షన్ 54 ఉల్లంఘనే

» సెబీ చైర్‌పర్సన్, సభ్యులను ప్రధాని ఆధ్వర్యంలోని కమిటీ నియమిస్తుంది

» అందుకే మోదీ స్పందించాల్సిందే: కాంగ్రెస్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: సెబీ చీఫ్ మాధవి పురీపై కాంగ్రెస్ సంచలన ఆరోపణలు చేసింది. గతంలో సెబీ సభ్యురాలి హోదాలో, ప్రస్తుతం సెబీ చైర్మన్ హోదాలోనూ ఆమె ఐసీఐసీఐ నుంచి ఏడేళ్లుగా జీతం తీసుకుంటున్నారని ఆరోపించింది. సెబీలో చేరాక 2017 నుంచి ఇప్పటిదాకా ఆమె ఐసీఐసీఐ నుంచి రూ.16.8 కోట్ల మేర పొందారని.. ఈ మొత్తం, సెబీ నుంచి ఆమె తీసుకుంటున్న జీతానికి ఐదు రెట్లు ఎక్కువ అని పేర్కొంది. ఇది సెబీ యాక్ట్ (ఎంప్లాయీ సర్వీస్)లోని 54 సెక్షన్‌ను ఉల్లంఘించినట్లేనని పేర్కొంది. 2017 ఏప్రిల్ 5న ఆమె సెబీ పూర్తి స్థాయి సభ్యురాలయ్యారని.. అప్పటి నుచి ఐసీఐసీఐ సంస్థ నుంచి కూడా ఆమె జీతం పొందుతున్నారని కాంగ్రెస్ పేర్కొంది. సెబీ చైర్‌పర్సన్, సభ్యులను ప్రధాని ఆధ్వర్యంలోని ఓ ప్రత్యేక కమిటీ నియమిస్తుందని అందుకే ఈ ఘటనపై ప్రధాని మోదీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ విషయమ్మీద కాంగ్రెస్ నేత పవన్ ఖెరా ఢిల్లీలోని ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడారు. సెబీ సభ్యురాలి హోదాలో, సెబీ చైర్‌పర్సన్ హోదాలోనూ మాధవి పురీ ఐసీఐసీఐ బ్యాంకు నుంచి 2016-2021 దాకా రూ.12.63 కోట్ల మేర జీతం తీసుకున్నారని.. 2017-24 మధ్య ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ నుంచి రూ.22.41 లక్షలను జీతంగా తీసుకున్నారని, 2021-23 మధ్య ఐసీఐసీఐ ఈఎస్‌వోపీ (ఎంప్లాయి స్టాక్ ఆప్షన్ ప్లాన్) నుంచి రూ.2.84 కోట్లు పొందారని, 2021-23 మధ్య ఐసీఐసీఐ నుంచి 1.10 కోట్ల మేర టీడీఎస్ మినహాయింపులు పొందారని ఆరోపించారు. కాగా సెబీ చైర్‌పర్సన్‌గా ఉన్న మాధవి, ఐసీసీఐ బ్యాంకు నుంచీ జీతం తీసుకుంటున్నారన్న విషయం ప్రధాని మోదీకి తెలుసా? అని కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి జైరామ్ రమేశ్ ట్విటర్ వేదికగా ప్రశ్నించారు. అదానీ గ్రూప్ సంస్థల మీద సెక్యూరిటీల చట్టం ఉల్లంఘన ఆరోపణలపై దర్యాప్తును సుప్రీంకోర్టు సెబీకి అప్పగించడంతో సెబీ చైర్‌పర్సన్‌గా మాధవి పురీ పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు పాల్పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు.. కాగా కాంగ్రెస్ ఆరోపణలను ఐసీఐసీఐ ఖండించింది. మాధవి 2013 అక్టోబరు 31న ఉద్యోగ విరమణ చేశాక ఆమెకు ఎలాంటి జీతం గానీ, ఈఎస్‌ఓపీ ప్రయోజనాలు గానీ ఇవ్వలేదని స్పష్టం చేసింది.

వ్యవసాయాభివృద్ధికి ఏడు కొత్త పథకాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: దేశంలో వ్యవసాయాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఏడు కొత్త పథకాలను ప్రకటించింది. వీటిల్లో డిజిటల్ అగ్రికల్చర్ మిషన్(రూ.2,817 కోట్లు), క్రాప్ సైన్స్ స్కీమ్(రూ.3,979 కోట్లు) ఉన్నాయి. సోమవారం ప్రధాని మోదీ నేతృత్వంలో భేటీ అయిన కేంద్ర క్యాబినెట్.. ఈ పథకాలకు రూ.14 వేల కోట్లను విడుదల చేయడానికి ఆమోదం తెలిపింది. కేంద్ర మంత్రి అశ్వినివైష్ణవ్ వివరాలను వెల్లడించారు. ఏడు కొత్త పథకాలతో రైతుల ఆదాయం పెరుగుతుందన్నారు. "ఆహారం, పోషకాల భద్రతను దృష్టిలో పెట్టుకుని క్రాప్ సైన్స్ పథకాన్ని ప్రకటించాం" అని ఆయన వ్యాఖ్యానించారు. దీంతోపాటు.. కృషి విజ్ఞాన కేంద్రాల అభివృద్ధికి రూ.1,202 కోట్లను కేటాయించినట్లు వివరించారు. కాగా, ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ముంబై-ఇండోర్ మధ్య రైల్వే లైన్‌కు ఆమోద ముద్ర వేసింది. 309 కిలోమీటర్ల ఈ రైల్వేలైన్ నిర్మాణ వ్యయం రూ.18వేల కోట్లుగా పేర్కొన్న మంత్రి.. 2028-29 లోగా ఈ మార్గంలో రైళ్లు పరుగులు పెడతాయన్నారు. సుఖోయ్ యుద్ధ విమానాల కోసం హెచ్‌ఏఎల్ ద్వారా 240 ఏరో ఇంజన్లను సమకూర్చుకొనేందుకు క్యాబినెట్ కమిటీ ఆమోదించింది.

లోకం తీరు



కులగణనకు ఓకే

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ ఏకీకరణ పరంగా ప్రధానమైనదని సంఘ్ అఖిల భారత ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేడ్కర్ పేర్కొన్నారు. కేరళలోని పాలక్కాడ్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి సమన్వయ సమావేశాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జాతీయ కులగణనపై సునీల్ అంబేడ్కర్ మాట్లాడారు. 'హిందూ సమాజంలో కులం, కుల ఆధార సంబంధాలు అనేవి చాలా సున్నితమైన అంశాలు. ఇవి జాతీయ ఐక్యత, సమగ్రతలో అంతర్భాగం. కులగణన వివరాల (డేటా)ను ప్రాథమికంగా సంక్షేమ కార్యకలాపాల కోసం వినియోగించాలే తప్ప రాజకీయాస్త్రం ఎంతమాత్రం కాకూడదు' అని వ్యాఖ్యానించారు. ఇటీవల సంఘ్ నేత శ్రీధర్ గద్గ్ కులగణన ప్రక్రియ ఓ నిరుపయోగమైన కసరత్తుగా కొట్టిపారేశారు. ఈ నేపథ్యంలో కులగణన ప్రక్రియకు జాతీయ స్థాయి సమన్వయ సమావేశాల వేదికగా సంఘ్ మద్దతు పలకడం గమనార్హం. కాగా రాజ్యాంగపరమైన రిజర్వేషన్లకు ఎప్పుడూ మద్దతిస్తామని సంఘ్ పేర్కొంది. బీజేపీతో కొన్ని సమస్యలున్నాయని అంగీకరించిన సంఘ్, అవి అంతర్గతమైనవేనని, పరిష్కరించుకుంటామని స్పష్టం చేసింది.

ఒక్కడే 41 మందిని గాయపర్చాడా

» బెంగాల్ సర్కారుపై సుప్రీంకోర్టు ఫైర్

» ఛాత్ర సమాజ్ నేత బెయిల్‌ను వ్యతిరేకిస్తూ వేసిన పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: పశ్చిమ్ బంగా ఛాత్ర సమాజ్ నాయకుడు సయాన్ లాహిరి బెయిల్‌ను సవాల్ చేస్తూ బెంగాల్ సర్కారు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆందోళనలకు సంబంధించి ఆయన ఒక్కడినే ఎందుకు అరెస్టు చేశారని.. '41 మంది పోలీసులను ఆయనే గాయపరిచారా' అంటూ నిలదీసింది. కోల్‌కతా హత్యాచార ఘటనపై బెంగాల్ సర్కారు తీరును నిరసిస్తూ ఛాత్ర సమాజ్ గత నెల 27న రాష్ట్ర సచివాలయ ముట్టడికి చేపట్టిన 'నబన్నా అభియాన్' ర్యాలీ హింసాత్మకంగా మారి నిరసనకారులతో పాటు పోలీసులు గాయపడ్డారు. దీనికి బాధ్యుడిని చేస్తూ సయాన్ లాహిరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేయగా.. దాన్ని వ్యతిరేకిస్తూ బెంగాల్ సర్కారు సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

'బుల్డోజర్ న్యాయం' సరికాదు

(మొదటి పేజీ తరువాయి)



అఫిడవిట్ దాఖలు చేసినట్లు చెప్పారు. కేవలం నిందితులైనంత మాత్రాన వారి ఇళ్లను కూల్చివేయడం లేదని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలిన వారి ఇళ్లను.. అదికూడా స్థానిక సంస్థలు లేదా స్థానిక అభివృద్ధి సంస్థల నిబంధనల ప్రకారమే కూల్చివేస్తున్నట్లు స్పష్టం చేశారు. స్పందించిన ధర్మాసనం.. ఈ అంశంపై దేశమంతటా వర్తించేలా మార్గదర్శకాలను రూపొందిస్తామని తెలిపింది. కూల్చివేతల విషయంపై రాష్ట్రాలతో చర్చించి పరిష్కార మార్గాలను కనుగొంటామని మెహతా చెప్పారు. కొందరు నేరాలు చేసినంత మాత్రానే, వారి ఇళ్లను కూల్చేస్తున్నట్లుగా పిటిషనర్లు పేర్కొంటున్నారని.. అది సరికాదని తెలిపారు. కూల్చివేతల కంటే చాలా ముందే అధికారులు నోటీసులు జారీ చేశారని.. కావాలంటే ధర్మాసనానికి వాటిని చూపుతానని మెహతా అన్నారు. ఈ వివాదానికి గతంలో తాము సమర్పించిన అఫిడవిట్‌తోనే ముగింపు పలకవచ్చని తెలిపారు. స్పందించిన ధర్మాసనం.. వ్యక్తులు లేదా అధికారులు ఎవరూ చట్టాల్లోని లొసుగులను అవకాశంగా చేసుకోరాదని పేర్కొంది. ఈ కూల్చివేతల అంశంపై దేశవ్యాప్తంగా అమలు చేసేలా మార్గదర్శకాలను రూపొందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. అలాంటి మార్గదర్శకాలు రూపొందించాల్సిందేనని పిటిషనర్ల తరపు న్యాయవాది దుష్యంత్ దవే చెప్పారు. కాగా, ఈ విషయమై సలహాలు, సూచనలు అందజేయాలని ధర్మాసనం ఇరుపక్షాలను ఆదేశించింది. వాటిని పరిశీలించిన తర్వాత తాము మార్గదర్శకాలను రూపొందిస్తామని తెలిపింది. తదుపరి విచారణను ఈ నెల 17కు వాయిదా వేసింది.

కులగణనపై పిటిషన్ నిరాకరణ

కులాల వారీ జనాభా లెక్కలు సేకరించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాన్ని స్వీకరించేందుకు సోమవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇది ప్రభుత్వం తీసుకోవాల్సిన విధానపర నిర్ణయమని, తామేమీ చేయలేమని తెలిపింది. న్యాయవాది శ్రావణ్ కుమార్ కరణం ద్వారా పి.ప్రసాద్ నాయుడు ఈ పిటిషన్ దాఖలు చేశారు.

రైతు సమస్యలపై సుప్రీం కమిటీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2: పంట ఉత్పత్తుల మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలన్న ప్రధాన డిమాండ్‌తో శంభూ సరిహద్దులో ఏడాది కాలంగా ఆందోళనలు నిర్వహిస్తున్న రైతులతో చర్చల కోసం సుప్రీంకోర్టు ఉన్నతస్థాయి కమిటీని నియమించింది. పంజాబ్-హరియాణా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నవాబ్ సింగ్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వారం రోజుల్లోగా శంభూలోని రైతులతో సమావేశం కావాలని ఆదేశించింది. రైతులతో చర్చించి వారు హైవేపై అడ్డుగా పెట్టిన ట్రాక్టర్లు, ట్రాలీలను తొలగించేలా ఒప్పించాలని సూచించింది. రైతులు రాజకీయాల నుంచి దూరంగా ఉండాలని, నిరసన ప్రదర్శనలను రాజకీయం చేయవద్దని వ్యాఖ్యానించింది. కమిటీలో రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్ బీఎస్ సంధూ, ప్రొఫెసర్ రంజిత్ సింగ్, పంజాబ్ వ్యవసాయ వర్సిటీ ఆర్థికవేత్త సుఖ్‌పాల్ సింగ్, మొహాలీకి చెందిన ప్రొఫెసర్ దేవీందర్ శర్మ ఉన్నారు. హరియాణా అగ్రికల్చర్ వర్సిటీ వీసీ కాంబోజ్‌ను ప్రత్యేక ఆహ్వానితుడిగా పరిగణిస్తూ అవసరమైతే ఆయన సూచనలు కూడా తీసుకోవాలని కోర్టు ఆదేశించింది.

ప్రాణాలు 'తోడేలా'..



ఆపరేషన్ భేడియాలో భాగంగా అధికారులు బంధించిన ఓ తోడేలు

» యూపీలో తోడేళ్ల దాడులతో దడ

» నెలన్నరలోనే ఏడుగురు పిల్లల మృతి

» బంధించడానికి 'ఆపరేషన్ భేడియా'

» 4 పట్టివేత.. రెండింటి కోసం గాలింపు

బహ్రాయిచ్, సెప్టెంబరు 2: పులులో.. చిరుతలో కాదు..! ఉత్తరప్రదేశ్‌లోని ఓ జిల్లా ప్రజలను తోడేళ్లు వణికిస్తున్నాయి. రాత్రిళ్లు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నెలన్నరలోనే ఎనిమిది మందిని పొట్టన పెట్టుకున్నాయి.. వీరిలో ఏడుగురు చిన్నారులే కావడంతో స్థానికుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. బహ్రాయిచ్ జిల్లాలోని మహసి ప్రాంతంలోకి ఎక్కడినుంచి వచ్చాయో కానీ.. ఆరు నెలల్లో కిందట ఆరు తోడేళ్ల ప్రవేశించాయి. ప్రజలపై దాడి చేస్తూ పరిసర వంద గ్రామాలను హడలెత్తిస్తున్నాయి. ప్రతి నాలుగైదు రోజులకు ఒక కొత్త గ్రామాన్ని ఎంచుకుంటున్నాయి. ప్రతిఘటించలేని వారు కావడంతో ముఖ్యంగా పిల్లలను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. రాత్రివేళ 'వేట' పూర్తిచేసుకుని.. తెల్లారేసరికి గుహకు చేరిపోతున్నాయి. అంతేగాక ఎప్పటికప్పుడు స్థావరాలను మారుస్తున్నాయి. కాగా, ఆదివారం రాత్రి రెండేళ్ల గరేటి గురుదత్ సింగ్ గ్రామంలో తల్లిపక్కన నిద్రిస్తున్న అంజలిని లాక్కెళ్లాయి. సోమవారం మౌజా కోటియా గ్రామంలో ఇద్దరు మహిళలను గాయపరిచాయి. హర్ది ప్రాంతంలో తెల్లవారుజామున ఐదేళ్ల పరాస్‌పై మెడ పట్టుకుని లాక్కెళ్తుండగా అతడి తల్లి గుడియా వీరోచితంగా పోరాడి తరిమేసింది.

ఆపరేషన్ భేడియా..

మహసిలో తోడేళ్ల బెడదపై యూపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. 'ఆపరేషన్ భేడియా' చేపట్టింది. వాటి జాడ తెలుసుకునేందుకు డ్రోన్లు ఉపయోగించింది. ఉచ్చులు, బోన్లు పెట్టి నాలుగింటిని పట్టుకుంది. మిగతా రెండు మాత్రం ముప్పుతిప్పలు పెడుతున్నాయి. దీంతో.. మనిషి వాసనకు ఆకర్షితమై ఉచ్చులో చిక్కేందుకు.. ఆట బొమ్మలను పిల్లల మూత్రంతో తడిపి తోడేళ్లు సంచరించే దగ్గర ఉంచుతున్నారు. కాగా, బహ్రాయిచ్‌తో పాటు పొరుగునున్న సీతాపూర్ జిల్లాలోనూ తోడేళ్లు కలకలం రేపుతున్నాయి. యూపీ సీఎం యోగి సోమవారం పరిస్థితిని సమీక్షించారు. అటవీ శాఖ అధికారుల ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ తోడేళ్ల పనిపట్టాలని ఆదేశించారు.

హైడ్రా ఎఫెక్ట్.. రిజిస్ట్రేషన్లు ధమాల్!

జీహెచ్‌ఎంసీ పరిధిలో భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్లు

» జూలైతో పోలిస్తే ఆగస్టులో రూ.320 కోట్లు పడిపోయిన ఆదాయం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 'హైడ్రా' కూల్చివేతల ప్రభావం రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయంపై ప్రభావం చూపుతోందా? గత నెలలో భూముల దస్తావేజుల రిజిస్ట్రేషన్లు భారీగా తగ్గాయా? ఈ ప్రశ్నలకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ గణాంకాలు అవుననే చెబుతున్నాయి. జూలైతో పోలిస్తే ఆగస్టులో రిజిస్ట్రేషన్ల సంఖ్య భారీగా తగ్గింది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి-సంగారెడ్డి జిల్లాల్లో జూలైలో 58,600 దస్తావేజుల రిజిస్ట్రేషన్ జరగ్గా ఆగస్టులో 41,120 డాక్యుమెంట్లే రిజిస్టరయ్యాయి. జూలైలో రిజిస్ట్రేషన్లశాఖకు రూ.1,105 కోట్ల ఆదాయం రాగా ఆగస్టులో రాబడి రూ.320కోట్ల మేర తగ్గి రూ.785 కోట్లకు పడిపోయింది.

జూలై, ఆగస్టు నెలల్లో రిజిస్ట్రేషన్ల ఆదాయం (రూ.కోట్లలో)

జిల్లా	జూలై	ఆగస్టు
రంగారెడ్డి	510	335
హైదరాబాద్	175	135
మేడ్చల్-మల్కాజిగిరి	280	230
సంగారెడ్డి	140	85
మొత్తం	1105	785

నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఇళ్లస్థలాలు, లేఅవుట్లలోని విల్లాలు, అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్లు కొనాలనుకునే వారు తాము కొనే ఆస్తి ఎఫ్‌టీఎల్/బఫర్ జోన్ పరిధిలో ఉందో లేదో తెలియక అయోమయానికి గురవుతున్నారు. మధ్యవర్తుల మాటలు నమ్మి ప్రాపర్టీ కొంటే చివరకు హైడ్రా కూల్చేస్తుందేమోనన్న భయాందోళనలు వ్యక్తంచేస్తున్నారు. సబ్-రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్లి విచారించినా అక్కడి అధికారులు ఇచ్చే సమాచారంపైనా సందేహాలను వ్యక్తం చేస్తూ ఆస్తుల కొనుగోళ్లకు వెనుకంజ వేస్తున్నారు. ఇప్పటికే అన్ని అనుమతులు తీసుకుని నిర్మించి.. ఏళ్లుగా ఉంటున్న ఇళ్లను సైతం హైడ్రా కూల్చివేస్తుండడంతో జీహెచ్‌ఎంసీ పరిధిలో విల్లాలు, ప్లాట్లు, ఫ్లాట్లను కొనేందుకు ప్రజలు వెనుకంజ వేస్తున్నారని బిల్డర్లు చెబుతున్నారు. కాగా హైదరాబాద్ జిల్లాలోని ఆజంపుర, చార్మినార్, చిక్కడపల్లి, మారేడ్‌పల్లి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో బాలనగర్, ఘట్‌కేసర్, కాప్రా, కీసర, కూకట్‌పల్లి, మల్కాజిగిరి, నారపల్లి, కుత్బుల్లాపూర్, రంగారెడ్డి జిల్లా పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్, చంపాపేట్, ఫరూఖ్‌నగర్, గండిపేట్, ఇబ్రహీంపట్నం, ఎల్‌బీనగర్, మహేశ్వరం, పెద్దఅంబర్‌పేట్, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, శేరిలింగంపల్లి, షాద్‌నగర్, శంషాబాద్, శంకర్‌పల్లి, వనస్థలిపురం, సంగారెడ్డి జిల్లా పరిధిలోని పటాన్‌చెరు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు గణనీయంగా తగ్గినట్టు అధికారులు చెబుతున్నారు.

కాంగ్రెస్ ప్రచారంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

» కవిత బెయిల్ అంశంలో న్యాయవ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు సరికాదన్న సుప్రీం ధర్మాసనం

» న్యాయస్థానాలను రాజకీయాల్లోకి తేవొద్దని వ్యాఖ్య

» ప్రచారంపై రెండు వారాల్లో సమాధానం చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆదేశాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వచ్చాక.. తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియాలో చేసిన పోస్టులపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "కబ్జాకోరులకు ఒక రూల్.. సర్కారుకు ఒక రూల్.. వాట్ ఈజ్ దిస్ అధ్యక్షా!? బెయిల్ వచ్చిందా? ఇచ్చారా? ఈ రెండింట్లో ఏది కరెక్టు?" అంటూ సోషల్ మీడియాలో కాంగ్రెస్ చేసిన ప్రచారంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఓటుకు నోటు కేసును తెలంగాణ నుంచి మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరుతూ జనవరి 31న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.! ఆ పిటిషన్‌పై సోమవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంపై తెలంగాణ కాంగ్రెస్ అధికారిక సోషల్ మీడియా ద్వారా జరిగిన ప్రచారంపై ఇంటర్‌లోకేటరీ అప్లికేషన్(ఐఏ) దాఖలు చేశామని, దానిని ఒకసారి పరిశీలించాలని పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, దామా శేషాద్రినాయుడు, న్యాయవాది మోహిత్‌రావు కోర్టును కోరారు. సోషల్ మీడియా పోస్టులను జస్టిస్ గవాయ్ ప్రస్తావిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "నాయస్థానాలు, న్యాయమూర్తులను రాజకీయాల్లోకి ఎందుకు లాగుతున్నారు? ఇది సరైన పద్ధతి కాదు" అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్ర కలుగజేసుకుంటూ.. "ఆ ప్రచారంలో రేవంత్‌రెడ్డి పాత్ర లేదు" అని కోర్టుకు వివరించారు. దీంతో పిటిషనర్ల తరపు న్యాయవాది ఆర్యమ సుందరం దానికి అభ్యంతరం తెలిపారు. "ప్రస్తుతం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ)కి అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డే ఉన్నారు. ఆ పార్టీ రాష్ట్ర అధికారిక సోషల్ మీడియా చేసే ప్రచారానికి ఆయనదే బాధ్యత" అని స్పష్టం చేశారు. దీనిపై లూథ్ర మాట్లాడుతూ.. గత శుక్రవారం కోర్టు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో న్యాయ వ్యవస్థకు క్షమాపణలు చెప్పడంతోపాటు వ్యవస్థపై తనకు ఎంత గౌరవం ఉందో కూడా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేశారని వివరించారు. మరో న్యాయమూర్తి జస్టిస్ కేవీ విశ్వనాథన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం తెలంగాణలో భారీ వరదలున్నాయని, ఆ విధుల్లో ప్రభుత్వం నిమగ్నమై ఉన్నదని గుర్తుచేశారు. తాము ప్రతి సున్నితమైన అంశాలపై దృష్టి సారిస్తామని తెలిపారు. రాజకీయ నేతలు మాత్రం తమను రాజకీయాల్లోకి లాగుతున్నారని, న్యాయస్థానాలను, న్యాయమూర్తులను సోషల్ మీడియాలోకి తీసుకొస్తున్నారని వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు సరికాదన్నారు. న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడాలన్నారు. గౌరవప్రదమైన స్థానాల్లో ఉండే వ్యక్తులు అందరి స్వేచ్ఛ, హక్కులను కాపాడేలా వ్యవహరించాలని హితబోధ చేశారు. ప్రభుత్వం తరపు న్యాయవాదులపై అసంతృప్తి వ్యక్తం చేసిన ధర్మాసనం.. న్యాయమూర్తులపై బహిరంగంగా పోస్టులు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఐఏపై సమాధానం చెప్పాలని ఆదేశిస్తూ.. విచారణను 2 వారాలకు వాయిదా వేసింది.

కోర్టు మారితే.. విషయం మారదు కదా?

ఓటుకు నోటు కేసును మరో రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ దాఖలైన వ్యాజ్యంపై ధర్మాసనం స్పందిస్తూ.. "కేసును విచారించే కోర్టు మారినా.. విషయం మారదు కదా?" అని వ్యాఖ్యానించింది. తొలుత పిటిషనర్ల తరఫున ఆర్యమ సుందరం వాదనలను వినిపిస్తూ.. ఈ కేసులో నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి వద్దే హోం శాఖ ఉందని మరోసారి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కేసులో దర్యాప్తు చేస్తున్న ఏసీబీ సైతం హోంశాఖ పరిధిలోకి వస్తుందని, అధికారులు కూడా సీఎంకే నివేదించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ విషయాలన్నీ తాము సవిరంగా న్యాయస్థానం ముందు ఉంచామని గుర్తుచేశారు. ఏసీబీ దర్యాప్తు ఎలా చేయాలి? ఎవరిని విచారించాలి? ఎవరిని విచారించవద్దు? అనేది హోంశాఖే నిర్ణయిస్తుందని చెప్పారు. ఈ వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ.. కేసును మరో రాష్ట్రానికి బదిలీ చేసినా.. అధికారులు మాత్రం ఆయనకు చెప్పిన తర్వాతే కోర్టుకు నివేదిస్తారు కదా? అని ప్రశ్నించింది. అలా చేస్తే.. అధికార పరిధి మారుతుందని, ప్రాసిక్యూషన్ హోంమంత్రి చేతుల్లో ఉండబోదని సుందరం వాదించారు. అయితే.. ఈ కేసులో ఇప్పటి వరకు 25 మంది సాక్షుల వాంగ్మూలాలను ఏసీబీ సేకరించిందని తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

హాస్టల్లో టెన్త్ పిల్లల రౌడీయిజం!

» ముగ్గురు తొమ్మిదో తరగతి విద్యార్థులపై దాడి

» ఒక్కొక్కరిని పై అంతస్తుకు లాక్కెళ్లి మరీ కొట్టిన వైనం

» మెదక్ జిల్లా తూప్రాన్ గురుకులంలో ఘటన



విద్యార్థి వీపుపై దెబ్బల గుర్తులు

తూప్రాన్, సెప్టెంబరు 2: కింద పడిన సెంట్ బాటిల్‌ను తీయబోతే ముగ్గురు తొమ్మిదో క్లాసు విద్యార్థులు తోసేయడాన్ని సీనియర్ అయిన పదో తరగతి విద్యార్థి అవమానంగా భావించాడు! ఈ విషయాన్ని తన స్నేహితులకు చెబితే.. వారు ఓ తొమ్మిది మంది గుంపుగా కలిసి.. ఆ ముగ్గురిని ఇష్టంవచ్చినట్లుగా కొట్టారు. ఒక్కొక్కరిని పై అంతస్తులోకి లాక్కెళ్లి ఒళ్లు వాతలు తేలేలా కొట్టి.. బయట ఎవరికైనా చెబితే చంపేస్తామనీ బెదిరించారు. మెదక్ జిల్లా తుప్రాన్ శివారులోని గురుకుల పాఠశాలలో ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. భయపడిపోయిన విద్యార్థులు తల్లిదండ్రులకు సమాచారమివ్వడంతో ఈ ఘటన వెలుగుచూసింది. బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం సాయంత్రం పాఠశాలకొచ్చి ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బందిని నిలదీశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఆదివారం సాయంత్రం తొమ్మిదో క్లాసు చదువుతున్న మనోజ్ సెంట్ బాటిల్ కింద పడిపోగా పదో క్లాసు విద్యార్థి జస్వంత్, తొమ్మిదో క్లాసు విద్యార్థి నిశాంత్ దాన్ని తీసుకోవడానికి ప్రయత్నించారు. అయితే జస్వంత్‌ను తొమ్మిదో క్లాసు విద్యార్థులు బలరామ్, అభినయ్, నిశాంత్ తోసివేశారు. దీన్ని అవమానంగా భావించిన జస్వంత్ తన క్లాస్‌మేట్స్‌కు ఈ విషయం చెప్పాడు. హాస్టల్ నుంచి ఉపాధ్యాయులంతా వెళ్లిపోయాక రాత్రి 11 గంటలకు పై అంతస్తులో ఉండే 10వ తరగతి విద్యార్థులు తొమ్మిది మంది.. జశ్వంత్‌ను తోసేసిన ముగ్గురు విద్యార్థులు నిశాంత్ (రామాయంపేట), బలరామ్(జహీరాబాద్), అభినయ్(ఇమాంపూర్)లను ఒక్కొక్కరిగా పైకి తీసుకెళ్లి కొట్టారు. దాడి విషయమై సమాచారం అందగానే తూప్రాన్ ఎస్‌ఐ శివానందం విచారణ చేపట్టారు. జూలై 16న కూడా ఈ పాఠశాలలోనే ఇదే తరహా దాడి జరిగింది. ముగ్గురు ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు తమకు గౌరవం ఇవ్వడం లేదని సీనియర్లు ఆరోజు రాత్రి సమయంలో వారిపై దాడికి పాల్పడ్డారు.

రాష్ట్రానికి రూ. 1,880 కోట్లు!

» మూణ్నెల్ల గ్రాంట్లూ కలిపి జూలైలో విడుదల చేసిన కేంద్రం

» కాగ్ నివేదికలో వెల్లడి



హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి రాష్ట్రానికి రూ.1880.18 కోట్ల గ్రాంట్లు విడుదలయ్యాయి. ఏప్రిల్ నుంచి తొలి త్రైమాసికం (జూన్ వరకు)లో కేంద్ర ప్రభుత్వం గ్రాంట్లను విడుదల చేయలేదు. మూడు నెలల గ్రాంట్లూ కలిపి జూలైలో విడుదల చేయడం గమనార్హం. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) సోమవారం విడుదల చేసిన జూలై నెల రాష్ట్ర ఆదాయ వ్యయాల నివేదికలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. సాధారణంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి నెలా రూ.600-700 కోట్ల మేర గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్లను విడుదల చేస్తుంటుంది. ఆర్థిక సంవత్సరం చివరి నెలైన మార్చిలో మాత్రం ఎక్కువ మొత్తంలో విడుదల చేస్తుంది. ఈసారి మొదటి మూడు నెలల్లో (ఏప్రిల్, మే, జూన్) ఎలాంటి గ్రాంట్లను విడుదల చేయలేదు. అవన్నీ కలిపి జూలైలో మొత్తం రూ.1880.18 కోట్లు విడుదల చేసింది. కేంద్రం నుంచి ఈ సంవత్సరం రూ.21,636.15 కోట్లు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అంచనా వేసింది. ఇందులో జూలై నాటికి 8.69 శాతం నిధులు వచ్చినట్లయింది. కేంద్ర పన్నుల్లో వాటా కింద మరో రూ.4,907 కోట్లు వచ్చాయి. ఇక ఈ పద్దు కింద రాష్ట్రానికి రూ.26,216.38 కోట్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. మొదటి మూడు నెలల్లో కేంద్రం ఎలాంటి పన్నుల వాటాను విడుదల చేయలేదు. జూలైలో మాత్రం రూ.4,907 కోట్లు విడుదల చేసింది. అన్ని రకాల రాబడుల కింద జూలై నాటికి రూ.71,290.01 కోట్లు రాష్ట్ర ఖజానాకు చేరాయి. ఇది అంచనా వేసిన మొత్తం రాబడులు రూ.2,74,057.64 కోట్లలో 26.01 శాతం. ఇందులో పన్ను రాబడి కింద రూ.1,64,397 కోట్లను అంచనా వేయగా రూ.44,575.40 కోట్లు, పన్నేతరాల కింద రూ.35,208.44 కోట్లను అంచనా వేయగా రూ.1,257.11కోట్లు వచ్చాయి. మరోవైపు మార్కెట్ రుణా ల కింద రాష్ట్ర ప్రభుత్వం జూలై నాటికి రూ.23,563.71 కోట్లను తీసుకుందని కాగ్ వెల్లడించింది. ఇందులో ఒక్క జూలైలోనే రూ.10,392.71 కోట్ల రుణాలు తీసుకుంది.. రైతులకు పంట రుణమాఫీ చేసినందున జూలైలో ఎక్కువ మొత్తంలో రుణాలను సేకరించింది. కాగా, ఇదేసమయంలో రాష్ట్ర ప్రభుత్వం పలు రకాల పద్దుల కింద రూ.66,666 కోట్లు ఖర్చు చేసినట్లు కాగ్ తెలిపింది.

ఈ ఏడాది రాష్ట్రంలో 33,629 ఎంబీబీఎస్ సీట్లు, 6,162 ఎంసీఏ సీట్లు అందుబాటులో ఉన్నాయని అధికారులు ప్రకటించారు. వీటిలో కన్వీనర్ కోటా పరిధిలో 23,989 ఎంబీఏ, 4,583 ఎంసీఏ సీట్లను భర్తీ చేయనున్నారు.

దుండిగల్, బాచుపల్లిలో హైడ్రా పర్యటన

» చెరువులు, నాలా స్థలాల్లో ఆక్రమణల పరిశీలన

దుండిగల్/నార్సింగ్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని చెరువులు, నాలాల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటున్న హైడ్రా, ఇరిగేషన్ అధికారులు సోమవారం దుండిగల్, బాచుపల్లి మండలాల్లోని చెరువులు, నాలాలను పరిశీలించారు. దుండిగల్ మండలంలోని మల్లంపేట్ కత్వా చెరువులోకి వచ్చే ప్రధానమైన నాలాకు అడ్డుగా నిర్మించిన గోడను హైడ్రా ఏఈ సారా నేతృత్వంలోని బృందం తొలగించింది. దీంతో నాలా నుంచి వచ్చే నీరు చెరువులోకి వెళ్లేందుకు మార్గం ఏర్పడింది. చెరువులో ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీ కట్టిన అక్రమ నిర్మాణాలను అధికారులు పరిశీలించారు. బౌరంపేట నుంచి వచ్చే నేరెళ్ల వాగు, ఇసుక డబ్బాల వద్ద ఆక్రమణలను పరిశీలించారు. 5 కి.మీ. పొడవున్న నేరెళ్ల వాగును త్వరలో సర్వే చేయిస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. బాచుపల్లిలోని కోమటికుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో వెలసిన నిర్మాణాలను హైడ్రా, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. బాచుపల్లిలోని ఎల్లమ్మ కుంట చెరువు మత్తడి ఆక్రమణను పరిశీలించారు. కాగా, ఉస్మాన్‌సాగర్ చుట్టూ లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు.

బోధనాస్పత్రుల్లో పోలీస్ అవుట్‌పోస్టులు

» భద్రతా కమిటీల ఏర్పాటు... సమీక్షలో మంత్రి దామోదర

హైదరాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని బోధనాస్పత్రుల్లో వైద్య సిబ్బంది రక్షణ నిమిత్తం శాశ్వత ప్రాతిపదికన పోలీసు అవుట్‌పోస్టులను నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రుల్లో, వైద్య కళాశాలల్లో భద్రతపై సుప్రీంకోర్టు ఇచ్చిన నిబంధనలపై సచివాలయంలో సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మహిళా డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందికి రక్షణగా షీ టీంలతో రాత్రి సమయాలలో పెట్రోలింగ్ చేసేలా నిబంధనలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో అన్ని ఆస్పత్రుల్లో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు సీసీ కెమెరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లకు అనుసంధానం చేయాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో భద్రతా కమిటీలను రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో నియమించాలని, కమిటీ నియమ నిబంధనలను రూపొందించి ఈ నెల 14లోపు నివేదికివ్వాలన్నారు.

నా జనం ఏమయ్యారు?

» పులివెందుల పర్యటనలో వైఎస్ జగన్ విస్మయం

» పార్టీ నేతలపై ఆగ్రహం.. ఫ్రస్టేషన్‌తో తలబాదుకుని ఆవేదన

కడప, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో మూడు రోజుల పర్యటనలో ప్రజాదర్బార్ నిర్వహించారు. రెండు రోజులపాటు ప్రజలు, నాయకులను కలిశారు. అయితే ఆయన గత మూడు పర్యటనల్లో ఎవరైతే వచ్చారో ఈసారీ అదేజనం కనిపించారు. వారంతా వైఎస్ భాస్కరరెడ్డి, వైఎస్ అవినాశ్‌రెడ్డి కుటుంబానికి విధేయులు. శనివారం రాత్రి పులివెందులలో తన ఇంటికి జగన్ చేరుకునే సరికి ప్రజలు లేరు. ఆదివారం ఆయన కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనాలైతే వచ్చారు కానీ పులివెందుల నియోజకవర్గంలోని ప్రజలు కనిపించలేదు. దీంతో జగన్ ఆశ్చర్యపోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఆదివారం రాత్రి జగన్ తన ఇంట్లో అవినాశ్‌రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని, ఫ్రస్టేషన్‌తో తల బాదుకున్నారని చెబుతున్నారు. తన చేతితో తలపై రెండు మూడు సార్లు కొట్టుకున్నట్లు తెలిసింది. నా జనం ఏమయ్యారు? ఏమిటీ ఖర్మ? అని ప్రశ్నించినట్టు సమాచారం. అవినాశ్‌రెడ్డికు ఆయన పీఏ రాఘవరెడ్డి హడావిడిగా ఎదురుగా వచ్చారు. సహనం కోల్పోయిన ఎంపీ పీఏ చెంప చెల్లుమనిపించి కారెక్కి అక్కడి నుంచి వెళ్లిపోయారు. తాజా పరిణామాలను పరిశీలించిన వారు పులివెందుల నియోజకవర్గంలో జగన్, అవినాశ్‌రెడ్డి ప్రత్యర్థులుగా దిగితే జగన్‌కు ఓటమి తథ్యమని అంటున్నారు.

2 నుంచి 5 రెట్లు పెంపు!

ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగంలో భూముల విలువ భారీగా పెంచిన సర్కారు

» సగటున 200%.. కొన్ని గ్రామాల్లో 500% వరకు!

» సీఎం ఆదేశాలతో ఆగమేఘాలపై విలువల పెంపు



హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగంలో భూసేకరణ చేయాల్సిన గ్రామాల్లోని భూముల రిజిస్ట్రేషన్ విలువలను సర్కారు భారీగా పెంచింది. ఏకంగా 200 నుంచి 500 శాతం (2 నుంచి 5 రెట్లు) వరకు పెంచేసింది! భూములు కోల్పోతున్న రైతులకు అధిక పరిహారం దక్కేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. గత నెల 28న స్పీడ్-19 ప్రాజెక్టుల సమీక్షలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగంపై చర్చించారు. భూముల విలువల పెంపుపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. తక్షణమే భూసేకరణ చేసే ప్రాంతాల్లో ఇప్పుడున్న విలువలను సవరించాలని అధికారులను ఆదేశించారు. వెంటనే రంగంలోకి దిగిన అధికారులు ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగంలో భూముల విలువపై కసరత్తు చేశారు. రెండు రోజుల్లోనే ఆయా ప్రాంతాల్లో భూముల విలువలను పరిగణనలోకి తీసుకుని 2 నుంచి 5 రెట్లు పెంచుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. పెంచిన భూముల విలువలు ఈ నెల 1 నుంచి అమల్లోకి వచ్చినట్లు తెలిసింది. రీజినల్ రింగ్ రోడ్డుకు సంబంధించి ఉత్తర, దక్షిణ భాగంలో 350 కి.మీ. మేర నిర్మాణ పనులు చేపట్టనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 90 కి.మీ., రంగారెడ్డి జిల్లా పరిధిలో 149, సంగారెడ్డిలో 20, మెదక్‌లో 56, సిద్దిపేటలో 35 కి.మీ. మేర రహదారి నిర్మాణం జరగనుంది. దక్షిణ భాగంలో సంగారెడ్డి, అమన్‌గల్, షాద్‌నగర్, చౌటుప్పల్ పరిధిలో సుమారు 72 గ్రామాల్లో భూములు సేకరించనున్నారు. దక్షిణ భాగానికి సంబంధించి 189.20 కి.మీ. మేర రహదారి నిర్మాణానికి అవసరమైన భూముల విలువలను 200-500 శాతం వరకు పెంచారు. దక్షిణ భాగంలో 1946 హెక్టార్లు సేకరించాలని ప్రతిపాదించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్‌లో 40 హెక్టార్లు, గుడిమల్కాపురంలో 40, సంస్థాన్ నారాయణపూర్‌లో 60, జనగాంలో 40, ఘాటుప్పల్‌లో 30 హెక్టార్ల చొప్పున సేకరించనున్నారు. ప్రస్తుతం చౌటుప్పల్‌లో రిజిస్ట్రేషన్ శాఖ పుస్తక విలువ కనిష్ఠంగా ఎకరా రూ.5 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.24.2 లక్షల వరకు ఉంది. గుడిమల్కాపురంలో రూ.2-3.5 లక్షలు, సంస్థాన్ నారాయణపూర్‌లో రూ.2-24.2 లక్షలు, జనగాంలో రూ.1-9.68 లక్షల వరకు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఉన్న బహిరంగ మార్కెట్ విలువలను పరిగణనలోకి తీసుకున్న అధికారులు వీటిని 200-500 శాతం వరకు పెంచారు. రంగారెడ్డి జిల్లా గొల్లపల్లిలో రూ.4.5-8 లక్షల వరకు ఉంది. ఇదే జిల్లా అప్పారెడ్డిపల్లిలో కనిష్ఠంగా రూ.80 వేలు ఉంది. శెట్టిపల్లిలో రూ.60 వేల నుంచి గరిష్ఠంగా రూ.9.68 లక్షల వరకు ఉంది. రంగారెడ్డి జిల్లా అమన్‌గల్ పరిధిలో రూ.3-48.4 లక్షలుగా ఉంది. ఇదే జిల్లా యడవల్లిలో మాత్రం కనిష్ఠ, గరిష్ఠ పుస్తక విలువ రూ.60 వేలే ఉంది. సంగారెడ్డి జిల్లా పరిధిలోని గిల్లపల్లి, టెరిపోల్, తోగ్రపల్లి, పెద్దాపూర్ గ్రామాల్లో భూసేకరణ చేయనున్నారు. టెరిపోల్ పరిధిలో పుస్తక విలువ ప్రకారం కనిష్ఠంగా రూ.80 వేలు, గరిష్ఠంగా రూ.90 వేలు ఉంది. సంగారెడ్డి జిల్లా పరిధిలో భూమి విలువ 500 శాతం పెంచినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఖానాపూర్, కిష్టాపూర్ గ్రామాలకు సంబంధించి భూముల విలువ గరిష్ఠంగా రూ.4 లక్షలే ఉంది. ఈ ప్రాంతాల్లోనూ భూముల విలువను 200-500 శాతం వరకు పెంచారు. ఇదే జిల్లా తలరాం, తంగడపల్లి పరిధిలో కనిష్ఠంగా రూ.2 లక్షలు, గరిష్ఠంగా రూ.6 లక్షల విలువ ఉండగా ఇక్కడా 200-500 శాతం మధ్యలో పెంచారు.

రైతులు నష్టపోకుండా ఉండాలనే..

ఆర్ఆర్ఆర్ భూసేకరణ ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం చొప్పున భరించే అవకాశంఉంది. ఈ క్రమంలో భూములిచ్చే రైతులు నష్టపోకుండా భూముల విలువలను సర్కారు సవరించింది.

వైఎస్సార్‌కు సీఎం రేవంత్ నివాళి

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైఎస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఎం రేవంత్‌రెడ్డి నివాళి అర్పించారు. సోమవారం సీఎం నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. ఇటు గాంధీభవన్‌లోనూ వైఎస్సార్ చిత్రపటానికి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.



వైఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

వైఎస్‌కు జగన్, షర్మిల వేర్వేరుగా నివాళి

పులివెందుల: వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా అన్నాచెల్లెలు జగన్, షర్మిల వేర్వేరుగా తండ్రికి నివాళులు అర్పించారు. సోమవారం ఇడుపులపాయలో వైఎస్ ఘాట్ వద్ద ముందుగా మాజీ ముఖ్యమంత్రి జగన్ వైఎస్ ఘాట్‌కు చేరుకుని నివాళులు అర్పించారు. ఆయనతో పాటు సతీమణి భారతి, తల్లి విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు. జగన్ వెళ్లిన 15 నిమిషాలకు ఆయన సోదరి, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల వైఎస్ ఘాట్‌కు చేరుకుని తండ్రికి నివాళులు అర్పించారు. తల్లి విజయమ్మ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఐఏఎస్ వ్యక్తిగత అభిప్రాయాలతో ప్రభుత్వ విధానాలు మారుతాయా?

» హైకోర్టు.. స్మితాసబర్వాల్‌పై పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితాసబర్వాల్ దివ్యాంగులపై చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని హైకోర్టు అభిప్రాయపడింది. ఆమె వ్యక్తిగత అభిప్రాయాలతో చట్టాలు, ప్రభుత్వ విధానాలు మారిపోవని అభిప్రాయపడింది. దివ్యాంగులకు ఉన్న రిజర్వేషన్లు కూడా రద్దుకావని వ్యాఖ్యానించింది. ప్రతి వ్యక్తికి వ్యక్తిగత అభిప్రాయాలు ఉంటాయని, వాటిని వెల్లడించవచ్చని, అందుకు రాజ్యాంగంలోని భావప్రకటనా స్వేచ్ఛ అవకాశం కల్పిస్తోందని పేర్కొంది. ఒక బాధ్యతాయుతమైన ప్రభుత్వ పదవిలో ఉండి దివ్యాంగులను కించపర్చేలా వ్యాఖ్యలు చేసిన స్మితాసబర్వాల్‌పై చర్యలు తీసుకునేలా కేంద్ర ప్రభుత్వం, యూపీఎస్సీకి ఆదేశాలు జారీచేయాలని కొప్పుల వసుంధర అనే సామాజిక కార్యకర్త దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది సీఎంఆర్ వేలు వాదనలు వినిపిస్తూ స్మితాసబర్వాల్ ప్రభుత్వ విధానాలను, రిజర్వేషన్‌లను విమర్శించడం ద్వారా ఆమె సర్వీస్ రూల్స్ నిబంధనలకు అతిక్రమించారని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ట్విట్టర్ (ఎక్స్) ఖాతాలో ఆమె చేసిన వ్యాఖ్యల కారణంగా ప్రభుత్వ విధానాల్లో ఏ మార్పు ఉండదని పేర్కొంది. పరిశీలన దశలోనే ఈ పిటిషన్‌ను కొట్టేస్తూ ఆదేశాలు జారీచేసింది.

11,379 ఫీడర్లకు మీటర్లు!

» 57,600 వ్యవసాయ పంపుసెట్లకు కూడా..


» రాష్ట్రంలో మీటర్లపై సీఈఏ నివేదిక

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్తు సరఫరాకు గ్రామీణ ప్రాంతాల్లో 11,049 ఫీడర్లు, పట్టణ ప్రాంతాల్లో 4,554 ఫీడర్లు ఉన్నట్లు కేంద్ర విద్యుత్తు అథారిటీ (సీఈఏ) నివేదిక వెల్లడించింది. వీటిలో 11,379 ఫీడర్లకు మీటర్లు ఉన్నట్లు తెలిపింది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 27,51,185 వ్యవసాయ కనెక్షన్లు ఉండగా.. 57,600 పంపుసెట్లకు మీటర్లు ఉన్నట్లు వివరించింది. ఈ ఏడాది మార్చి 31వ తేదీ డిస్కమ్‌ల ఇచ్చిన లెక్కలతో దేశవ్యాప్తంగా మీటర్లపై సీఈఏ నివేదికను ప్రకటించింది. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీ) 1,66,534 ఉండగా.. అందులో 1,35,661 ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లు బిగించారు. 81.46 శాతం డీటీలకు మీటర్లు బిగింపు పూర్తయినట్లు తేలింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లో 7,17,343 డీటీలుండగా.. అందులో మీటర్లు బిగించిన డీటీలు 1,67,516 దాకా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 23.35 శాతం డీటీలకే మీటర్లు ఉండటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా డీటీలు 8,83,877 ఉండగా.. మీటర్లు పెట్టినవి 3,03,177 మాత్రమేనని, కేవలం 34.30 శాతం డీటీలకే మీటర్లు బిగించారని లెక్కల్లో తేలింది. ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్) పరిధిలో పట్టణ ప్రాంతాల్లో గృహ విద్యుత్తు కనెక్షన్లు 12,73,097 ఉండగా.. వాటిలో 12,72,530కు మీటర్లున్నాయి. పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయ కనెక్షన్లు 23,870 ఉండగా.. వాటిలో 97 కనెక్షన్లకు మీటర్లు పెట్టడం గమనార్హం. గ్రామీణ ప్రాంతాల్లో 12,90,398 వ్యవసాయ కనెక్షన్లుండగా.. వాటిలో 701 కనెక్షన్లకు మీటర్లు బిగించారు. మొత్తం 798 వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 33,15,726 గృహ విద్యుత్తు కనెక్షన్లు ఉండగా.. అందులో 33,12,836 కనెక్షన్లకు మీటర్లు ఉన్నాయి.

దక్షిణ డిస్కమ్ పరిధిలో..

ఇక దక్షిణ డిస్కమ్‌లోని పట్టణ ప్రాంతాల్లో 50,14,703 గృహ విద్యుత్తు కనెక్షన్లు.. గ్రామీణ ప్రాంతాల్లో 33,45,517 కనెక్షన్లు ఉన్నాయి. అయితే అన్నీ కనెక్షన్లకు మీటర్లు బిగించినట్లు సీఈఏ నివేదిక వెల్లడించింది. పట్టణ ప్రాంతాల్లో 1,42,611 వ్యవసాయ కనెక్షన్లు ఉండగా.. వాటిలో 15,955 కనెక్షన్లకు మీటర్లు ఉండగా.. అదే గ్రామీణ ప్రాంతాల్లో 12,94,306 కనెక్షన్లకు.. 40,847 వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు ఉన్నాయి. మొత్తంగా ఈ డిస్కమ్ పరిధిలో 14,36,917 వ్యవసాయ కనెక్షన్లు ఉండగా... 56,802 కనెక్షన్లకు మీటర్లు ఉన్నాయి. తెలంగాణ ఏర్పడటానికి ముందు, తర్వాత వ్యవసాయ కనెక్షన్ల వినియోగాన్ని ర్యాండమ్ విధానంలో లెక్కించడానికి వీలుగా ఈ మీటర్లు బిగించడం గమనార్హం. ఈ మీటర్ల వినియోగం ఆధారంగానే వ్యవసాయ విద్యుత్తు వినియోగాన్ని డిస్కమ్‌లు అంచనా వేస్తున్నాయి.

వివాహ బంధానికి బంగారు బాట జీఆర్‌టీ జువెల్లర్స్





హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) :భారతీయ సంప్రదాయ వివాహానికి బంగారు బాట వేసే జువెల్లరీ తయారీ జీఆర్‌టీ సొంతమని ఆ కంపెనీ తెలిపింది. గత 60 సంవత్సరాలుగా నాణ్యతకు, విశ్వాసానికి చిహ్నంగా నిలుస్తోందన్నారు. అద్భుతమైన ఆభరణాలు అందిస్తూ తరతరాలుగా భారతీయుల ఆదరణ పొందుతూ వస్తోందన్నారు. 1964లో మొదలైన జీఆర్‌టీ ప్రస్థానం అప్రతిహతంగా కొనసాగుతోందనీ, నమ్మకానికి మారుపేరుగా ప్రసిద్ధమైన బ్రాండ్‌గా పేరు తెచ్చుకుందని తెలిపారు. "వెడ్డింగ్ అండ్ సెలబ్రేషన్" నినాదంతో ప్రతి ముఖ్యమైన సందర్భాన్ని మర్చిపోలేని అనుభూతిగా మార్చే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామన్నారు. బంగారం, వజ్రం, ప్లాటినం, వెండి, విలువైన రత్నాలతో ఆభరణాలు అత్యంత శ్రద్ధతో రూపొందిస్తామన్నారు. అద్భుతమైన వివాహ హారాలు, సొగసైన గాజులు, క్లిష్టమైన పూజా వస్తువులను ఆయా ప్రాంతాల సాంస్కృతిక ప్రాధాన్యత చాటే రీతిలో డిజైన్లు ఉంటాయన్నారు. భారతీయ వారసత్వాన్ని గుర్తిస్తూ చిరస్మరణీయమైన రీతిలో ఆభరణాలు రూపొందించడం తమ ప్రత్యేకత అని తెలిపారు.

చంద్రబాబు అరెస్టు.. జగన్ చేసిన అతిపెద్ద తప్పు

» ఉండవల్లి అరుణ్‌కుమార్‌వ్యాఖ్యలు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 2: చంద్రబాబు నాయుడును జైలుకు పంపడం జగన్ జీవితంలో చేసిన పెద్ద తప్పు అని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ వ్యాఖ్యానించారు. జగన్ చేసిన ఆ ఒక్క తప్పు వల్లే ఓటమి పాలయ్యాడన్నారు. చంద్రబాబును జైలుకు పంపేంత తీవ్రమైన అభియోగాలు ఆ కేసులో లేవన్నారు. మనీ ట్రయల్‌లో ఆయన దాకా డబ్బు వచ్చిందని ఎక్కడా చూపించలేదని స్పష్టం చేశారు. ఏపీలోని రాజమహేంద్రవరంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక ఆఫీసర్‌పై కేసు పెట్టేటప్పుడు ఏ తప్పులైతే గత ప్రభుత్వాలు చేశాయో ఆ తప్పులు చంద్రబాబు ప్రభుత్వం కూడా చేయొద్దని చెబుతున్నానన్నారు. 'ముంబయి హీరోయిన్ కేసు చాలా కాంప్లికేటెడ్‌గా ఉంది. హనీట్రాప్ పరిస్థితిలా ఉంది. అందుకే కొంచెం జాగ్రత్తగా వెళ్లాలి. లేకపోతే మైనస్ అవుతుంది' అని ఉండవల్లి అన్నారు. తాను ఆటోబయోగ్రఫీ రాస్తున్నానని, అందులో చంద్రబాబుకు 30,40 పేజీలు కేటాయిస్తానని ఉండవల్లి తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జల విలయం

తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదలు సృష్టిస్తున్న బీభత్సం ఊహకు అందనంతగా ఉంది. జనజీవనాన్ని ఆ కుండపోత అతలాకుతలం చేసింది. తెలుగు రాష్ట్రాలు తడిసిముద్దయినాయి, కొన్ని ప్రాంతాలు తీవ్ర విధ్వంసాన్ని చవిచూశాయి. వర్షబీభత్సానికి పంటపొలాలు, నివాస స్థలాలు చెరువులైనాయి. వరద ప్రభావం తీవ్రంగా ఉండగానే, రెండు రాష్ట్రాలూ మరో 24 గంటలపాటు కాస్తంత హెచ్చుతగ్గులతో వర్షాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. విపరీతమైన ఆస్తినష్టంతో పాటు, ఈ ప్రకృతి విలయంలో తెలుగు రాష్ట్రాలు రెండూ ప్రాణనష్టాన్ని కూడా చవిచూడాల్సిరావడం విషాదం.

దాదాపు పదిలక్షల క్యూసెక్కుల వరద తీవ్రతను చవిచూసిన ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాలు తడిసిముద్దయినాయి. రాయలసీమలో వర్ష, వరద బీభత్సం కాస్తంత తక్కువగా ఉన్నా మిగతా ప్రాంతాలన్నీ వొణికిపోయాయి. బుడమేరు వరద విజయవాడ నగరాన్ని అతలాకుతలం చేసింది. ఇటీవలి దశాబ్దాల్లో ఈ ప్రాంతం ఇంతటి భారీ వర్షాన్ని, వరద తీవ్రతను ఎదుర్కోలేదని అంటున్నారు. ఒక్కరోజులో ముప్పైఏడు సెంటీమీటర్ల వర్షం కురిసి తీవ్ర విధ్వంసానికి, ప్రాణనష్టానికి కారణమైంది. బుడమేరుకు వరద ఎక్కువగా రావడంతో పాటు, కొల్లేరుకు నీరుపోయే మార్గం నిర్వహణ గత ఐదేళ్ళుగా సక్రమంగా లేకపోవడంతో విజయవాడకు నీరువచ్చి ఇంతటి తీవ్రస్థితిని చవిచూడాల్సివచ్చిందని కొందరి వాదన. నగరంలోని లోతట్టు ప్రాంతాలన్నీ మునిగి, మోకాలిలోతు నీటిలో నానుతున్న నేపథ్యంలో, ఆహార సరఫరాలు, సహాయక చర్యలు నిరవధికంగా సాగుతున్నాయి. కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని చాలా ప్రాంతాల్లో వరదప్రవాహంలో చిక్కుకున్నవారిని సహాయక బృందాలు రక్షించాయి.

తెలంగాణలో కొన్ని ప్రాంతాల్లో కొద్దిగంటల్లోనే యాభైసెంటీమీటర్ల వరకూ రికార్డుస్థాయి వర్షాలు కురిసి వరదలు పోటెత్తాయి. కాల్వలు తెగిపోయాయి, చెరువుల కట్టలు కొట్టుకుపోయాయి. కాలనీలు, బస్తీలు నీటమునిగాయి. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వాగులు, వంకలూ పొంగి గ్రామాలు, కాలనీలు జలమయమైనాయి. మున్నేరు వాగు వరదలతో ఖమ్మాన్ని ముంచింది. జిల్లాలో వందలాది గ్రామాలు నీటమునిగితే, నగరంలో కొన్ని భవనాల రెండో అంతస్తువరకూ నీరు చేరడం వరద ఉధృతికి నిదర్శనం.

తెలుగు రాష్ట్రాల్లో చెరువులు, కాల్వలు, వాగులు పొంగిపొర్లుతూ జాతీయ రహదారులను జలదిగ్బంధంలోకి నెట్టివేశాయి. మొదట్లో ట్రాఫిక్ మళ్ళింపులతో గమ్యానికి చేరుతున్నామన్న భ్రమలు కలిగినా, కొద్దిగంటల్లోనే దారులన్నీ మూసుకుపోయాయి. వరదనీరు నిలువునా కోసేసిన రహదారులను తాత్కాలిక మరమ్మత్తులతో తిరిగి దారికి తేవడం ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. తెలుగు రాష్ట్రాల మధ్యనే కాక, పొరుగు రాష్ట్రాలకు పోయే బస్సులు కూడా కదలని పరిస్థితి ఏర్పడింది. వందలాది రైళ్ళు రద్దుకావడం, ట్రాకుల కిందనుంచి భూమి కోసుకుపోయి అవి గాలిలో వేలాడుతుండటం జరిగిన బీభత్సానికి నిదర్శనం.

తెలుగు రాష్ట్రాల్లో సంభవించిన అపారనష్టాన్ని కేంద్రప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా ముఖ్యమంత్రులతో మాట్లాడి తగిన సహకారానికి హామీ ఇచ్చారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను పంపడం అటుంచితే, జరిగిన ఆస్తినష్టాన్ని కొంతమేరకైనా పూడ్చేందుకు కేంద్రం తనవంతు ప్రయత్నం చేయాలి. వాణిజ్యపంటలతో సహా లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. పేదలు తమ పశువులను కోల్పోయారు. జరిగిన నష్టం ఏపాటిదో, మరమ్మతులు పూర్తిచేసుకొని వ్యవస్థలన్నీ గాడిన పడేది ఎప్పటికో ఇప్పుడే కచ్చితంగా చెప్పలేనిస్థితి. ఢిల్లీ పెద్దల పర్యటనలు, కేంద్రబృందాల రాకపోకలు, అధ్యయనాలు, ఓదార్పుల అనంతరమైనా కేంద్రసాయం దండిగా దక్కాలని తెలుగు రాష్ట్రాలు కోరుకుంటున్నాయి.

హైదరాబాద్‌లో వికసిస్తున్న ఎఐ విప్లవం

మానవ కార్యకలాపాలను వినూత్నంగా మార్చివేస్తున్న అధునాతన సాంకేతికత కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–ఎఐ). ప్రపంచ దేశాలు ఎఐ సామర్థ్య విస్తృతిని అన్వేషించడంలో పోటీపడుతున్నాయి. ఆ శక్తిని ఉపయోగించుకుంటూ అందులో మరింత నైపుణ్యాన్ని సముపార్జిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'గ్లోబల్ ఎఐ సమ్మిట్–2024' ఆ సమూల పరివర్తన సాధక సాంకేతికతలో అతినూతన పోకడలపై వెలుగులు ప్రసరించనున్నది. ఆరోగ్య భద్రత, జీవశాస్త్రాలు, విద్య, వ్యవసాయం, న్యాయవ్యవస్థ, తయారీ రంగం, పౌర సేవలు ఇత్యాది రంగాలలో ఎఐ ఆధారిత నవీకరణల ప్రగాఢ, విస్తార ప్రభావ ప్రాబల్యాలను అధ్యయనం చేసి, సంబంధిత మార్పులపై మన అవగాహనను మరింతగా మెరుగుపరచుకునేందుకు ఆ సమ్మిట్ దోహదం చేయనున్నది.



ట్రాఫిక్ జామ్‌లను తగ్గించడం నుంచి అధిక దిగుబడులు సాధించడంలో రైతులకు తోడ్పడడం వరకు ప్రభుత్వాలు తమ పౌరులకు అందిస్తున్న సేవల తీరుతెన్నులను ఎఐ సాంకేతికత కొత్త పుంతలు తొక్కిస్తోన్నది. గ్లోబల్ టెక్నాలజీ కేంద్రంగా శీఘ్రగతిన వినుతికెక్కుతున్న హైదరాబాద్ ఎఐ ఆధారిత భవిష్యత్తు కల్పించే అవకాశాలను సమగ్రంగా ఉపయోగించుకునేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నది. ప్రెడిక్టివ్ ఎనలిటిక్స్, మెషీన్ లెర్నింగ్, ఆటోమేషన్ తదితర వ్యవస్థాపిత ఎఐ సాంకేతికతలు ప్రభవిస్తోన్న జెనరేటివ్ ఎఐతో కలిసి ఒక కొత్త పారిశ్రామిక విప్లవానికి దారితీస్తున్నాయి. నిన్న ఒక స్వప్నంగా, భవిష్యద్దర్శనంగా మాత్రమే ఉన్న (సకల పారిశ్రామిక కార్యకలాపాలలోనూ) ఎఐను ఉపయోగించుకోవడమనేది నేడు ఒక యదార్థంగా ఉన్నది. తెలంగాణలో సంప్రదాయక వ్యవసాయక సవాళ్లు అధిగమించేందుకు ఎఐని ఫలప్రదంగా ఉపయోగిస్తున్నారు. పంట సమాచారం, సాగు భూముల పరిస్థితులను విశ్లేషించడం ద్వారా ఎఐ, రైతుల వైయక్తిక అవసరాలకు అనుగుణమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తూ దిగుబడులను అధికం చేస్తోంది. ఎఐని ఉపయోగించుకున్న రైతులు ఎకరాకు సగటున 21 శాతం అధిక దిగుబడిని సాధించారు. పంటల సాగులో వారు ఉపయోగించే క్రిమిసంహారక మందుల వినియోగం 9 శాతం, ఎరువుల వాడకం 5 శాతం తగ్గిపోగా దిగుబడుల విక్రయ ధరలు 8 శాతం మేరకు పెరిగాయి. హైదరాబాద్‌లోను, ప్రపంచ వ్యాప్తంగా అనేక నగరాలలోను రోడ్లపై వాహనాల రాకపోకలను మరింత సమర్థంగా క్రమబద్ధం చేసేందుకు ఎఐ తోడ్పడుతున్నది. ఎఐ శక్తిదాయక వ్యవస్థలు వాహనాల రాకపోకల తీరుతెన్నులను వాస్తవ సమయం (రియల్ టైమ్)లో విశ్లేషిస్తూ, ట్రాఫిక్ లైట్లను నియంత్రించడం ద్వారా ట్రాఫిక్ రద్దీని కూడళ్లలో 30 శాతం మేరకు, కాలుష్యకారక ఉద్గారాలను 10 శాతం మేరకు తగ్గించగలుగుతున్నాయి.

అంటువ్యాధుల విజృంభణను ముందస్తుగా మదింపు వేయడం, నిధులు అధికంగా, అత్యవసరమైన వ్యాధి నిరోధక కార్యకలాపాలకు కేటాయింపులు చేయడంలో సహాయపడడం ద్వారా ఆరోగ్య భద్రతలో ఎఐ కీలకపాత్ర వహిస్తోంది. కొవిడ్ మహమ్మారి కాలంలో ఆ అనారోగ్య హానికి గురయ్యేందుకు ఎక్కువ అవకాశమున్న ప్రజా సమూహాలను గుర్తించేందుకు ప్రెడిక్టివ్ ఎనలిటిక్స్‌ను ఉపయోగించి మంచి ఫలితాలను సాధించారు. ఎఐ ఆధారిత ఆరోగ్య భద్రతా పద్ధతులు మారుమూల గ్రామాల ప్రజలకు సైతం అత్యవసర వైద్య సలహాలు సత్వరమే, సుగమంగా సమకూరేందుకు విశేషంగా తోడ్పడుతున్నాయి.

> **మానవ కార్యకలాపాలను వినూత్నంగా మార్చివేస్తున్న అధునాతన సాంకేతికత కృత్రిమ మేధ (ఎఐ). భారతదేశ సైబర్ సిటీగా ప్రసిద్ధికెక్కిన హైదరాబాద్‌లో సాటిలేని రీతిలో పెరుగుతూ, ప్రభావదాయకంగా ఉన్న నవీన సాంకేతికతల వ్యవస్థలు ఎఐ విప్లవ పురోగమనానికి సానుకూల పరిస్థితులను సమృద్ధంగా సృష్టిస్తున్నాయి. ఈ ఉత్తేజకర విప్లవ ప్రస్థానంలో ప్రతి ఒక్కరూ భాగస్వామి అయ్యేందుకు సరైన పరిస్థితులను, సబబైన భావాలను, సవ్యమైన సంధానాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న 'గ్లోబల్ ఎఐ సమ్మిట్ – 2024' సమకూర్చనున్నది.**

ప్రభుత్వాల పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు ఎఐ ఆధారిత సాధనాలు, దోహదం చేస్తున్నాయి. భారీ పరిమాణంలో ఉన్న సమాచారాన్ని విద్యుత్ వేగంతో మథించి, ప్రభుత్వ వ్యయాలలో అవకతవకలను కనుగొని వనరులను మరింత వివేకవంతంగా వినియోగించేందుకు ఎఐ తోడ్పడుతున్నది విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఎఐని ఉపయోగించి వారి అభ్యసన అనుభవాలను సమున్నతం చేసేందుకు ఎఐని ఉపయోగిస్తున్నారు. ఎఐ ఆధారిత విద్యా వేదికలు వైయక్తిక అభ్యసన శైలిని మదింపు చేసి, అందుకు అనుగుణంగా పాఠ్యాంశాలను మార్చి ప్రతి విద్యార్థికి వైయక్తికమైన విద్యాబోధన చేయడంలో ఎఐ విశేష పాత్ర వహిస్తోంది. అలాగే విద్యాసంస్థల దైనందిన పాలనా ప్రక్రియలను ఆటోమేట్ చేయడం ద్వారా ఉపాధ్యాయులు తమ దృష్టిని పూర్తిగా బోధన విధులపై కేంద్రీకరించేందుకు ఎఐ తోడ్పడుతున్నది.

పారిశ్రామిక రంగంలో వివిధ సంస్థలు తమ యూనిక్ డేటా నుంచి గరిష్ఠ ప్రయోజనం పొందేందుకు, సమస్త వేల్యూ చైన్స్ (ముడిపదార్థాల సేకరణ, ఉత్పత్తి వినియోగం, త్యజించడం, రీసైక్లింగ్ ప్రక్రియతో సహా ఒక ఉత్పత్తి సంపూర్ణ జీవితచక్రాన్ని ఉద్దేశించిన భావన)ను తిరిగి ఊహించేందుకు, తమ సిబ్బంది, యంత్రాల పనితీరును విస్తారంగా మెరుగుపరచుకునేందుకు, కొత్త కల్పనలను ప్రోత్సహించేందుకు ఎఐ విశేషంగా తోడ్పడుతున్నది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, బీమా రంగంలో అపార సమాచారాన్ని తరచిచూసి దూరదృష్టితో కూడిన నిర్ణయాలు తీసుకునేందుకు ఎఐ సహాయపడుతున్నది. తద్వారా ముందస్తు అంచనా సామర్థ్యాన్ని మెరుగుపరిచి వాస్తవ సమయంలో మోసాలు, అక్రమాలను గుర్తించి నిరోధించడం సాధ్యమవుతోంది.

మన సమస్త జీవిత పార్శ్వాలను విప్లవీకరించే శక్తి ఎఐకి ఉన్నది. ఈ అధునాతన సాంకేతికతను ఉపయోగించుకోవడం అంతకంతకూ పెరుగుతున్నందున తత్ఫలితంగా ఉత్పన్నమవుతున్న పలు క్లిష్ట విషయాలనూ నిశితంగా పరిశీలించి వాటిని పరిష్కరించుకోవడంపై దృష్టిపెట్టాల్సిన అవసరమున్నది. వ్యక్తిగత గోప్యత, పారదర్శకత, వివరణీయత, నిష్పాక్షికత, జవాబుదారీతనం, అనువర్తన, భద్రత, రక్షణ మొదలైన వ్యవహారాలలో ఎఐ మూలంగా పలు సమస్యలు నెలకొంటున్నాయి. ఎఐ మూలంగా తలెత్తే సమస్యలు, ఇక్కట్లను జరూరుగా గుర్తించి, సకాలంలో సంపూర్ణంగా పరిష్కరించుకోవాలి. ఎఐ వ్యవస్థలు సేకరిస్తున్న సమాచారం గోప్యత భంగానికి, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగానికి దారితీసే ప్రమాదమున్నది. ఎఐ వ్యూహాలు, ప్రణాళికలతో ముందుకుసాగుతున్న సంస్థలు అనేకం అపాయాలు, అవకాశాల మధ్య సమతుల్యతను ఎలా సాధించాలనే విషయమై శ్రద్ధ చూపుతున్నాయని మా (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) సొంత అనుభవాలతో పాటు టిసిఎస్ ఎఐ ఫర్ బిజినెస్ స్టడీ కనుగొన్న విషయాలూ స్పష్టం చేస్తున్నాయి.

భారతదేశ సైబర్ సిటీగా ప్రసిద్ధికెక్కిన హైదరాబాద్ ఎఐ విప్లవాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు అన్ని విధాల సర్వసన్నద్ధంగా ఉన్నది. నగరంలో సాటిలేని రీతిలో పెరుగుతూ, ప్రభావదాయకంగా ఉన్న నవీన సాంకేతికతల వ్యవస్థలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో ఎఐ విప్లవ పురోగమనానికి సానుకూల పరిస్థితులను సమృద్ధంగా సృష్టిస్తున్నాయి. హైదరాబాద్ ఒక ఉన్నతస్థాయి విద్యాకేంద్రం. నగరంలోని ఇంజినీరింగ్ కళాశాలలు ఏటా వేలాది ఇంజినీరింగ్ పట్టభద్రులను రూపొందిస్తున్నాయి. ఎఐ విప్లవాన్ని నగరంలోనే కాకుండా విశాల భారతదేశమంతటా ఎఐ విప్లవాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడంలో ఆ ప్రతిభావంతుల పాత్ర కీలకమైనది.

ఎఐ మూలంగా లక్షలాది ఉద్యోగాలు మటుమాయమవుతున్న మాట నిజం. అయితే 2025 సంవత్సరం నాటికి ఎఐ, తన మూలంగా మాయమవుతున్న ఉద్యోగాల కంటే 12 మిలియన్ ఉద్యోగాలను అధికంగా సృష్టించనున్నదని అంచనా. ఒక్క భారతదేశంలోనే రాబోయే కొద్ది సంవత్సరాలలో దాదాపు 4 లక్షల కొత్త ఉద్యోగాలు ఎఐ మూలంగా సృష్టి కానున్నాయి. ఒక్క హైదరాబాద్ నగరంలోనే వేలాది ఇంజినీరింగ్ నిపుణులు ఎఐలోను, ఎఐ సంబంధిత సాంకేతికతలలోను శిక్షణ పొందుతున్నారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్, తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఇందుకు విశేషంగా దోహదం చేస్తున్నాయి. వీటికి తోడు కొత్తగా తెలంగాణ స్కిల్స్ యూనివర్శిటీ రాబోతున్నది. శీఘ్రగతిన ఆవిర్భవిస్తున్న జాబ్ మార్కెట్ డిమాండ్లను తీర్చేందుకు అవసరమైన నిపుణులను ఆ శిక్షణా కార్యక్రమాలు తీర్చిదిద్దుతున్నాయి. హైదరాబాద్‌లోని టిసిఎస్ సెంటర్ ఎఐ సంబంధిత సాంకేతికతలలో 67 వేల మందికి శిక్షణ ఇచ్చింది. హైదరాబాద్‌లో స్టార్టప్‌లకు నూతన సాంకేతికతల సృష్టికి అద్వితీయమైన అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఈ మహానగరంలో 6000కి పైగా స్టార్టప్‌లు ఉన్నాయి. వీటిలో అత్యధిక సంస్థలు ఎఐ, మెషీన్ లెర్నింగ్ ఇన్నోవేషన్‌లో అగ్రగాములుగా ఉన్నాయి. ఉపగ్రహాలను అంతరిక్షంలోకి తీసుకువెళ్లే వ్యోమనౌకలను నిర్మించడమే కాకుండా సంబంధిత ఇతర సాంకేతికతలనూ సృష్టించే స్టార్టప్ ఒకటి హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తోంది. భద్రత, నిఘా ఏర్పాట్లకు అవసరమైన ఎఐ శక్తిదాయక రోబోలను మరొక స్టార్టప్ తయారు చేస్తోంది. దేశవ్యాప్తంగా ప్రతి స్మార్ట్ సిటీలోను ఇవి త్వరలోనే అంతర్భాగం కానున్నాయి. హైదరాబాద్ ఎఐ రంగంలో మదుపులూ పెరుగుతున్నాయి. ఈ నగరంలోని స్టార్టప్‌లు ఏటా 0.54 బిలియన్ డాలర్ల నిధులను సమకూర్చుకోగలుగుతున్నాయి.

గ్లోబల్ టెక్ కంపెనీలు, సెమికండక్టర్ కంపెనీలు, హైపర్ స్కేలర్స్, వివిధ రంగాలలోని బహుళ జాతి కంపెనీలు హైదరాబాద్‌లో విశేషంగా ఉన్నాయి. వీటి భాగస్వామ్యంతో ఎఐ విప్లవాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నది. అధునాతన సాంకేతికతలకు నెలవుగా ఉండడమే కాకుండా వాటి వికాసానికి అవసరమైన సమస్త అనుకూలతలకు సంగమ స్థలంగా ఉన్న హైదరాబాద్ ఎఐ ఆధారిత భవిష్యత్ నిర్మాణానికి సరైన నెలవు. ప్రతి ఒక్క పౌరుని శ్రేయస్సు, రక్షణకు ఉపయోగపడే ఫలప్రదమైన ఎఐ ఆధారిత భవిష్యత్ నిర్మాణానికి హైదరాబాద్ అభయమిస్తోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'గ్లోబల్ ఎఐ సమ్మిట్–2024' ఆ సమున్నత, వినూత్న భవిష్యత్తును దర్శించే అవకాశాన్ని సమకూర్చుతోంది. ఈ ఉత్తేజకర ప్రస్థానంలో ప్రతి ఒక్కరూ భాగస్వామి అయ్యేందుకు సరైన పరిస్థితులను, సబబైన భావాలను, సవ్యమైన సంధానాన్ని ఆ ప్రపంచ సదస్సు స్థిరపరచనున్నది.



◆ **వి.రాజన్న**
టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్

(సెప్టెంబరు 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో 'గ్లోబల్ ఏఐ సమ్మిట్')

రిజర్వేషన్ల సుడిలో భారత ప్రజాస్వామ్యం

ప్రజాస్వామిక రాజకీయాలలో దిగువ సామాజిక వర్గాల అభ్యున్నతికి ఒక ప్రధాన ఆలంబన రిజర్వేషన్లు. రిజర్వేషన్ల ద్వారా మాత్రమే అధికారాన్ని సాధించుకోవాలని రిజర్వేషన్ సదుపాయం ఉన్న కులాలు అభిలషిస్తున్నాయి. భారత రాజ్యాంగం ఆశించిన విధంగా ప్రత్యామ్నాయ న్యాయరాజకీయాలను అభివృద్ధిపరిచేందుకుగాను ఆ కులాలవారు తమకు తాము విశాల సమాజ అంతర్భాగాలుగా సంఘటితం కావడం లేదు. తత్కారణంగా ఆ సామాజిక సమూహాలు సరైన రాజకీయదృక్పథాన్ని పెంపొందించుకోలేకపోతున్నాయి. రాజకీయదృష్టి లేకుండా పోవడంతో కీలుబొమ్మ రాజకీయవేత్తలుగా మిగిలిపోతున్నాయి. రిజర్వేషన్ల భావన జ్యోతిబా పూలే స్ఫూర్తితో ప్రభవించిందని అంటారు. అయితే ఆయన ఎప్పుడూ రిజర్వేషన్లను కోరలేదు.

భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించిన సందర్భంలో మహాత్మా పూలే కోరిందేమిటి? తన గురువు మహదేవ్ గోవింద్ రణడేను ఆయన వ్యతిరేకించారు, కాంగ్రెస్ ఆవిర్భావ కారణాలు, దాని లక్ష్యాలను విమర్శించారు. వలసపాలన ప్రవేశపెడుతున్న ఆధునికత బ్రాహ్మణీకరణ అవడాన్ని తొట్టతొలుతనే గుర్తించిన మేధావి పూలే. దిగువ నుంచి ప్రజల (శూద్ర, అతి–శూద్ర, గులాం) అనుకూల, ప్రభావిత ఆధునికతను ఆయన ఆశించారు. వలసపాలకులు అమలుపరుస్తున్న ఆధునికీకరణకు ఆ సామాజిక వర్గాలు లబ్ధిదారులు కావాలనేది పూలే ఆకాంక్ష. బ్రిటిష్ పాలకులు కల్పిస్తున్న ఆధునిక విద్యావకాశాలను వినియోగించుకుని ఆ సామాజికులు పాలనావ్యవస్థలో ఉద్యోగులు కావాలని పూలే అభిలషించారు. కాంగ్రెస్ భారత్ భావనకు ఒక సమాంతర భారతీయ సమాజాన్ని రూపొందించాలనేది పూలే ధ్యేయంగా ఉండేది. ఆ అణగారిన సామాజిక వర్గాల భారతదేశాన్ని ఆయన నిరంతరం బ్రిటిష్ అధికార వర్గం దృష్టికి తీసుకువెళ్లేవారు. నిజానికి ఆంగ్లేయులు ఆయన నుంచే నిజమైన భారతదేశం గురించి తెలుసుకున్నారు.

కాంగ్రెస్ అచిర కాలంలోనే ఒక అఖిల భారత సంస్థగా రూపొందింది. బ్రిటిష్ పాలన ఆర్థిక పర్యవసానాల విశ్లేషణ ప్రాతిపదికన తన రాజకీయ వ్యూహాన్ని రూపొందించుకుంది. తొలినాటి కాంగ్రెస్ ఆర్థిక జాతీయవాదాన్ని ఎలుగెత్తి చాటింది. ఇది అంతిమంగా భారత జాతీయవాదంగా పరిణమించింది. భారత్‌ను ఒక జాతిగా అభివృద్ధిపరచడమే జాతీయ రాజకీయాల లక్ష్యమని ఆ భావజాలం ప్రకటించింది. అణగారిన వర్గాల వారిని తన జాతీయవాద స్రవంతిలో భాగం చేసుకుంది. ఉదాహరణకు కింది కులాల వారి మతపరమైన హక్కుల– దేవాలయ ప్రవేశం మొదలైనవి– విషయాలలో నారాయణ గురు ఉద్యమ లక్ష్యాలను కాంగ్రెస్ తన కార్యక్రమంలో భాగంగా చేసుకున్నది. సమస్త భారతీయులను ఒకే జాతి ప్రజలుగా కాంగ్రెస్ సంఘటిత పరుస్తున్నప్పుడు కాంగ్రెస్ ఉద్యమాన్ని పెరియార్ రామస్వామి సవాల్ చేశారు. రాజకీయాలలో బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని కాంగ్రెస్ లక్ష్యాలు, కార్యక్రమాలు కాపాడతాయని విమర్శించారు. మూలవాసులయిన ద్రావిడులు ఎల్లప్పటికీ అప్రధానంగా ఉండిపోతారని ఆయన భావించారు. ఈ కారణంగా బ్రాహ్మణుల ఆధిపత్యం నుంచి బయటపడేందుకు దిగువ కులాలకు ప్రాధాన్యముండే ద్రావిడోద్యమాన్ని ఆయన నిర్మించారు.



> **స్వాతంత్ర్య సాధకులు, రిపబ్లిక్ నిర్మాతలు ఆశించిన మార్పును మన ప్రజాస్వామ్యం తీసుకురాలేదు. ప్రజల ప్రజాస్వామ్యాన్ని నిర్మించేందుకు దోహదం చేసే ప్రత్యామ్నాయ రాజకీయాలను రిజర్వేషన్ వాదులు అభివృద్ధిపరచలేదు.**

ఈ భిన్న భావజాలాల ఘర్షణ నేపథ్యంలో భారతీయులు అంతా ఒకే జాతి అన్న జాగృతిని అడ్డుకునేందుకు బ్రిటిష్ పాలకులు తొలుత నిర్దిష్ట మత వర్గాలకు రిజర్వేషన్లను ప్రవేశపెట్టారు. భారత్‌లో తమ ఆధిపత్యాన్ని సుస్థిరపరచుకోవడానికి తమకు పూర్వం దేశ పాలకులుగా ఉన్న ముస్లింలకు 1909 చట్టం ద్వారా చట్టసభలలో రిజర్వేషన్లు కల్పించారు. 1857 తిరుగుబాటు అనంతరం తాము అధికారాన్ని కోల్పోయామనే భావన ముస్లింలలో తీవ్రంగా ఉండేది. తదనంతరం సిక్కులు, ఆంగ్లో ఇండియన్లు, ఆ తరువాత భూస్వాములు, సంస్థానాధీశుల కుటుంబాల వారికి కూడా రిజర్వేషన్లు కల్పించారు.

పూలే ఆలోచనా క్రమాన్ని మరింత ముందుకు తీసుకుపోయే రీతిలో భారత చరిత్రను నిర్మించేందుకు అంబేడ్కర్ తొలుత కృషి చేశారు. అదే సమయంలో ఆయన జాతీయవాదులతో ఎడతెగని రాజకీయ, సైద్ధాంతిక పోరాటాలు కూడా చేశారు. భారతీయ సమాజం ప్రధానంగా కులాల సమాజమని, అట్టడుగు కులాలవారు తమ ప్రాథమిక అవసరాలను కూడా తీర్చుకోలేని విధంగా అణచివేయబడ్డారనేది అంబేడ్కర్ వాదన. 1920వ దశకంలో కాంగ్రెస్ పూర్తిగా గాంధీ ఆధిపత్యంలోకి వెళ్లిన తరువాత అణగారిన వర్గాల అభ్యున్నతికై ఆయన రిజర్వేషన్ల మార్గాన్ని అనుసరించారు. ఆ విధంగా కుల రిజర్వేషన్ల భావనకు ఆయనే ఆద్యుడు. సమాజంలోని దిగువ స్థాయి సామాజిక వర్గాల అభివృద్ధి రిజర్వేషన్ల లక్ష్యంగా ఉండాలని ఆయన ఆశించారు. అణగారిన వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించాలన్న అంబేడ్కర్ డిమాండ్ జాతీయవాద రాజకీయాలకు సవాల్‌గా పరిణమించింది. అంబేడ్కర్ అప్పటివరకు కులాల ప్రత్యామ్నాయ చరిత్రను, పర్యవసాన ఘర్షణలను భారతదేశ చరిత్రగా నిర్మించేందుకు కృషి చేశారు. రిజర్వేషన్ల అంశాన్ని ఆయన కాంగ్రెస్ వ్యతిరేక రాజకీయాలుగా మార్చారు. కులపరమైన రిజర్వేషన్లే ప్రాదేశిక రిజర్వేషన్లకు ప్రధాన కారణం. రాజ్యాంగ సభలో ఆయన సభ్యుడు కావడంతో రిజర్వేషన్ల అంశానికి ఎనలేని ప్రాధాన్యం లభించింది. రాజ్యాంగ నిర్మాతలు అందరూ ఆ అంశానికి ప్రాధాన్యమిచ్చారు. దీంతో రిజర్వేషన్ల సాధన అణగారిన సామాజిక వర్గాల ప్రధాన లక్ష్యమయింది.

ప్రభుత్వంలో అప్రధాన పౌరులుగా భాగమయ్యేందుకు దిగువ కులాలవారికి రిజర్వేషన్లు ప్రేరణ అయ్యాయి. అవి కీలుబొమ్మ రాజకీయవేత్తలను మాత్రమే సృష్టించాయి. స్వాతంత్ర్యానంతరం అణగారిన కుల సమూహాలు రాజకీయ దృష్టిని కోల్పోయాయి. తమ సమస్యలు అన్నిటికీ రిజర్వేషన్లే సమగ్ర పరిష్కారమనే భావన వారిలో నెలకొన్నది. రిజర్వేషన్ల ఉద్యమం దిగువ స్థాయి కులాలవారిని విధేయ సమూహాలుగా మార్చివేశాయి. ఈ పరిణామాన్ని అంబేడ్కర్ 1955లోనే గుర్తించారు. పూలే, పెరియార్ ఆశించిన ప్రత్యామ్నాయ జాతీయవాదాన్ని పెంపొందించడానికి కీలుబొమ్మ రాజకీయవేత్తలు కృషిచేయలేదు. రిజర్వుడు కులాల నాయకులు ప్రాబల్య కులాల అధికార రాజకీయాలలో భాగమయ్యారు. నిజమైన ప్రజల ప్రజాస్వామ్యం ఆవిర్భావాన్ని వ్యవస్థాపిత ప్రజాస్వామ్యం అడ్డుకున్నది. పర్యవసానంగా ప్రాబల్య కులాలే అధికారాన్ని స్వాయత్తం చేసుకున్నాయి. గత 70 ఏళ్లుగా సమాజంలో ఆర్థిక అసమానతలు బాగా పెరిగిపోయాయి. స్వాతంత్ర్య సాధకులు, రిపబ్లిక్ నిర్మాతలు ఆశించిన మార్పును మన ప్రజాస్వామ్యం తీసుకురాలేదు. ప్రజల ప్రజాస్వామ్యాన్ని నిర్మించేందుకు దోహదం చేసే ప్రత్యామ్నాయ రాజకీయాలను రిజర్వేషన్‌వాదులు అభివృద్ధిపరచలేదు.

ఆ వైఫల్యమే మతరాజకీయాలను తీసుకువచ్చింది. ఆ సంకుచిత రాజకీయాలు హైందవీకరణ అయ్యాయి. అసమానతలను స్థిరపరిచాయి. అవి సహజ సిద్ధాలన్న భావనను ప్రజల మనస్సుల్లో పాదుకొల్పాయి. రాజ్యాంగంలో పొందుపరిచిన సామాజిక న్యాయం అన్న ఆదర్శం ప్రాతిపదికన ప్రజాస్వామ్యం మనాలని 21వ శతాబ్ది రాజకీయాలు డిమాండ్ చేస్తున్నాయి. కుల అంతరాలు, ఆర్థిక అసమానతలు మొదలైన సమస్యల పరిష్కారానికి ఆ మహోన్నత లక్ష్య ప్రేరిత రాజకీయాలు తప్పనిసరి. రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన కొత్త ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పేందుకు రాజకీయ అధికారాన్ని, పాలనను ప్రజాస్వామ్యీకరించాల్సి ఉన్నది.

● **ఇనుకొండ తిరుమలి**
చరిత్రకారుడు



తీరం దాటిన ప్రళయం!

అయ్యో ఎంత ఘోరం
ఈ తుఫాను విధ్వంసకాండ...

తెలుగునేల గుండెల్లో
ప్రకృతి విసిరిన జలఖడ్గం

సుజలాం... సుఫలాం..
ముక్కలైన వాక్యాలు
నేడు ఖండిత హృదయమై...
భరతమాత

కనుచూపు మేరా నీటి ఎడారి
కనువిప్పు లేని మనిషి బికారి

కన్నీటి వరదలో
మునిగిన పేదరికం
నేలరాలిన చేలు
వెన్ను విరిగిన రైతన్నలు

తినే తిండి ఉండే గుడిసె
కట్టుకునే బట్ట గొడ్డు గోదా
సర్వం గంగార్పణం
రామ్ తేరి గంగా మైలీ

ఆకుపచ్చని సముద్రంలో
అల్పపీడన ద్రోణి
కన్నీటి ద్వీపంలో గ్రామాలు
నీటి మంటల్లో కాలుతూ...

ఆకలి ఎలుగెత్తి పిలుస్తూంటే
ఆకాశంనుంచి రాలే
ఆహారపొట్లాలకై
ఎదురుచూస్తూ... సామాన్య జనం

మనిషితనమే ముంపుకు గురై..
అడవులను నరికేస్తూ
చెరువుల దురాక్రమణలో
చెరుపు చేసిన అధికారం
ఈ నీతితప్పిన స్వార్థ జగాన
నెపం ఎవరిపైన వేద్దాం?

ఏ నీటి సంగ్రామంలో నైనా
బలయ్యేది బడుగుజీవులే కదా

లోకమే కాదు కాలమూ
కలుషితమైన నేపథ్యంలో.
విషతుల్యమైన పర్యావరణం
నెత్తుటి జెండా ఎగురేస్తూ...

నీరైనా కన్నీరైనా
తీరం దాటితే ప్రళయమే!!

ఇప్పుడిక్కడ
నీట మునిగిన నేలతల్లికి
చేయూత నిచ్చేందుకు
ఆపన్న హస్తాలు కావాలి

మనిషిభాష తెలిసిన వారెవరైనా
దయచేసి అనువదించండి
అందరం మానవహారమై
కలసికట్టుగా కదలిరావాలి అని

ఎలుగెత్తి చాటండి
ఎగిరే జాతీయ జెండాలుగా...

–సరికొండ నరసింహరాజు

సాగు హక్కుకు గుర్తింపు ఏదీ?

తెలంగాణ ప్రభుత్వం భూమికి సంబంధించి రెండు ముఖ్యమైన విషయాలపై తన విధానాన్ని రూపొందించే పనిలో ఉంది. ఒకటి భూమి హక్కులను నమోదు చేసే చట్టం, రెండోది భూమి సాగుకు మద్దతును ఇచ్చే రైతు భరోసా పథకం. అయితే రెండూ ఒక దానితో ఒకటి సంబంధం లేని అంశాలుగా ప్రభుత్వం పరిగణిస్తున్నట్లు కనబడుతున్నది. కేవలం మొక్కుబడి మార్పులతో, పైపై మెరుగులతో సరిపుచ్చుతున్నది. తద్వారా నిజమైన సాగుదారుకు గుర్తింపు, మద్దతు లేకుండా, ఎటువంటి హక్కూ లేకుండా చేస్తోంది.

రైతు భరోసా పథకం ఎలా ఉండాలో ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తూ, పంట పెట్టుబడి ఎవరికి, ఏ భూమికి, ఎంత భూమికి పరిమితం చేయాలి అనే విషయాలను ప్రభుత్వ పెద్దలు చర్చిస్తున్నారు. ఈ సమావేశాల్లో నిజంగా సాగు చేసే రైతుకే, సాగులో ఉన్న భూములకే పంట పెట్టుబడి ఇవ్వాలనే వాదన బలంగా వినిపిస్తుంది. చిత్రం ఏమిటంటే పూర్వపు టీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన మార్గదర్శకాల్లో కూడా ఇదే విషయం ఉంది. అయితే ఆ ప్రభుత్వం స్వంత మార్గదర్శకాలనే ఉల్లంఘిస్తూ సాగుతో సంబంధం లేకుండా లక్షల ఎకరాలకు వేల కోట్ల రూపాయలు పంచింది. అర్హత లేకుండా డబ్బులు తీసుకున్నారని ఇప్పుడు భూమి యజమానులకు నోటీసులు కూడా ఇస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ప్రభుత్వ ఉన్నతాధికారుల డొల్లతనం బయటపడుతుంది. ఏ ఎండ కా గొడుగు పట్టినట్లు ఏ ప్రభుత్వం వస్తే వారి భజన చేస్తూ ఎప్పటికీ వారు తమ పబ్బం గడుపుతున్నట్లే కనబడుతుంది. అందుకే ముఖ్యమైన రెవెన్యూ, పరిశ్రమలు, పెట్టుబడి శాఖల్లో అదే అధికారులు మార్పు లేకుండా కొనసాగుతున్నారు. అధికారంలో ఉన్న నాయకులు కూడా స్వంత ప్రయోజనాల కోసం ఈ అధికారుల సహకారమే కావాలి కాబట్టి వారిపై చర్యలు తీసుకోరు. మొత్తంగా నాయకులు, అధికారులు కుమ్మక్కై ప్రభుత్వాన్ని, పాలనను, ప్రజాస్వామ్యాన్ని భ్రష్టుపట్టిస్తున్నారు.

భూమి యజమాని తన భూమిపై హక్కు కోల్పోకుండా, వాస్తవ సాగుదారునే (ప్రస్తుతం ఎక్కువగా మహిళలే) రైతుగా గుర్తించి వారికే వ్యవసాయ సంబంధిత అన్ని సహాయ సహకారాలు అందించడం ఎలాగ అన్నదే ప్రస్తుతం ప్రభుత్వం ముందు, తెలంగాణ సమాజం ముందు ఉన్న బలమైన సమస్య. గత టీఆర్ఎస్ ప్రభుత్వం అసలు కౌలుదారు, సాగుదార్ల ఉనికినే గుర్తించ నిరాకరించింది. భూమి యజమాని ఇరుసుగానే తన మొత్తం రాజకీయ ఎజెండా నిర్మించుకుంది. అందుకోసమే భూమి విలువలు విపరీతంగా పెరిగేలా చర్యలు తీసుకుంది. వాస్తవ సాగుదార్లు కొత్తగా భూమి పొందే అన్ని మార్గాలు మూసేసింది.

హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన వెంటనే, అప్పటి సైనిక పాలనాధికారి నేతృత్వంలో హైదరాబాద్ కౌలుదారీ, వ్యవసాయ భూముల చట్టం 1950 రూపొందింది. అప్పటి తెలంగాణ సాయుధ పోరాటం, తద్వారా మారుమోగిన 'దున్నేవాడిదే భూమి' నినాదం, వేల మంది పేదల త్యాగాల ఫలితంగా రాజ్యానికి ఒక తప్పని పరిస్థితి ఫలితమే ఆ చట్టం. అప్పటి తెలంగాణ సమాజ అసలు సిసలు ఆకాంక్ష. అయితే చట్టం రూపొందిన, ఆ తరువాత ముఖ్యమైన మూడు సంవత్సరాలలో, అప్పటి దొరల, భూస్వాముల ఒత్తిడితో చట్టంలో పేర్కొన్న విధంగా నిజమైన సాగుదార్ల పేర్లు పూర్తి స్థాయిలో నమోదు కాలేదు. తద్వారా రక్షిత కౌలుదార్లకు ఉన్న హక్కులను కొన్ని వేలమంది పొందలేకపోయారు. సదరు చట్టం పూర్తిగా అమలులోకి వచ్చే సమయంలో పాలన ఆంధ్ర ప్రాంత నాయకత్వంలోకి వెళ్లటంతో, చట్టం అమలుకు నోచుకోకపోవడమే కాక, తెలంగాణ ఆత్మను, అస్తిత్వాన్ని చెరిపివేసే చర్య 1969 సవరణ చట్టం ద్వారా జరిగింది. తెలంగాణ ప్రాంతంలో భూ బదలాయింపులపై 1950 చట్టంలోని 5వ అధ్యాయంలో ఉన్న ఆంక్షలన్నింటినీ ఎత్తివేశారు. దాని ఫలితం ఏమైందో ఇప్పుడు అందరికీ తెలిసిందే.

> **భూమి యజమాని తన భూమిపై హక్కు కోల్పోకుండా, వాస్తవ సాగుదారునే రైతుగా గుర్తించి వారికే వ్యవసాయ సంబంధిత అన్ని సహాయ సహకారాలు అందించడం ఎలాగ అన్నదే ప్రస్తుతం ప్రభుత్వం ముందు, తెలంగాణ సమాజం ముందు ఉన్న బలమైన సమస్య**



1950 చట్టం ద్వారా అప్పటి హైదరాబాదు రాష్ట్రం, నేటి తెలంగాణ ప్రాంతంలో సాధారణ కౌలు వ్యవస్థ నిషేధించబడింది. సాధారణ రైతులు తమ భూములు ఇతరులకు లీజుకు ఇవ్వకుండా ఆంక్షలు విధించారు. నేటికీ ఆ చట్టమే అమలులో ఉంది. అయితే కేవలం కాగితాల్లోనే. 1950లో భూములు పొందిన లక్షలాది మంది సాగుదార్లు తమ భూములు కోల్పోకూడదనేదే సదరు చట్టం ఉద్దేశం. అంటే, దున్నేవాని చేతిలోనే భూమి ఉండాలని. తెలంగాణ కౌలుదారీ చట్టం రక్షిత కౌలుదారులకు, సాధారణ భూ యజమానులకు రక్షణ కల్పిస్తుంది. గత మూడు దశాబ్దాలలో తెలంగాణ ప్రాంతంలో నక్సలైట్ ఉద్యమ ప్రభావం తగ్గి, పాత ఆధిపత్య వర్గాలు, కొత్తగా ఉనికిలోకి వచ్చిన ఉద్యోగ, వ్యాపార, వృత్తి వర్గాలు ఆంధ్రీకరించబడటం, అనగా భూమి ఆధారిత పెట్టుబడిదారీతనం పెరగడంతో, తెలంగాణ సన్న చిన్నకారు రైతులు, శ్రామిక కుటుంబాలు, భూ సంస్కరణల్లో భాగంగా భూమి పొందిన వారు తమ భూమి హక్కులను కోల్పోతూ ఉన్నారు. స్వయంగా వ్యవసాయం చేయలేని భూ యజమానుల సంఖ్య విపరీతంగా పెరిగింది. భూమి లేని సాగుదార్లు పెరిగి, దున్నేవానిదే భూమి అనే నినాదం నుంచి దున్నేవారికే సాగు మద్దతు అనే పరిస్థితికి వచ్చింది.

1950 చట్టంలోని 6వ అధ్యాయం, ఎవరైనా తమ భూమిని అస్సలు సాగుచేయని, సరిగ్గా సాగుచేయని పరిస్థితుల్లో లేదా మిగులు భూముల విషయంలో ఏమి చేయాలో స్పష్టంగా చెబుతోంది. భూమి యజమానుల ఆస్తి హక్కుకు భంగం కలగకుండా, వారు స్వయంగా సాగుచేయడానికి ముందుకు వచ్చే వరకు, ప్రభుత్వం ఆ భూములను తాత్కాలికంగా స్వాధీనం చేసుకుని సాగుచేయగల పేదలకు, సన్న చిన్నకారు రైతులకు ఆ భూములను సాగుచేసే అవకాశం కల్పించవచ్చు. ప్రభుత్వం నిర్ధారించిన మేరకు మిగులు మొత్తంలో కొంత భూ యజమానులకు కూడా ఇవ్వవచ్చు. అలాగే 3వ అధ్యాయంలో ఏ సందర్భాలలో భూ యజమానులు తమ భూములను కౌలుకు ఇవ్వవచ్చో, వాటి విధివిధానాలు కూడా ఉన్నాయి. చట్టంలోని ఈ అవకాశాలను నేటి అవసరాలకు, పరిస్థితులకు అనుగుణంగా అమలు చేస్తే, సాగుచేయని భూ యజమానులకు పంట రుణాలు, రైతుబంధు, భరోసా, బీమా, రుణమాఫీ వంటివి అందవు. కేవలం సాగుచేసే వారికే, సాగు చేసినంత కాలం సదరు మద్దతు అందుతుంది. భూ యజమానులు తన భూమి హక్కును కోల్పోరు. సదరు చట్టాన్ని అమలుచేయడానికి, కావలసిందల్లా ప్రభుత్వం వైపు నుంచి సంకల్పమే.

అయితే అటువంటి సంకల్పం గత ప్రభుత్వంలో లేదు, ప్రస్తుత ప్రభుత్వంలోనూ కనపడటం లేదు. ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఆర్.ఒ.ఆర్. 2024 చట్టమే దానికి నిదర్శనం. సమగ్ర భూమి, సాగుదార్ల సర్వే చేపట్టకుండా, సమగ్రమైన రెవెన్యూ కోడ్‌ను రూపొందించకుండా అరకొరగా భూమి హక్కుల నమోదు చట్టం రూపొందించే పని చేపట్టింది. ధరణి చట్టంలో గత ప్రభుత్వం తొలగించిన 1971 చట్టంలోని చాలా అంశాలను తిరిగి పొందుపరిచినా, సాగుదారు నిర్వచనాన్ని, సాగుహక్కు నమోదుకు లేదా గుర్తింపునకు అవకాశాన్ని ప్రతిపాదిత చట్టంలో లేకుండా చేశారు. తద్వారా, సాగుదారుకు సంబంధించి కేసీఆర్ ఆలోచనా ధోరణినే ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు కూడా కొనసాగిస్తున్నట్లు కనబడుతున్నది.

ఈ పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ సమాజం ఒక సాహసోపేత నిర్ణయం తీసుకునే సందర్భం వచ్చింది. భూమి కమతాలు, భూమి సంబంధాలు, భూమి వినియోగం, మొత్తంగా సమాజం ప్రజాస్వామ్యయుతం కావాలని కోరుకునే సంఘాలు, పార్టీలు, వ్యక్తులు, ఈ విషయంలో నిరంతరం పని చేస్తూ శ్రామికులు, సాగుదార్లను, ముఖ్యంగా మహిళలను సంఘటితపరుస్తూ విస్తృత ఉద్యమం నిర్మించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ సమాజం శ్రామిక విలువలు కలిగిన నైతిక సమాజంగా రూపొందుతుందా, లేక పూర్తి పెట్టుబడిదారీ, శ్రమ దోపిడీ విలువలతో అనైతిక సమాజంగా రూపొందుతుందా అనేది ఈ నిరంతర ప్రయత్నం, ఫలితంపైనే ఆధారపడి ఉంది.

■ **రవికుమార్**
న్యాయవాది

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 23.8 కనిష్ఠం 21.4

4 నుంచి 28 గంటలు

అంధకారం..!

చిన్నపాటి వర్షానికే వణికిన విద్యుత్ వ్యవస్థ



- మధురానగర్ బీ బ్లాక్‌లో 28 గంటలపాటు చీకట్లు
- గోపన్‌పల్లి జర్నలిస్ట్‌కాలనీలో 5 గంటలు..
- పలు ప్రాంతాల్లో 6 గంటల పాటు..
- అంతరాయాలపై స్పందించని యంత్రాంగం
- క్షేత్రస్థాయిలో ఫోన్లు ఎత్తని సిబ్బంది, అధికారులు
- మరమ్మతు పనుల్లో తీవ్ర జాప్యం
- విరిగిన విద్యుత్ స్తంభాలను మార్చడంలో విపరీత నిర్లక్ష్యం
- ముందస్తు చర్యలు తీసుకోని విద్యుత్‌శాఖ
- కరెంట్ లేక పలుచోట్ల తప్పని అవస్థలు
- గ్రేటర్‌లో విరిగిన 412 విద్యుత్‌స్తంభాలు

మరో రెండు రోజులు..

నగరంలో సోమవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు 22 గంటల్లో గచ్చిబౌలిలో అత్యధికంగా 9.7 సెం.మీ వర్షపాతం నమోదైంది. హెచ్‌సీయూ పరిధిలో 8.5, లింగంపల్లిలో 8.5, హైదర్‌నగర్‌లో 8.0, బాలాజీనగర్‌లో 7.5, కేపీహెచ్‌బీలో 7.4, చందానగర్‌లో 7.3 సెం.మీ వర్షం కురిసింది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉప్పల్ న్యూ నాగోల్ పరిధిలో 13.3 మిల్లీమీటర్లు, జీడిమెట్లలో 8.5, కుత్బుల్లాపూర్‌లో 6.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. హుస్సేన్‌సాగర్ ఫుల్‌ట్యాంక్ లెవల్ 513.41 మీటర్లు కాగా, సోమవారం రాత్రి 9 గంటలకు నీటి మట్టం 513.67 మీటర్లుగా ఉంది. ఇదిలాఉండగా గ్రేటర్‌లో మరో రెండురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని బేగంపేట వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్2 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షానికే గ్రేటర్‌లో విద్యుత్ వ్యవస్థ వణికిపోయింది. కొన్ని ప్రాంతాల్లో గంటలకొద్దీ సరఫరా నిలిచిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ బీబ్లాక్‌లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సోమవారం రాత్రి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా లేదు. 11 ఇళ్లు, రెండు అపార్ట్‌మెంట్లు ఆదివారం రాత్రంతా అంధకారంలో ఉన్నాయి. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు 28 గంటల సమయం పట్టడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లు లేక, ఫోన్లు స్విచ్ఛాఫ్ అయి అపార్ట్‌మెంటువాసులు అసౌకర్యానికి గురయ్యారు. ఆదివారం కురిసిన 4.6 సెంటీమీటర్ల వర్షానికే గచ్చిబౌలి గోపన్‌పల్లి, మోతీనగర్, బీకేగూడ, కూకట్‌పల్లి, మియాపూర్, శేరిలింగంపల్లి, అంబర్‌పేట చెన్నారెడ్డినగర్, తిరుమలగిరి, వనస్థలిపురం, ఖైరతాబాద్ న్యూ సీబీఐ క్వార్టర్స్, కర్మన్‌ఘాట్ ప్రాంతాల్లో 4 నుంచి 6 గంటల పాటు విద్యుత్‌సరఫరాలో అంతరాయం తలెత్తడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. కరెంటు గంటల కొద్దీ నిలిచిపోయి వేల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నా, క్షేత్రస్థాయి సిబ్బందితో పాటు ఏఈలు, ఏడీలు ఫోన్లు లేపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు లేకపోయినా తరచూ రోజుకు నాలుగైదు సార్లు విద్యుత్‌సరఫరాలో అంతరాయాలు నెలకొంటున్నాయని సిద్దిక్‌నగర్‌కు చెందిన నితిన్ తెలిపారు.



మధురానగర్ బీబ్లాక్‌లో క్రేన్‌తో విద్యుత్‌స్తంభం ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

మరమ్మతుల్లో తీవ్ర జాప్యం

నగరంలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ మూడు రోజుల ముందే హెచ్చరికలు జారీ చేసినా విద్యుత్‌శాఖ ముందస్తు చర్యలు చేపట్టలేదు. స్తంభాలు విరిగి, తీగలు తెగిపడిన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఫీడర్లు, మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలి. ఆ తర్వాత మరమ్మతు పనులు చేపట్టాలి. అధికారులు అలాంటి చర్యలేవి తీసుకోకపోవడంతో చాలా ప్రాంతాల్లో 4 నుంచి 6 గంటల పాటు కరెంట్ సరఫరా లేక స్థానికులు అవస్థలు పడ్డారు. మధురానగర్‌లో ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ స్తంభాలు

మిగతా 8వ పేజీలో..

ప్రాంతం	కరెంట్ నిలిచిన సమయం
మధురానగర్ బి బ్లాక్	28 (గంటల్లో)
మచ్చబొల్లారం	6
మొట్టుగూడ	6
గచ్చిబౌలి గోపన్‌పల్లి	5
మోతీనగర్	4
ఎస్ఆర్‌నగర్	4
మచ్చబొల్లారం	4
కూకట్‌పల్లి	4
ఆనంద్‌నగర్ కాలనీ	4

ఆదివారం పలు ప్రాంతాల్లో నిలిచిన కరెంట్





సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల పడిగాపులు

ప్రయాణికుల పాట్లు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా పలు రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికులు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పడిగాపులు కాస్తున్నారు. రైళ్లు ఎప్పుడు నడుస్తాయో అని ఎదురుచూస్తున్నారు. సోమవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వయా కాజీపేట, కాగజ్‌నగర్ వైపు కొన్ని ప్యాసింజర్ రైళ్లు మాత్రమే నడిచాయి. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి ఉదయం 6.15 గంటలకు బయలుదేరాల్సిన వందేభారత్ రైలు 11.25 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్ నుంచి బయలుదేరింది.

సాఫీగా సోమవారం!

- వర్షం పడినా ట్రాఫిక్ తిప్పలు అంతంతే
- ఫలించిన అనౌన్స్‌మెంట్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): సోమవారం వచ్చిందంటే చాలు.. నగరంలోని రోడ్లపై వాహనాలు పోటెత్తుతుంటాయి. ప్రధాన రహదారుల్లో బారులు దీరి వెళ్తుంటాయి. సమయానికి ఆఫీసుకు చేరుకోవాలని ఇంటి నుంచి హడావిడిగా బయలుదేరిన ఉద్యోగులు మార్గమధ్యలో ట్రాఫిక్‌తో సతమతమవుతుంటారు. నిర్ణీత టైం కంటే 10-15 నిమిషాల ఆలస్యంతో చేరుకుని బాస్‌లతో చీవాట్లు ఎదుర్కొనే సందర్భాలున్నాయి. అయితే నగరంలో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని సోమవారం మెజార్టీ ఐటీ కంపెనీలు ఉద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోం ఇచ్చాయి. అలాగే విద్యాసంస్థలకు ప్రభుత్వం ముందస్తుగా సెలవు ప్రకటించింది. ఇదే సమయంలో జీహెచ్ఎంసీ అధికారులు రెండు రోజులుగా నగర వ్యాప్తంగా వర్షాలపై అప్రమత్తం చేస్తున్నారు. అత్యవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని, లేకుంటే

మిగతా 8వ పేజీలో..



గాంధీలో మందుల కోసం క్యూ

ఆస్పత్రులు కిటకిట

- వైరల్ ఫీవర్లతో బాధితుల క్యూ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లోని ఆస్పత్రులు రోగుల తాకిడితో కిటకిటలాడుతున్నాయి. జ్వరాలతో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య విపరీతంగా పెరిగింది. సోమవారం నగరంలోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల ఓపీ వద్ద పెద్దపెద్ద క్యూలు కనిపించాయి. ఫీవర్ ఆస్పత్రికి ఓపీ కేసులు బాగా పెరిగాయి. ప్రస్తుతం రోజూ 600 నుంచి 800 వరకు ఓపీ ఉంటోంది. వైరల్ ఫీవర్లు, డెంగీ, వాంతులు, విరోచనాలు, జాయింట్స్ పెయిన్స్, చలిజ్వరంతో బాధితులు ఆస్పత్రి వద్ద క్యూ కట్టారు. ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు 1500 నుంచి 2 వేల వరకు ఓపీ కేసులు ఉంటున్నాయి. ఇందులో సగానికంటే ఎక్కువగా వైరల్ ఫీవర్లు, డెంగీ, టైఫాయిడ్, మలేరియా కేసులు ఉంటున్నాయి. నీలోఫర్‌లోనూ పిల్లల ఓపీ పెరిగింది. ఇక కార్పొరేట్ ఆస్పత్రుల ఓపీ విభాగాల్లో 90 శాతం వైరల్ ఫీవర్లే ఉంటున్నాయి. ప్రతీ ఇంట్లో ఒకరిద్దరు జ్వరం, నీరసంతో మంచానపడుతున్నారు. ఒకరి తరువాత మరొకరు వైరల్‌ఫీవర్ల బారిన పడుతున్నారు.

నిషేధం ఉన్నా హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేస్తారా?

- పీవోపీ విగ్రహాలపై ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): హుస్సేన్‌సాగర్‌లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) విగ్రహాలను వేయరాదన్న ఉత్తర్వులు ఉన్నప్పటికీ అందులోనే నిమజ్జనం చేయడానికి ఏర్పాట్లు చేస్తుండటంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. పీవోపీ విగ్రహాలను నిమజ్జనం చేయరాదని 2021లోనే హైకోర్టు స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం ఈ ఏడాది కూడా ఏర్పాట్లు చేస్తోందని పిటిషనర్ మామిడి వేణుమాధవ్ పేర్కొన్నారు. ఆగస్టు 28న ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేసి ఏర్పాట్లను సమీక్షించిందని, 33 క్రేన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. దీనిపై వివరణ ఇవ్వడానికి వారంరోజులు సమయం ఇవ్వాలని ఏజీ ఇమ్రాన్‌ఖాన్ కోరారు. సమయం ఇవ్వడాన్ని మామిడి వేణుమాధవ్ వ్యతిరేకించారు. ప్రభుత్వ న్యాయవాదులు ఏటా ఇలాగే సమయం తీసుకుంటూ హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. పిటిషనర్ వాదనపై ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు.. చివరి నిమిషంలో కోర్టుకు వచ్చి తమపై ఒత్తిడి తెస్తున్నారని వ్యాఖ్యానించింది. ఇలా బ్లాక్‌మెయిల్ చేయడాన్ని సహించబోమని స్పష్టంచేసింది. విచారణను ఈనెల 9కి వాయిదా వేసింది.

65 చెరువుల సర్వే పూర్తి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎండీఏ పరిధిలో ఆగస్టు 1 నుంచి ఇప్పటి వరకు 65 చెరువుల సర్వే పూర్తయిందని అధికారులు తెలిపారు. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, హైదరాబాద్, సిద్దిపేట, మెదక్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో చెరువుల సర్వే చేసేందుకు ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగా హెచ్ఎండీఏ కమిషనర్ సోమవారం ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. మరో 269 చెరువులకు సంబంధించిన ప్రాథమిక సమాచారం సేకరించామని, మరో 51 చెరువుల ఫైనల్ నోటిఫికేషన్ పూర్తికావాల్సి ఉందని అధికారులు తెలిపారు.

నగరంలో సాకర్ కేక

- 30 ఏళ్ల తర్వాత హైదరాబాద్‌లో అంతర్జాతీయ మ్యాచ్‌లు
- నేడు మారిషస్‌తో భారత్ ఢీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): దేశ ఆధునిక ఫుట్‌బాల్ చరిత్రతో భాగ్యనగరానిది విడదీయలేని అనుబంధం. భారత సాకర్ స్వర్ణ యుగంగా చెప్పుకునే 1950 నుంచి 1962 వరకు హైదరాబాద్ కేంద్రంగానే భారత ఫుట్‌బాల్ మొత్తం నడిచేది. చివరిసారిగా 2003లో ఆఫ్రో ఆసియా క్రీడల్లో భాగంగా హైదరాబాద్‌లో అంతర్జాతీయ సాకర్ మ్యాచ్‌లు జరిగాయి. ఆతర్వాత మళ్లీ ఇన్నాళ్లకు హైదరాబాద్ వేదికగా అంతర్జాతీయ ఫుట్‌బాల్ మ్యాచ్‌లు జరుగుతుండడం విశేషం. మంగళవారం నుంచి 9వ తేదీ వరకు జీఎంసీ బాలయోగి గచ్చిబౌలి ఫుట్‌బాల్ స్టేడియంలో ఇంటర్‌కాంటినెంటల్ కప్ పోటీ జరగనుంది. ఇందులో భారత్‌తో పాటు మారిషస్, సిరియా దేశాలు పాల్గొంటున్నాయి. ఈ మూడు జట్ల మధ్య జరిగే పోరులో ఏ జట్టు ఎక్కువ మ్యాచ్‌లు గెలిస్తే ఆ టీమ్‌కు ట్రోఫీ లభించనుంది. మంగళవారం రాత్రి 7.30 గంటలకు భారత్-మారిషస్ మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ ప్రారంభానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవనున్నారు. రేవంత్ సీఎం అయ్యాక సుమారు రూ.16 కోట్ల వ్యయంతో ఈ ఫుట్‌బాల్ స్టేడియాన్నీ ఆధునీకరించి, తిరిగి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చారు.



పోటీలకు సిద్ధమైన జీఎంసీ బాలయోగి గచ్చిబౌలి స్టేడియం

రహీంతో ఆద్యం

ఎస్ఏ రహీం మొదలు విక్టర్ అమల్‌రాజ్ వరకు మనదేశ ఫుట్‌బాల్ జట్టులో హైదరాబాదీలు ఒకప్పుడు తిరుగులేని ఆధిపత్యం చెలాయించారు. భారత్ జట్టు చీఫ్ కోచ్‌గా రహీం పని చేసిన కాలంలో టీమిండియా 1954 మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలవగా, 1951, 1962 ఆసియా క్రీడల్లో విజేత కావడం విశేషం. ఆసియాలోనే గొప్ప గోల్‌కీపరైన పీటర్ తంగరాజ్, మిడ్‌ఫీల్డరైన తులసీదాస్ బలరాం, 1970వ దశకంలో భారత్ జట్టుకు నాయకత్వం వహించిన షబ్బీర్ అలీ, విక్టర్ అమల్‌రాజ్ వంటి ఆటగాళ్లంతా హైదరాబాదీలే కావడం విశేషం.

దారులు దారుణం

వర్షంతో దెబ్బతిన్న రోడ్లు



బాచుపల్లి ఇందిరానగర్ రోడ్డు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రోడ్డు, కాలనీ రోడ్డు.. ఏది చూసినా, ఎక్కడ చూసినా కంకర తేలి, గుంతల పడి అధ్వాన్నంగా కనిపిస్తున్నాయి. భారీ వర్షాలకు రోడ్లు దెబ్బతిని దారుణంగా మారాయి. గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల పెద్ద గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు కష్టంగా మారింది. ఆబిడ్స్‌లో పలు ప్రాంతాల్లో దారి పొడవునా గుంతలే. టోలిచౌకి ఆదిత్య కాలనీలో గుంతల్లో రోడ్డు నిలిచిపోవడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. బాచుపల్లి నుంచి ప్రగతినగర్ రోడ్డుపై కంకర తేలడంతో వాహనాలు నడపలేని పరిస్థితి ఏర్పడింది.



ముషీరాబాద్ రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో మురుగునీరు



వర్షం నీటితో నిండిన టోలిచౌకిలోని ఆదిత్యకాలనీ రోడ్డు



కంకరతేలిన ప్రగతినగర్ రోడ్డుపై నిలిచిన ఆటో



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 21వ డివిజన్ సాయినగర్‌లో డ్రైనేజీ పనుల కోసం తవ్వివదిలేసిన రోడ్డు.. వర్షాలకు ఇలా దారుణంగా తయారైంది.



ఆబిడ్స్‌లోని ఓ రహదారి దుస్థితి

గుంతలను పూడ్చండి

- మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్

8

వరదల్లో మరణించిన వారికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

● ఎంపీ ఈటల రాజేందర్

మల్కాజిగిరి, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో వరదల్లో మరణించిన ఒక్కొక్కరికి ప్రభుత్వం తక్షణమే రూ. 50లక్షల నష్టపరిహారం ప్రకటించాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వరదల వల్ల కొట్టుకుపోయిన రోడ్లు, బ్రిడ్జీలను తక్షణమే ఉపయోగంలోకి తేవాలని కోరారు. నిర్వాసితులకు వరదసహాయక కేంద్రాల్లో అన్ని వసతులతో పాటు భోజన సదుపాయం ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరద తగ్గుముఖం పట్టిన అనంతరం ప్రభుత్వం నష్టపోయిన పంటపొలాలను పరిశీలించి రైతులను ఆదుకోవాలని సూచించారు. అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యఆరోగ్య సిబ్బంది అవసరం మేరకు మందులను అందుబాటులో ఉంచాలని ఆయన పేర్కొన్నారు. బీజేపీ నాయకులు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సైతం వరద బాధితులకు సహాయ సహకారాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

హైటెక్‌సిటీ స్టేషన్‌లో సస్టెయినబుల్ రైడ్స్ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మెట్రోరైల్, స్విదా మొబిలిటీ ఆధ్వర్యంలో హైటెక్‌సిటీ మెట్రో స్టేషన్‌లో సోమవారం సస్టెయినబుల్ రైడ్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ నగరంలోని మెట్రో రైలు కారిడార్లలో ఏర్పాటు చేసిన ఫీడర్ సర్వీసుల ద్వారా ఇప్పటివరకు 50 లక్షల మంది ప్రయాణించినట్లు చెప్పారు. 15 స్టేషన్ల నుంచి 64 రూట్లలో స్విదా సంస్థ ఫీడర్ సర్వీసులను నడుపుతోందన్నారు. మెట్రో మార్గాల్లో షటిల్ సర్వీసులను నడిపించడం ద్వారా కర్బన ఉద్గారాలను తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం మెట్రో షటిల్ సర్వీసులో ప్రయాణం చేసేందుకు బిల్‌ఈజీ యాప్‌తో కలిసి వాట్సాప్‌లోనే టికెట్లు బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్అండ్‌టీ ఎండీ కేవీబీ రెడ్డి, స్విదా మొబిలిటీ సీఈఓ సిద్ధార్థ్ రవి, కో ఫౌండర్ జిగ్నేష్ పి.బెల్లానీ, అధికారులు పాల్గొన్నారు.


మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న కేవీబీ రెడ్డి, సిద్ధార్థ్ రవి, జిగ్నేష్ పి.బెల్లానీ

మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

● సీసీ కెమెరాలన్నీ పనిచేసేలా చూడాలి ● 90 రోజుల బ్యాకప్ ఉండాలి
● డయల్ 100, పోలీసు అధికారుల నంబర్లతో బోర్డులు ఏర్పాటు చేయాలి
● హోటళ్ల నిర్వాహకులతో శిఖాగోయల్

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): హోటళ్లల్లో మహిళలు, చిన్నారుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మహిళా భద్రత విభాగం చీఫ్ శిఖా గోయల్ చెప్పారు. హైదరాబాద్‌లోని ప్రముఖ హోటళ్ల యాజమాన్యాలు, నిర్వాహకులతో భద్రత విషయంలో చేపట్టాల్సిన చర్యలపై డీజీపీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం షీఖాగోయల్ సమీక్ష నిర్వహించారు. వినియోగదారుల భద్రతకు తీసుకుంటున్న చర్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హోటళ్లలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ టీవీ స్టోరేజీ బ్యాకప్ సమయం ప్రస్తుతం ఉన్న 60 రోజుల నుంచి 90 రోజులకు పెంచాలని సూచించారు. హోటళ్లలో ఉన్న అన్ని సీసీ కెమెరాలు తప్పనిసరిగా పనిచేసేలా చూసుకోవాలన్నారు. రిసెప్షన్, ఇతర ప్రాంతాల్లో పోలీసుల అత్యవసర నంబర్లు డయల్-100తోపాటు స్థానిక పోలీస్‌స్టేషన్, ఇతర అధికారుల ఫోన్ నంబర్లు కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని హోటళ్ల నిర్వాహకులకు శిఖాగోయల్ స్పష్టం చేశారు. హోటళ్లకు వచ్చే గెస్ట్‌ల గుర్తింపు కార్డుల్ని నిశితంగా పరిశీలించాలని, ఎవరి మీదైనా సందేహం వస్తే తక్షణం పోలీసులకు సమాచారం అందివ్వాలన్నారు. హోటళ్లలో ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పోలీసులకు తెలపాలన్నారు. హోటల్‌కు వచ్చే గెస్ట్‌లకు బుకింగ్ సమయంలో పంపించే మెసేజ్‌లలో అత్యవసర ఫోన్ నంబర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని హోటళ్ల యాజమాన్యాలకు శిఖాగోయల్ తెలిపారు.

హాస్టల్‌కు వెళ్లడం ఇష్టంలేక ముంబై రైలు ఎక్కారు..

● ముగ్గురు బాలికలను తల్లిదండ్రులకు అప్పగించిన కాలాపత్తర్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేని ముగ్గురు బాలికలు కలిసి ముంబై వెళ్లేందుకు రైలు ఎక్కారు. బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన కాలాపత్తర్ పోలీసులు గంటల వ్యవధిలో బాలికలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. కాలాపత్తర్ ప్రాంతానికి చెందిన బాలిక(14), 7వ తరగతి పూర్తి చేసింది. బాలికను హాస్టల్‌కు పంపుతామని తల్లి పలుమార్లు చెప్పింది. ఇదే ఇంట్లో అద్దెకు ఉంటున్న మరో కుటుంబంలో ఇద్దరు బాలికలను కూడా వారి తల్లిదండ్రులు హాస్టల్‌కు పంపుతామని చెప్పారు. హాస్టల్‌కు వెళ్లడం ఇష్టంలేని ముగ్గురు బాలికలు కలిసి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ముంబైకి వెళ్దామని పథకం వేసుకున్నారు. సోమవారం ఎవరికీ చెప్పకుండా ఇళ్ల నుంచి బయలుదేరారు. బాలికలు కనిపించకపోవడంతో గాబరాపడ్డ తల్లిదండ్రులు మధ్యాహ్నం 2 గంటల సమయంలో కాలాపత్తర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మూడు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ముగ్గురు బాలికలు నాంపల్లి రైల్వేస్టేషన్‌లో ముంబై వెళ్తున్న రైలులో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వారిని పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు.

గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తాం : జెడ్సీ

మదీన, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న తెలిపారు. ఈనెల 7న ప్రారంభం కానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని చాంద్రాయణగుట్ట నర్కిఫూల్‌బాగ్‌లోని తన కార్యాలయంలో సోమవారం భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు, పలు విభాగాల అధికారులతో జోనల్ కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు ప్రాంతాల్లో ఉన్న సమస్యలను ఉత్సవసమితి ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జోనల్‌కమిషనర్ మాట్లాడుతూ, అన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మండపాలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. పలు ప్రధాన మార్గాల్లో రోడ్లపైకి ఉన్న చెట్ల కొమ్మలను తొలగించామన్నారు. రోడ్లు, వీధిదీపాలు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూస్తామన్నారు. శోభాయాత్ర కొనసాగే ప్రధాన రోడ్లపై ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట, చాంద్రాయణగ్గుట, చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్‌లు జయంత్, సురేందర్, సరిత, అరుణకుమారి, రవికుమార్, వెటర్నరీ డీడీ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, యూబీడీ డీడీ అమీనాబీ, ఉత్సవ సమితి ప్రతినిధులు కె.మహేందర్, నిరంజన్‌యాదవ్, మహేశ్వర్, ఉమామహేంద్ర, శ్రీనాథ్, శ్రీకాంత్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, రాజేశ్వర్, ఉమేశ్ సింగనియా, విజయ్‌కుమార్, ఈఈలు, ఏంఎహెచ్‌ఓలు, ఏసీపీలు, డీఈలు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్


రాజేంద్రనగర్ పత్తికుంటను శుభ్రం చేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

పత్తికుంట శుభ్రం షురూ..

రాజేంద్రనగర్ : వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే రాజేంద్రనగర్ సమీపంలోని హనుమాన్‌నగర్ పత్తికుంటను రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులు సోమవారం శుభ్రం చేయించారు. చెరువు చుట్టూ ఉన్న వ్యర్థాలను తొలగించారు. చెరువును ఆనుకుని గతంలో నిర్మించిన కొలనను శుభ్రం చేసే పనులకు శ్రీకారం చుట్టారు. నిమజ్జనాలు జరిగేనాటికి పూర్తిస్థాయిలో చెరువు, కొలనును శుభ్రం చేస్తామన్నారు. వినాయక నిమజ్జనాలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను చేపట్టనున్నట్లు రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ తెలిపారు.

గణేశ్ ఉత్సవ సమితి గౌలిపురా డివిజన్ కన్వీనర్‌గా సాయిసందీప్



చాంద్రాయణగుట్ట, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి గౌలిపురా డివిజన్ కన్వీనర్‌గా సాయి సందీప్ నియమితులయ్యారు. ఈ మేరకు భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కార్యదర్శి కౌడి మహేందర్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా సాయిసందీప్ మాట్లాడుతూ, ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ డా.కె.లక్ష్మణ్

మున్నూరుకాపులకు మంత్రి వర్గంలో చోటుకల్పించాలి

రవీంద్రభారతి, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపులకు మంత్రి వర్గంలో చోటుకల్పించాలని రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం రవీంద్రభారతి ప్రాంగణంలోని ఘంటసాల వేదికపై మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎడ్ల పొలాలమాస, బొడ్డెమ్మ పండగ సంబురాలను నిర్వహించారు. డా.బాల శ్రీనివాస్‌పటేల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డా.కె.లక్ష్మణ్ మాట్లాడుతూ ఎడ్లపొలాల అమావాస్య కాపుల సంస్కృతి అని, మున్నూరు కాపులు తమ వ్యవసాయంలో ఉపయోగించే ఎడ్లకు స్నానం చేసి, దాన పెట్టి గౌరవించడం ఈ పండుగ ఉద్దేశమన్నారు. మున్నూరుకాపుల ఎడ్లపొలాల అమావాస్యని రాష్ట్ర పండుగగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. విశిష్ట అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ఈ పండుగ విశిష్టతను చాటుతూ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ మున్నూరుకాపు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడే కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ హనుమంతరావు, పూల రవీందర్, మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ, బాలరాజు, మధుకర్, విఠల్, వెంకటకిషన్ పటేల్, ఆకుల వెంకటరావు, సంతోష్, శ్రవణ్ పాల్గొన్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత

ప్రజావాణి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించండి

● డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులతో కలిసి ఆమె వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. టౌన్‌ప్లానింగ్ 14, రెవెన్యూ 3, ఎల్‌డబ్ల్యూఎస్, లేక్స్, హౌసింగ్, ఎలక్ట్రికల్, ఎలక్షన్స్, ఫైనాన్స్‌తో సహా పలు విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. వాటిని తక్షణమే పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 49 అర్జీలు రాగా, వాటిలో కూకట్‌పల్లి 24, సికింద్రాబాద్- 11, శేరిలింగంపల్లి 8, చార్మినార్ జోన్ 4, ఎల్బీనగర్ 2 అర్జీలు వచ్చాయి. అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, సత్యనారాయణ, రఘుప్రసాద్, చంద్రకాంత్‌రెడ్డి, అడిషనల్ సీసీపీ గంగాధర్ హాజరయ్యారు.

రాజేంద్రనగర్ సర్కిల్‌లో రెండు ఫిర్యాదులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఇద్దరు తమ సమస్యల కోసం చేసుకున్నారు. బుద్వేల్‌కు చెందిన ఒకరు తమకు ఆస్తిపన్ను ఎక్కువగా వస్తోందని, తక్కువచేయాలని దరఖాస్తు చేసుకున్నారని డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ తెలిపారు. మైలార్‌దేవుపల్లికి చెందిన మరోవ్యక్తి తమకు ఇంటి నెంబర్ ఉందని, తిరిగి తెలియకుండా 'మా తండ్రి' దరఖాస్తు చేసుకున్నారని, ఆ దరఖాస్తును రద్దుచేసి తమకు రావాల్సిన డబ్బును ఇప్పించాలని కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి

మదీన: ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న అన్నారు. నర్కిఫూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10-30 నుంచి ఒంటి గంట వరకు జరిగిన ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్ సర్కిల్‌కు సంబంధించిన ఆస్తి పన్ను, చార్మినార్‌సర్కిల్‌లోని అక్రమ నిర్మాణంపై రెండు ఫిర్యాదు అందాయి. జోనల్‌కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో బస్తీ, కాలనీవాసులు స్థానికంగా ఉన్న సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ (యూబీడీ) అమీనాబీ, డిప్యూటీ డైరెక్టర్(వెటర్నరీ) డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ఏఎంసీ రాజారావు, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణరెడ్డి, బిల్ కలెక్టర్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్మికుడు గుర్తింపు కార్డు తీసుకోవాలి

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న ప్రతికార్మికుడు కార్మికశాఖ ద్వారా అందజేసే గుర్తింపు కార్డు తీసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సుంకర రామ్మోహన్ అన్నారు. ఈ విషయమై భవన నిర్మాణ కార్మికులతో పాటు ఇతర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు అవగాహన కల్పించడానికి మంగళవారం బుద్వేల్ భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఉదయం 9 గంటలకు సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి కార్మికుడు తప్పనిసరిగా హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటికే కార్డు తీసుకున్న వారు రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. తప్పనిసరిగా కార్మిక గుర్తింపు కార్డులను తీసుకోవాలని సుంకర రామ్మోహన్ తెలిపారు.

బీజేపీ సభ్యత్వాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలి

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ డివిజన్‌లో బీజేపీ సభ్యత్వాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి పి.ఉపేందర్‌రెడ్డి అన్నారు. ఉప్పర్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు గుంజ బాబురావు అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాజేంద్రనగర్ డివిజన్‌లో బీజేపీ బలోపేతంగా ఉందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి వై.శ్రీధర్, యువమోర్చా నాయకులు బొక్క బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శివరాంపల్లి చౌరస్తాలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకుడు సోమ శ్రీనివాస్‌గుప్తా, తదితరులు


జల్‌పల్లిలో వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న దేపా భాస్కర్‌రెడ్డి, యూసుఫ్ ఖాద్రీ తదితరులు

దివంగత సీఎం డాక్టర్ వైఎస్ఆర్‌కు నివాళి

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం శివరాంపల్లి చౌరస్తాలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకుడు సోమ శ్రీనివాస్‌గుప్తా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. ఆయన ఆశయాలసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాల్సిన అవసరముందన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి శివరాంపల్లికి చెందిన పలువురు నాయకులు తదితరులు నివాళులర్పించారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

పహాడీషరీఫ్: వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా జల్‌పల్లి మున్సిపాలిటీలో పేదలకు నిత్యావసరాలను పంపిణీచేశారు. కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం మైనార్టీసెల్ చైర్మన్ యూసుఫ్‌ఖాద్రి ఆధ్వర్యంలో జల్‌పల్లి మున్సిపాలిటీలో నీటమునిగిన ప్రాంతాల్లో కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేశారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ మైనార్టీ సెల్‌చైర్మన్ హర్షద్ షేక్లు మాట్లాడారు.. వరదల కారణంగా నష్టపోయిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లెంకి ధనరాజు గౌడ్, రంగారెడ్డి జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు మాస్న రవి కుమార్, వార్డు కౌన్సిలర్ యాదగిరి, జంగారెడ్డి, మున్సిపాలిటీ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులు పజిల్‌ఖాద్రి, సయ్యద్‌అలీపాషా, సుమన్, కుస్రో, మహబూబ్, షారుఫ్, అఫ్జల్, ముస్తఫా, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


గాంధీభవన్‌లో టీపీసీసీ సెక్రటరీ మనీలాల్, హరిసింగ్, నరేందర్ యాదవ్, జైసింగ్ రాణా ఆధ్వర్యంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. - మంగళ్‌హాట్


గాంధీభవన్‌లో వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐసీసీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కో-ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్, వినోద్‌సింగ్, కృష్ణ, గోవర్ధన్ తదితరులు
- మంగళ్‌హాట్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి)

ఘనంగా గౌండ్ల మఠంలో మహా అన్నదానం

మంగళ్‌హాట్, సెప్టెంబర్ 02 (ఆంధ్రజ్యోతి): చివరి శ్రావణమాసాన్ని పురస్కరించుకొని గౌండ్ల మఠంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు మహాఅన్నదాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, పాలకమండలి అధ్యక్షులు గోడిశాల నరేశ్‌గౌడ్, ప్రధానకార్యదర్శి కొత్త నవీన్ కుమార్ గౌడ్, సలహదారుడు బుర్ర భాస్కర్‌గౌడ్, ఉపాధ్యక్షులు జి.యగ్నేశ్వర్ గౌడ్, కోశాధికారి నిర్మల మనుజేందర్ గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి పి.అశోక్ కుమార్‌గౌడ్, గోదా వెంకటేశ్‌గౌడ్, దేశం శంకర్, హరి ప్రసాద్‌గౌడ్, సాయినాథ్‌గౌడ్, కొత్త ప్రవీణ్‌కుమార్‌గౌడ్, మల్లం శివ కుమార్ గౌడ్, గడ్డమీది నాగేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉస్మానయా' వద్దంటూ సంతకాల సేకరణ

గోషామహల్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ పోలీసు స్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనాన్ని నిర్మిస్తే ఇక్కడ స్థానికంగా ఎన్నో ఏళ్ల నుంచి నివాసముంటున్న బస్తీవాసులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని, ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని గోషామహల్ ప్రజాపరిరక్షణ కమిటీ నాయకులు వినోద్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం గోషామహల్ డివిజన్‌లోని చాక్నావాడి, చందన్‌వాడీ, గోషామహల్ తదితర బస్తీల్లో ప్రతి ఇంటింటికీ వెళ్లి ఉస్మానియా ఆస్పత్రి ఈ ప్రాంతంలో నిర్మించవద్దంటూ ప్రజాసంతకాల సేకరణ నిర్వహించారు.

హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన

మదీన, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): హుసేనిఆలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు వాల్‌పోస్టర్ మేకింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. అంతేకాకుండా 'యూత్ అండ్ ది ప్రివెన్షన్ ఆఫ్ హెచ్ఐవీ/ఎయిడ్స్' అనే అంశం అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పియ చిన్నమ్మ, వైస్‌ప్రిన్సిపాల్ డా.పి.లత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు జెన్స్ ప్రణీత, శోభారాణి, కె.శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఉస్మాన్‌నగర్‌లో ఎమ్మెల్యే సబిత పర్యటన


ఉస్మాన్‌నగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

పహాడీషరీఫ్ సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి మున్సిపాలిటీలో సోమవారం మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి పర్యటించారు. తెలంగాణ రాష్ట్రంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జల్‌పల్లి మున్సిపాలిటీ..ఉస్మాన్ నగర్‌లో మున్సిపల్ చైర్మన్‌అబ్దుల్లా సాది, కమిషనర్ వాణిరెడ్డి స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ భారీ వర్షాలు ఇంకా రెండురోజులు ఉన్నందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసరం అయితే తప్ప ఎవరూ బయటికి రావద్దని కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు యాహియా, అలీమ్, మజహార్, బీఆర్ఎస్ నాయకులు, షర్ఫుద్దీన్‌హమీద్, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జల్‌పల్లిలోని అన్ని బస్తీలకు మంచినీరు సరఫరా

పహాడీషరీఫ్ సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లోని బస్తీలలో వాటర్ వర్క్స్ తరఫున కృష్ణామంచినీరు అందిస్తున్నామని జల్‌పల్లి మున్సిపాలిటీ వాటర్ వర్క్స్ మేనేజర్ వెంకయ్య తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని అన్ని బస్తీల్లో ప్రజలకు కావాల్సినంత నీరు సరఫరా చేస్తున్నామన్నారు. ప్రజలు కొందరు దళారులను నమ్మి వాటర్ వర్క్స్ అనుమతులు లేకుండా నల్లా కలెక్షన్లు తీసుకుంటున్నారని అది నేరమన్నారు. అక్రమ కలెక్షన్ తీసుకున్న వారిపై ఇస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


దర్శకుడు నిట్టల గోపాలకృష్ణను సత్కరిస్తున్న అతిథులు

కల్పవృక్షం లఘు చిత్ర ప్రదర్శన

రవీంద్రభారతి, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కొబ్బరి దినోత్సవం సందర్భంగా కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో కల్పవృక్షం లఘుచిత్ర ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సినిమా యూనిట్‌ను సత్కరించారు. గోపాలకృష్ణ, రాధాకృష్ణ ప్రొడక్షన్స్‌లో జె.రాధాకృష్ణ నిర్మించిన ఈ చిత్రానికి డా.నిట్టల గోపాలకృష్ణ దర్శకత్వం వహించారు. దీనికి సాలూరి వాసురావు సంగీతం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖనటుడు, రచయిత తనికెళ్లభరణి సినిమా యూనిట్‌ను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సాహితీవేత్త ఓలేటిపార్వతీశం, సినీదర్శకుడు రేలంగి నరసింహారావు, ఎస్వీ.రామారావు, మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

'మిలాద్ ఉన్ నబీ'ని ప్రశాంతంగా జరుపుకోవాలి


సీపీ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 19న జరిగే మిలాద్ ఉన్ నబీ ఊరేగింపు వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సిటీపోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మర్కజీ మిలాద్ జులూస్ కమిటీ సభ్యులు బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం నగర సీపీని కలిసి మిలాద్ ఉన్ నబీ ఊరేగింపునకు అనుమతివ్వాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులతో సీపీ మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలను నిర్వహించుకోవాలని వారికి సూచించారు. అందుకు అవసరమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్, సౌత్‌జోన్ డీసీపీ స్నేహామెహ్రా పాల్గొన్నారు.

డెంగీ బాధితురాలికి పరామర్శ

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): డెంగీ బారిన పడిన రాజేంద్రనగర్ సమీపంలోని హనుమాన్‌నగర్ బస్తీలో నివాసం ఉండే చెన్నమ్మ నివాసానికి సోమవారం జీహెచ్ఎంసీ, మెడికల్ విభాగాల అధికారులు వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆమె ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. యాంటీలార్వా ఆపరేషన్, ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా మైలార్‌దేవుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రేఖ, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్, గ్రేటర్ దక్షిణ మండలం సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్‌రావు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విభాగం రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ ఈఈ శ్రీనివాస్, ఎంటమాలజీ విభాగం ఏఈ ఉదయ్ హనుమాన్‌నగర్ వెళ్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కాటేదాన్‌లో నేడు సమావేశం

దుర్గానగర్‌లో గల సెంట్రింగ్ యూనియన్ కార్యాలయంలో మంగళవారం జరుగనున్న సమావేశానికి గుత్తేదారులు తప్పని సరిగా హాజరుకావాలని మైలార్‌దేవుపల్లి డివిజన్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎ.మల్లేశ్ కోరారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన సెంట్రింగ్ కార్మికుల సంఘం సమావేశంలో నాయకులు ఎస్.శంకరయ్య, పి.అశోక్, జి.వెంకటేశ్, ఎం.దేవప్ప, ఎస్.బాల్‌రాజ్, ఎం.దర్శన్, గడ్డె యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాలకు మార్కెటింగ్ కోసం అవగాహన ఒప్పందాలు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాలకు జాతీయ స్థాయిలో మార్కెటింగ్ కల్పించడానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కర్నూల్‌కు చెందిన చక్రాసీడ్స్, సాయి క్రిష్ణ సీడ్స్ కంపెనీలు సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి, కంపెనీ ప్రతినిధులు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన డీహెచ్ఎం 206 హైబ్రిడ్ మొక్కజొన్నకు జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు ఆయా సంస్థలు కృషి చేయనున్నాయి.

యువకుడి ఆత్మహత్య


గిరీశ్‌కుమార్ యాదవ్ (ఫైల్)

నార్సింగ్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): అల్కాపూర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చిన గిరీశ్‌కుమార్‌యాదవ్(34) అల్కాపూర్‌లోని అపార్ట్‌మెంట్‌లో ఉంటూ వ్యాపారం చేసుకుంటున్నాడు. ఆదివారం అర్ధరాత్రి బెడ్‌రూంలోని ఫ్యాన్‌కు లుంగీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఫ్లాట్‌లో ఇతని ఇద్దరి స్నేహితులు కూడా ఉన్నారు. ఈ విషయంపై గిరీశ్ సోదరి రామ్యాంక నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే గత రాత్రి స్నేహితురాలితో కలసి మందుపార్టీ చేసుకున్నారని ఆ తర్వాతనే ఈ సంఘటన జరిగిందని, ఆ ఫ్లాట్‌లో ఉన్న ఇద్దరు స్నేహితులలో ఒక అమ్మాయి ఉన్నదని ప్రచారం సాగుతోంది. నార్సింగ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వర్క్ ఫ్రమ్ హోమ్ పేరుతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు టోకరా

రూ.2.71లక్షలు దోచేసిన సైబర్ క్రిమినల్స్

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వర్క్‌ఫ్రమ్ హోమ్ జాబ్ ఇస్తామంటూ ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను బురిడీ కొట్టించిన సైబర్ క్రిమినల్స్. బిట్‌కాయిన్స్‌లో ట్రేడింగ్ చేయించి రూ.2.71లక్షలను కొల్లగొట్టారు. మోసపోయినట్లు గుర్తించిన ఐటీఉద్యోగి సిటీసైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన ఐటీ ఉద్యోగికి బిగ్‌ఫాక్స్ అనే కంపెనీ నుంచి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌చేశారు. తాను హెచ్ఆర్ మేనేజర్‌గా పరిచయం చేసుకున్నాడు. తన కంపెనీలో వర్క్‌ఫ్రమ్ హోమ్‌జాబ్స్ అందుబాటులో ఉన్నాయని చెప్పడంతో అందుకు బాధితుడు సరే అన్నాడు. ముందుగా టెలిగ్రామ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించిన క్రిమినల్స్. ఇంట్లోనే ఉంటూ బిట్‌కాయిన్స్‌లో ట్రేడింగ్ చేయాలని అతితక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. దీంతో బిట్‌కాయిన్స్ ట్రేడింగ్ లింకును పంపించి అందులో దశలవారీగా డబ్బులు పెట్టుబడిగా పెట్టి ట్రేడింగ్ చేయాలన్నారు. దాంతో బాధితుడు మొదట తక్కువ మొత్తంలో పెట్టుబడులు పెట్టి లాభాలను అందుకున్నాడు. అలా మెల్లగా ట్రేడింగ్‌కు అలవాటుపడిన బాధితుడికి ఒక్కసారిగా ఎక్కువ మొత్తంలో లాభాలు వచ్చినట్లు చూపించారు. విత్‌డ్రా చేసుకోవాలని చూడగా, అకౌంట్ ఫ్రీజ్‌చేశారు. ఇదేంటని ప్రశ్నించగా, రూల్స్ ప్రకారం ఎక్కువ మొత్తంలో లాభాలు వచ్చినప్పుడు 80 శాతం డబ్బులు చెల్లించాలని లేదంటే అకౌంట్ అన్‌ఫ్రీజ్ చేయడం కుదరదని చెప్పారు. దాంతో బాధితుడు ఎంతో కొంత చెల్లించి అకౌంట్‌ను అన్‌ఫ్రీజ్ చేయించుకోవాలని రూ.2,71,400 చెల్లించాడు. అయినా క్రిమినల్స్ అకౌంట్ అన్‌ఫ్రీజ్ చేయకుండా ఇంకా ఇంకా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. దాంతో ఇదేదో మోసంలా ఉందని భావించిన బాధితుడు సిటీసైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు గాజుల చోరీ కేసులో మహిళకు రెండేళ్ల జైలు

మదీన, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో చొరబడి దొంగతనం చేసిన ఓ మహిళకు రెండేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ కె.గురునాథ్ తెలిపిన వివరాల ప్రకారం... షాహీన్‌నగర్ నహదీ హోటల్ సమీపంలో నివాసముండే షేక్ మహ్మద్ ఆబెద్ షరీఫ్ భార్య నసీమ్ ఫాతిమా(35) 2018 మే 22వ తేదీన కేశవగిరిలో నివాసముండే హబీబ్ మహ్మద్‌రఫీ ఇంట్లో దొంగతనం చేసింది. ఆయన తల్లి షరీఫానూర్(73) పక్షవాతంతో బాధపడుతూ లేవలేని స్థితిలో మంచంలో పడుకుని ఉంది. నసీమ్ ఫాతిమా వృద్ధురాలి చేతికున్న రెండున్నర తులాల బంగారు గాజులను తీసుకుంది. ఆమె అరిచినప్పటికీ ఎవరికీ వినపడలేదు. ఈలోపు బంగారు గాజులను తీసుకుని పారిపోయింది. చాలాసేపటి తర్వాత కుటుంబ సభ్యులు వచ్చి, విషయం తెలుసుకుని చాంద్రాయణగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు షాహీన్‌నగర్‌కు చెందిన నసీమ్ ఫాతిమా గాజులను తస్కరించినట్లు గుర్తించి ఆమెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితురాలికి రెండేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు ఇచ్చింది.

గంజాయి అమ్ముతున్న ఇద్దరి అరెస్ట్


నిందితులు

మంగళ్‌హట్, సెప్టెంబర్ 02 (ఆంధ్రజ్యోతి): గంజాయిని అక్రమ మార్గంలో సరఫరా చేస్తూ అమ్మిన సొమ్ముతో జల్సాలు చేస్తున్న ఇద్దరు నిందితులను ధూల్‌పేట్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ధూల్‌పేట్‌లోని జుమ్మెరాత్‌బజార్ ప్రాంతానికి చెందిన ఎ.మనోజ్‌సింగ్, ఎండీ రాజ్‌పటేల్ ఇద్దరూ కొంతకాలంగా గంజాయిని సరఫరా చేస్తూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నారు. ధూల్‌పేట్ ఎక్సైజ్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎన్.అంజిరెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేశారు. ఈ గంజాయి అమ్మకాలతో సంబంధం ఉన్న ముఖేశ్‌సింగ్, ఆర్తిబాయిపై కేసు నమోదు చేశామని... వీరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/kkfRDUfలో చదవండి.

Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.

నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

నేడు వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 10వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొ.బీజే రావు హాజరవుతారని చెప్పారు. ఈ పదేళ్లలో ఐదు నూతన వ్యవసాయ కళాశాలలు, ఒక ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల, నాలుగు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రారంభించామని, రాష్ట్రవ్యాప్తంగా 15 పరిశోధన కేంద్రాల ద్వారా అన్ని ప్రధాన పంటల్లో పరిశోధనలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం రూపొందించిన తెలంగాణ సోనా వరి వంగడం జాతీయస్థాయిలో బాగా ఆదరణ పొందినట్లు ఆయన గుర్తుచేశారు.

ఈనెల 12 వరకు నిమ్స్‌లో రక్తదాన శిబిరం

సనత్‌నగర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం ప్రారంభమైంది. ఈ నెల 12 వరకు ఉదయం 8 నుంచి సాయంత్రం 8 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందని బ్లడ్‌బ్యాంక్ హెచ్‌వోడీ డాక్టర్ శాంతి తెలిపారు. తెలుగు మొమ్స్ నెట్‌వర్క్, జేసీఐ హైదరాబాద్ మైత్రి, సహజ ఫౌండేషన్, ఏక్ కథం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వేధింపుల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ

నిమ్స్‌లో మహిళా ఉద్యోగులు, సిబ్బందిపై వేధింపుల సమస్యలను పరిష్కరించేందుకు ఇంటర్నల్ కంప్లైయింట్స్ కమిటీని నియమించారు. దీని పదవీకాలం మూడేళ్లు ఉంటుందని రిజిస్ట్రార్ తెలిపారు.

ప్రతినెలా 10 పాఠశాలలను సందర్శించాలి

● ప్రత్యేకాధికారులకు కలెక్టర్ ఆదేశం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అధికారులు ప్రతినెల పది పాఠశాలలను సందర్శించి రిజిస్టర్లను పరిశీలించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఈవో, ప్రత్యేక అధికారులతో ఆయన సమావేశమయ్యారు. పాఠశాలను సందర్శించినప్పుడు తప్పనిసరిగా అకడమిక్ గైడెన్స్ రిజిస్టర్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల నాణ్యతను పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు కదిరివన్, వెంకటాచారి, లా ఆఫీసర్ వీరబ్రహ్మాచారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. కాగా, కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికి వివిధ ప్రాంతాలకు చెందిన 111 మంది దరఖాస్తు చేశారు. ప్రజావాణి దరఖాస్తులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు.

వెంటనే బీసీ కులగణన చేపట్టాలి

● ఎంపీ ఆర్.కృష్ణయ్య


సంజయ్‌కు నిమ్మరసమిస్తున్న ఆర్.కృష్ణయ్య, వీహెచ్ తదితరులు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన చేపట్టి వెంటనే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ కులగణన చేపట్టాలని 9 రోజులుగా ఆమరణ దీక్ష చేస్తున్న బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్‌కు సోమవారం ఆర్.కృష్ణయ్య, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు నిమ్మరసమిచ్చి దీక్ష విరమింపజేశారు. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా కులగణన చేపట్టడంలో జాప్యం చేయడమేమిటని ప్రశ్నించారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ ఎంపీ వీహెచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, నందగోపాల్, వేముల రామకృష్ణ, మట్టా జయంతిగౌడ్, మల్లేష్‌యాదవ్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో పరుగులు తీయండి

● సిబ్బందికి సీపీ కొత్తకోట ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న సిటీ సీపీ శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాల సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. విధి నిర్వహణలో పరుగులు తీయాలని, ఇదే సమయంలో ప్రజల పట్ల సానుభూతి, విధుల్లో సమయపాలన ముఖ్యమని సూచించారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సోమవారం సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని శాంతిభద్రతలు, ట్రాఫిక్ విభాగం సిబ్బందితో సీపీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సైలంతా యంగ్ డైనమిక్‌గా ఉన్నారని..విధి నిర్వహణలో నిజాయతీ, నిబద్ధతతో పనిచేయాలన్నారు. గణేశ్ బందోబస్తుతోపాటు మిలాద్ ఉన్ నబీ వేడుకల్లోనూ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ బందోబస్తులో పోలీస్ శాఖ ఇమేజ్‌ను పెంచేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. గణేశ్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబి వేడుకలు ఒక్కరోజు తేడాతో వచ్చాయని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది ఎప్పటికప్పుడు వ్యూహాత్మకంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు సీపీ విక్రమ్‌సింగ్ మాన్, ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్, అడ్మిన్ జాయింట్ సీపీ గజరావ్ భూపాల్, డీసీపీ ఐటీసెల్ శిల్పవల్లి, ఎస్‌బీ డీసీపీ చైతన్యకుమార్, సుమారు 300 మంది ఎస్సైలు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజిద్దాం : మేయర్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 'మట్టి వినాయకులను పూజిద్దాం-పర్యావరణాన్ని పరిరక్షిద్దాం-చెరువులను కాపాడుదాం' అనే వాల్‌పోస్టర్‌ను ఆమె తన చాంబర్‌లో ఆవిష్కరించారు.

ఉచితంగా మట్టి విగ్రహాల పంపిణీ

● రేపటి నుంచి మూడురోజులపాటు..

● నగరంలో 33 ప్రాంతాల్లో అందజేత

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాల ఉచిత పంపిణీకి హెచ్ఎండీఏ సిద్ధమైంది. ఏటా మాదిరిగానే ఈసారి కూడా భక్తులకు అందజేసేందుకు ఏర్పాట్లు చేసింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 2017 నుంచి ఏటా లక్ష వరకు మట్టి విగ్రహాలను అందిస్తోంది. ఈ నేపథ్యంలో ఈనెల 4 నుంచి 6 వరకు నగరంలోని 33 ప్రాంతాల్లో పంపిణీ చేస్తామని సంస్థ తెలిపింది.

ఈ ప్రాంతాల్లోనే: జూబ్లీహిల్స్ సైలెంట్ వ్యాలీ, రోడ్ నంబర్ 10 ఐఏఎస్ క్వార్టర్స్, కేబీఆర్ పార్కు, హిందూ పత్రిక కార్యాలయం, సోమాజిగూడ ప్రెస్‌క్లబ్, బల్కంపేట ఎల్లమ్మ టెంపుల్, పెద్దమ్మ గుడి, మెహిదీపట్నం రైతుబజార్, మాదాపూర్ శిల్పారామం, కూకట్‌పల్లి మెట్రో, ఉప్పల్ శిల్పారామం, ట్యాంక్‌బండ్, హెచ్ఎండీఏ కార్యాలయం, స్వర్ణజయంతి కాంప్లెక్స్, మైత్రీవనం, సెక్రటేరియట్, ఎన్టీఆర్ గార్డెన్, సఫిల్‌గూడ పార్క్, మైండ్‌స్పేస్ జంక్షన్, బండ్లగూడ ఆర్టీసీ డిపో, లుంబినీపార్కు, నారాయణగూడ మెల్కోటే పార్కు, సరూర్‌నగర్ ప్రియదర్శిని పార్కు, కేబీఆర్ పార్కు, వనస్థలిపురం రాజీవ్‌గాంధీ పార్కు, అమీర్‌పేటలోని పలు పార్కులు, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా పంపిణీ చేస్తారు. నాలుగు మొబైల్ వాహనాల ద్వారా కూడా వివిధ ప్రాంతాల్లో అందజేయనున్నారు.

మంత్రి వ్యాఖ్యలు సరికావు : ఐఎంఏ

కుషాయిగూడ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ వైద్యులు, నకిలీ వైద్యుల (ఆర్ఎంపీలు, పీఎంపీలు)పై ఐఎంఏ చేస్తున్న ప్రక్షాళనకు సహకరించొద్దని మంత్రి శ్రీధర్‌బాబు అనడం సరికాదని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) అభిప్రాయపడింది. ఈ మేరకు అధ్యక్షుడు కాశీప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి విజయ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం శిక్షణ పొందిన వైద్యులను నియమించాలని కోరారు. డాక్టర్ అనే పదం వాడుతూ గ్రామీణ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నీళ్లు నిలిచే ప్రాంతాలపై దృష్టి సారించండి

● సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించాలి

● తాగునీటి సరఫరాలో నాణ్యత పాటించాలి

● పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్



హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రేటర్‌వ్యాప్తంగా తాగునీరు సరఫరాలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ వాటర్‌బోర్డు అధికారులకు సూచించారు. సోమవారం మాసబ్‌ట్యాంక్‌లోని టీయూఎఫ్ఐడీసీ కార్యాలయంలో వాటర్‌బోర్డు ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్, ఉన్నతాధికారులతో తాగునీరు సరఫరాపై సమీక్ష నిర్వహించారు. సీవరేజీ, తాగునీరు సరఫరాలో ఎదురయ్యే సమస్యలను దూరం చేసేందుకు జీఎం, డీజీఎం, మేనేజర్లు, ఇతర సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. వర్షాల వల్ల తాగునీరు కలుషితమయ్యే అవకాశమున్నందున నీటిని సేకరించింది మొదలు వినియోగదారులకు సరఫరా చేసే వరకు నిల్వ చేయడం, శుద్ధి ప్రక్రియ, క్లోరినేషన్, పంపింగ్ ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్‌పై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో వాటర్‌బోర్డు అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. వాటర్ లాగింగ్ పాయింట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, ముంపు ప్రాంతాల్లో నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సాధ్యమైన ప్రాంతాల్లో క్లోరిన్ బిళ్లలు పంపిణీ చేయాలని, కలుషిత నీరు సరఫరా అయ్యే ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హోల్స్ తెరవకుండా చూడాలని, కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ప్రజా ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని చెప్పారు. భారీ వర్షాలకు వాటర్‌బోర్డు ఆస్తుల నష్ట వివరాలను అందచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

వరదతో జాగ్రత్త

ఎగువ నుంచి వస్తున్న వరదతో గండిపేట చెరువు వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక, వాటర్‌బోర్డు ఈడీ మయాంక్ మిట్టల్ అధికారులకు సూచించారు. సోమవారం వారు అధికారులతో కలిసి జలాశయాన్ని సందర్శించారు. వాటర్‌బోర్డు సీజీఎం రవీందర్‌రెడ్డి, జీఎం డేవిడ్‌రాజ్, రెవెన్యూ, ఇతర విభాగాల అధికారులు వారి వెంట ఉన్నారు.



బడిలో జరభద్రం

● వర్షానికి నానిన పలు పాఠశాలల తరగతి గదులు

● పలుచోట్ల నిలిచిన నీళ్లు


ఓల్డ్ బోయగూడలోని ఆదయ్యనగర్ మెమోరియల్ స్కూల్‌లో పెచ్చులూడిన భవనం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో కురుస్తున్న వర్షాలు సాధారణ ప్రజలతోపాటు పాఠశాల విద్యార్థులను భయపెడుతున్నాయి. ఎడతెరిపి లేకుండా పడుతున్న వానలతో తరగతి గదులు నానిపోవడంతోపాటు స్లాబుల నుంచి నీరు కారుతుండడంతో ఇబ్బందులు పడనున్నారు. అయితే, మంగళవారం నుంచి స్కూళ్లకు వెళ్తున్న విద్యార్థులను ఉపాధ్యాయులు అప్రమత్తం చేయాలని, ప్రమాదాలు జరిగే అవకాశాలను గమనిస్తుండాలని పలువురు సూచిస్తున్నారు.

పలుచోట్ల నీరు నిలిచిన పరిస్థితి..

జిల్లాలోని 16 మండలాల్లో 691 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో దాదాపు 90 శాతం వరకు నూతన భవనాలున్నాయి. కేవలం 10 శాతం మాత్రమే 20 నుంచి 30 ఏళ్ల క్రితం నిర్మించినవి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆయా ప్రాంతాల్లోని పాఠశాలలు పూర్తిగా నానిపోయినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. స్లాబుల నుంచి నీరు కారి నిలిచిపోవడంతో విద్యార్థులు కూర్చునే పరిస్థితి కనిపించడం లేదని వాపోతున్నారు. స్లాబుల పెచ్చులూడిపోయి ప్రమాదకరంగా మారిన తరగతి గదులను మరమ్మతు చేయాలని గతంలో అధికారులను కోరినప్పటికీ పట్టించుకోకపోవడంతో వర్షాలు కురిసిన సమయంలో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

పలు ప్రైవేట్ స్కూళ్లలో ఆగమాగం..

జిల్లాలోని 1886 ప్రైవేట్ పాఠశాలల్లో 580 వరకు ప్రమాదకరంగా ఉన్నట్లు సమాచారం. చార్మినార్, చాంద్రాయణగుట్ట, ఆసిఫ్‌నగర్, గోల్కొండ, నాంపల్లి, సికింద్రాబాద్, ఖైరతాబాద్ మండలాల్లోని కొన్ని విద్యాసంస్థలను 30 ఏళ్ల క్రితం నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు చాలాచోట్ల తరగతి గదులకు మరమ్మతులు చేయకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. ఇటీవల కురిసిన వర్షాలతో ప్రమాదకరంగా మారాయి. ఈ నేపథ్యంలో అధికారులు పాఠశాలలను తనిఖీ చేసి, విద్యార్థుల భద్రతకు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో కూడా పాఠశాలలు నిర్వహిస్తుండడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని వారు పేర్కొంటున్నారు.

ఫోన్‌లో నగలు ఆర్డర్..

వచ్చాక చెల్లని చెక్కులు

● బంగారు దుకాణాల యజమానులకు టోకరా

● అరెస్ట్ చేసిన ఎస్‌వోటీ పోలీసులు


గుంటి సుమన్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): పేరుమోసిన బంగారు నగల దుకాణాల నంబర్లను గూగుల్ ద్వారా సేకరించి ఫోన్ చేస్తాడు. ఖరీదైన నగలు ఆర్డర్ చేసి, చెల్లని చెక్కులు ఇచ్చి ఫోన్ స్విచ్ ఆఫ్ చేస్తాడు. ఇలా నగరంలో పలు బంగారు నగల దుకాణ యజమానులను మోసం చేస్తున్న వ్యక్తిని సైబరాబాద్ ఎస్‌వోటీ, నార్సింగి పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. గండిపేటకు చెందిన గుంటి సుమన్ (43) తన స్నేహితులు శాలిబండకు చెందిన అజయ్‌కుమార్ సోని, రఘులతో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించాడు. లాభాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల పాలయ్యాడు. అజయ్‌కుమార్ సోని, రఘు తక్కువ సమయంలో రెట్టింపు సంపాదించేందుకు షార్ట్‌ఫిల్మ్ మేకింగ్‌లో పెట్టుబడి పెట్టాలని చెప్పారు. రమాదేవి అనే మహిళను పరిచయం చేసి, ఆమెకు రూ.2 కోట్లు ఇస్తే షార్ట్‌ఫిల్మ్‌లో పెట్టుబడి పెడుతుందని, తక్కువ కాలంలో పెట్టుబడి రెట్టింపు అవుతుందని చెప్పారు. ఇందుకోసం కావాల్సిన పెట్టుబడిని దుకాణదారులను మోసం చేసి సంపాదించాలని సుమన్ ప్లాన్ చేశాడు. గూగుల్‌లో ప్రముఖ బంగారు నగల దుకాణాల ఫోన్ నంబర్లకు కాల్ చేసి లేటెస్ట్ డిజైన్లు ఉన్న బంగారు నగల ఫొటోలు వాట్సప్‌లో పంపమని అడిగేవాడు. వారు పంపిన ఫొటోల్లో ఖరీదైన నగలను ఎంపిక చేసి ఇంటికి డెలివరీ చేయమని కోరేవాడు. నగలు డెలివరీ చేయడానికి వచ్చిన ఉద్యోగులకు ఖాతాలో డబ్బులు లేవంటూ మూసివేసిన బ్యాంకు ఖాతాలకు చెందిన చెల్లని చెక్కులను ఇచ్చేవాడు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకునేవాడు. వరుసగా నగల దుకాణ యజమానుల నుంచి ఫిర్యాదులు అందడంతో ఎస్‌వోటీ అధికారులు నిఘా ఉంచి సుమన్‌ను అరెస్ట్ చేసి, రూ.82 లక్షల విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. లింగంపల్లి, పంజాగుట్ట, చార్మినార్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో ఉన్న జువెల్లరీ యజమానులకు టోకరా పెట్టి దాదాపు రూ.2 కోట్ల విలువైన నగలు కాజేశాడని ఎస్‌వోటీ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు.

కూల్చివేతలపై పిటిషనర్ల

వాదనలు వినండి

● అధికారులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూల్చివేతలు చేపట్టేముందు పిటిషనర్‌లకు నోటీసులు ఇచ్చి వారి వాదనలు వినాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఎఫ్‌టీఎల్‌లో కట్టిన నిర్మాణాలను తొలగించాలని పేర్కొంటూ వాల్టా చట్టం కింద తహసీల్దార్ ఇచ్చిన తాఖీదులను షోకాజ్ నోటీసులుగా పరిగణించాలని తెలిపింది. పిటిషనర్లు సమర్పించే పత్రాలను పరిశీలించి వాదనలు వినాలని అధికారులకు స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేట అమర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలోని తమ ప్లాట్లకు నోటీసు ఇవ్వడంపై బోడ ప్రియతమ్‌రెడ్డి మరికొందరు హైకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. ఇదే తరహా పిటిషన్‌లో ఇటీవల ఇచ్చిన ఆదేశాలనే ప్రస్తుత పిటిషనర్లకు సైతం వర్తింపజేస్తున్నట్లు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాసరావు ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ పత్రాలను పరిశీలించి వాదనలు వినాలని స్పష్టం చేస్తూ పిటిషన్‌లను ముగించింది.

ఉస్మాన్‌సాగర్ మ్యాప్ సమర్పించండి: ఉస్మాన్‌సాగర్ చెరువు మ్యాప్, మెమొరీస్ సమర్పించాలని జస్టిస్ వినోద్‌కుమార్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం ఖానాపూర్‌లోని సర్వే నంబర్ 245, 246లలో ఉన్న తమ నిర్మాణాల కూల్చివేతలను అడ్డుకోవాలని కోరుతూ గవ్వ విద్యాధర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి చెరువు మ్యాప్, మెమొరీస్ సమర్పించాలంటూ విచారణను ఈనెల 23కు వాయిదా వేశారు.

అనుమతుల పేరుతో వేధించొద్దు

● భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి


సమావేశంలో పాల్గొన్న ఉత్సవ సమితి ప్రతినిధులు

పంజాగుట్ట, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి పేరుతో పోలీసులు వేధించవద్దని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సూచించింది. పోలీసుల అనుమతి అవసరం లేదని, ఆన్‌లైన్‌లో పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇస్తే చాలని తెలిపింది. అన్ని మండపాలకు ఉచిత విద్యుత్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేసింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉత్సవ సమితి అధ్యక్షుడు రాఘవరెడ్డి మాట్లాడారు. పదేళ్లుగా గణేశ్ ఉత్సవాలపై సీఎం స్థాయిలో సమావేశాలు జరగలేదని, ఈసారి సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారని.. అన్ని మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో సమితి ఉపాధ్యక్షుడు వైకుంఠం, కార్యదర్శులు శశిధర్, మహేందర్, కోశాధికారి శ్రీరామ్‌వ్యాస్, కరోడిమల్, గోవింద్ రాఠి, రవీందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐఐటీ హెచ్ మనకు గర్వకారణం

● ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్



హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యుత్తమ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఐఐఐటీ హెచ్ ఎన్నో విధాలుగా ముందున్నదని, కృత్రిమ మేధస్సు (ఏఐ)లో ఈ ప్రాంగణం అగ్రగామిగా నిలిచిందని ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. సోమవారం గచ్చిబౌలిలోని ఐఐఐటీ హెచ్ 27వ ఫౌండేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హైదరాబాద్‌లో ఐఐఐటీ హెచ్ ఉండటం మనకు గర్వకారణమన్నారు. ఈ సంస్థ చేసిన వినూత్న ఆవిష్కరణ 'ఐరాస్తే'ను ఆ ప్రాజెక్ట్‌ను దేశమంతా అందుబాటులోకి తీసుకురావాలని ప్రధాని సూచించారని గుర్తు చేశారు. ఐఐఐటీ హెచ్, తెలంగాణ ప్రభుత్వం, ఇంటెల్‌లు సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టాయన్నారు. మరెన్నో ఆవిష్కరణలను ఈ సంస్థ చేయనుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ నారాయణన్ మాట్లాడుతూ ఐఐఐటీ హెచ్‌లోని సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (సీఐఈ) 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని, 300 మందికి పైగా స్టార్టప్‌ను ఇది ఇన్‌క్యుబేట్ చేసిందని వెల్లడించారు. అనంతరం జయేశ్ రంజన్ తదితరులు విద్యార్థుల ఆవిష్కరణలతో కూడిన ప్రదర్శనను తిలకించారు.

4 నుంచి 28 గంటలు

అంధకారం

(5వ పేజీ తరువాయి)

విరిగితే సోమవారం ఉదయం వరకు కొత్తవి ఏర్పాటు చేయలేదు. కాగా, శని, ఆదివారాల్లో కురిసిన వర్షానికి గ్రేటర్ పరిధిలో 412 విద్యుత్ స్తంభాలు విరిగాయి.

ఫిర్యాదులు పట్టించుకోరు..

ఫోన్లు లేపరు...

వినియోగదారులు ఎప్పుడు ఫోన్ చేసినా స్పందించాలని దక్షిణ డిస్కం ప్రధాన కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన సమీక్షలో డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క సూచించారు. కరెంట్ పోయిందని ఫోన్లు చేస్తే డీఈ, ఏడీఈ, ఏఈలతోపాటు ఆర్టిజన్లు సైతం స్పందించని పరిస్థితులు నెలకొన్నాయి. కరెంట్‌సరఫరాలో ఓల్టేజీ సమస్యలు తలెత్తి, బల్బులు, టీవీ కాలిపోవడంతో ఫిర్యాదు చేద్దామని ఏఈ, స్థానిక లైన్‌మన్‌లకు ఫోన్లు చేసినా స్పందించలేదని కూకట్‌పల్లి బాలాజీనగర్‌కు చెందిన వినియోగదారులు ఆరోపించారు.

కఠిన చర్యలు తప్పవు : సీఎండీ

వర్షాలు తగ్గేవరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అధికారులను ఆదేశించారు. మూడురోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గ్రేటర్ జోన్ సీఈ, ఎస్ఈలతో విద్యుత్‌సరఫరా పరిస్థితిపై సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. విపత్కర పరిస్థితుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహించినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దగ్గర ఉండి పనులు చేయించాం

మధురానగర్ బీబ్లాక్‌లో ఆదివారం మధ్యాహ్నం భారీ వృక్షం నేలకూలింది. ఆ చెట్టు విద్యుత్ తీగలపై పడడంతో బరువుకు మూడు సిమెంట్ స్తంభాలు విరిగిపోగా, 2 ఇనుప స్తంభాలు వంగిపోయాయి. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సోమవారం సాయంత్రం 7 గంటల వరకు కొన్ని ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దగ్గర ఉండి పనులు చేయించాం.

- కోడె సాంబశివరావు, మధురానగర్ సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి


ఆహార స్టాల్‌ను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

పోషకాహారంపై అవగాహన పెంచాలి : గవర్నర్

మంగళ్‌హట్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలు, విద్యార్థులు పోషకాహార పదార్థాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉన్నదని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. సోమవారం కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ జాతీయ పోషకాహార మహోత్సవాల్లో భాగంగా 'ప్రతి ఒక్కరికి పోషకాహారం' అన్న అంశంపై ఐదు రోజుల ఎగ్జిబిషన్‌ను గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'వివిధ రకాల సంస్కృతులు, భాషలతో కూడిన మన దేశంలో పోషకాహారంపై అవగాహనతో కూడిన సమాచారాన్ని ప్రజలందరికీ చేరవేయడం ఒక సవాలు. పోషకాహారంపై సందేశాలతో బుర్రకథ, పల్లె సుద్దుల వంటి జానపద కళారూపాల ద్వారా వివరించడం మనందరి బాధ్యత. దేశవ్యాప్తంగా కూడా ఈ తరహాలో ప్రయత్నాలు చేయాలి. రక్తహీనత నిర్మూలన, విటమిన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవడంపై అవగాహన పెంచాలి. వికసిత్ భారత్ అంటే ఆర్థికాభివృద్ధియే కాకుండా శారీరక, మానసిక శ్రేయస్సు కూడా ముఖ్యమే' అని అన్నారు. పీఐబీ సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజాన్ని రూపొందించేందుకు అందరూ తమ వంతు పాత్ర పోషించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని.. దాన్ని సాకారం చేసే దిశగా చేపట్టిన చిరు ప్రయత్నమే ఈ ఐదు రోజుల ఫొటో ఎగ్జిబిషన్ అన్నారు. ప్రవేశం ఉచితమని, ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ప్రదర్శనను తిలకించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ విజ్ఞులత, శాస్త్రవేత్త భానుప్రకాశ్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం ఫొటో ఎగ్జిబిషన్, ఆహార పదార్థాల స్టాళ్లను గవర్నర్ పరిశీలించారు.

బురద రాజకీయాలు మానండి..

● బీఆర్ఎస్ నేతలపై దానం నాగేందర్ ఆగ్రహం

● యూత్ కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో పార్టీ నేతలు పాల్గొనవద్దు: మహేశ్ గౌడ్

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరద ప్రాంతాల్లో మంత్రులు పర్యటిస్తూ సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటుంటే.. సీఎం, మంత్రులు ఏం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతలు బురద రాజకీయాలకు పాల్పడుతున్నారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఇకనైనా బురద రాజకీయాలు మానుకోవాలని సూచించారు. గాంధీభవన్‌లో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఎలాంటి కష్ట సమయాల్లోనైనా ప్రజలకు తోడుగా ఉండాలని బీఆర్ఎస్ నేతలకు హితవుపలికారు. మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్రం స్పందించి తక్షణ సాయం ప్రకటించాలని కోరారు. వరద బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అన్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధులు భవానీరెడ్డి, సంధ్యారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. వరదలపై ప్రభుత్వం ఏమీ చేయట్లేదంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాగా, యూత్ కాంగ్రెస్ ఎన్నికలు పారదర్శకంగా జరగాల్సి ఉందని, ఏఐసీసీ సూచన మేరకు ఈ ఎన్నికల ప్రచారంలో పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు సహా పార్టీ నాయకులెవరూ పాల్గొనవద్దని మహేశ్ గౌడ్ కోరారు.

గుంతలను సత్వరమే పూడ్చండి

● మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న దానకిశోర్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రోడ్లపై రాళ్లుండొద్దని, గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చాలని అధికారులను మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ ఆదేశించారు. కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రామ్(సీఆర్ఎంపీ) పథకంలో భాగంగా చేపట్టి పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులు, ఏజెన్సీలను ఆదేశించారు. సోమవారం సాయంత్రం మాసబ్‌ట్యాంక్‌లోని టీయూఎఫ్ఐడీసీ కార్యాలయంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, వాటర్‌బోర్డు ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్, ఉన్నతాధికారులు, టీయూఎఫ్ఐడీసీ ఇంజనీర్లు, సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులతో సీఆర్ఎంపీ, ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సర్కిళ్ల పరిధిలో పర్యవేక్షక, కార్యనిర్వాహక, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఏజెన్సీ ప్రతినిధులు ఉదయం పూట క్షేత్రస్థాయిలో పర్యటించాలని, పనులు చేపట్టక ముందు, పూర్తి అయిన తర్వాత ఫొటోలు, ప్రజల ఫీడ్‌బ్యాక్‌తో స్లైడ్‌లను వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేయాలని సూచించారు. ఇప్పటి వరకూ పూర్తి అయిన పనులకు సంబంధించి ఏజెన్సీలు ఆడిట్ రిపోర్ట్ అందజేయాలని ఆదేశించారు. థర్డ్ పార్టీ ఏజెన్సీలతో కూడా ఆడిట్ చేయించాలని చెప్పారు.

బీజేపీ సభ్యత్వ నమోదు వాయిదా

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు, వరదల దృష్ట్యా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు తెలిపారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం మంగళవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం ప్రారంభం కావాల్సి ఉంది. త్వరలో కొత్త తేదీని ప్రకటిస్తామని రామచందర్‌రావు పేర్కొన్నారు.

సాఫీగా సోమవారం!

(5వ పేజీ తరువాయి)

ఇంట్లోనే ఉండాలని కాలనీలు, బస్తీలతోపాటు వివిధ ప్రాంతాల్లో లౌడ్ స్పీకర్లతో అనౌన్స్‌మెంట్ చేశారు. దీంతో చాలామంది ఇళ్లకే పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం నగరంలోని ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ బాగా తగ్గిన పరిస్థితి కనిపించింది. మెహిదీపట్నం నుంచి గచ్చిబౌలి, ఉప్పల్ నుంచి నాగోల్, ఎల్‌బీ నగర్ నుంచి మలక్‌పేట్, ఎంజేమార్కెట్ నుంచి లక్డీకాపూల్, ఖైరతాబాద్ నుంచి కూకట్‌పల్లి, జేఎన్‌టీయూ నుంచి మియాపూర్, హైటెక్‌సిటీ మార్గాల్లో వాహనాలు వేగంగా దూసుకెళ్లిన పరిస్థితి కనిపించింది. సాధారణ రోజుల్లో ఆయా మార్గాల్లో కిలోమీటరు దూరానికి అరగంటకు వరకు సమయం పట్టగా, సోమవారం 10 నుంచి 15 నిమిషాల్లోనే వాహనదారులు వెళ్లడం కనిపించింది. విద్యాసంస్థలకు సెలవు ఇవ్వడంతో రోడ్లపై ప్రైవేట్ బస్సులు, ఆటోల రద్దీ కనిపించ లేదు.



గ్యాస్ వేధిస్తుంటే..

వేళకు తినకపోవడం, తిన్నా అరగకపోవడం చాలా మందికి ఎదురయ్యే సమస్య. వేపుళ్లు, జంక్ ఫుడ్, అధిక నూనెతో వండిన వంటకాలను తినటం వల్ల గ్యాస్ పెరిగి కడుపుబ్బరం సమస్య ఏర్పడుతుంది. దీనికి చిన్న చిట్కాలతో పరిష్కారం లభిస్తుంది. అవేమిటో చూద్దాం..

సమస్య మూలమిది: మనం తిన్న ఆహారం కడుపులోకి వెళ్లిన తరువాత.. జీర్ణం అవుతుంది. ఆ జీర్ణప్రక్రియలో కొన్ని రకాల వాయువులు విడుదలవుతాయి. కొన్నిసార్లు. అవి బయటికి వెళ్లకుండా కడుపులోను, పేవుల లోను పేరుకుపోతాయి. అవి చెడువాయువులుగా మారి ఇబ్బంది పెడతాయి. ఆయుర్వేదంలో ఈ సమస్యను ఆర్మానం, ఆటోపం అంటారు. ఈ వాయువులు బయటకు వెళ్లకపోతే

ఆ ప్రభావం గుండె.. ఊపిరితిత్తులపై పడుతుంది. గుండె దడ, ఆందోళన, గుండెల్లో నెప్పి మొదలైన లక్షణాలు కనిపిస్తాయి. ప్రతి రోజు క్రమం తప్పకుండా పల్చటి మజ్జిగ తాగితే ఈ సమస్య చాలా వరకూ పరిష్కారమవుతుంది.



చిట్కాలివే: అరిటి బోద లోపల తెల్లటి పదార్థం ఉంటుంది. దీని రసాన్ని రోజుకు ఒక కప్పు చొప్పున 15 రోజులు తాగితే గ్యాస్ సమస్య తగ్గిపోతుంది.

- అల్లం రసం తీసి దానిని వేడిచేసి తగినంత బెల్లం కలపాలి. ఇలా కలిపిన మిశ్రమాన్ని రోజుకు ఒక స్పూను తాగాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే కడుపుబ్బరం తగ్గిపోతుంది.
- గింజలున్న ఎండిన నల్ల ద్రాక్షను తీసుకొని నీళ్లలో ఆరు గంటలు నానబెట్టాలి. ఇలా నానిన ద్రాక్ష రసాన్ని తాగితే గ్యాస్ సమస్య తగ్గుతుంది.
- శొంఠిపొడి, పాత బెల్లంపొడిలను సమ పాళ్లలో కలుపుకోవాలి. ప్రతి రోజూ ఉదయం ఈ మిశ్రమాన్ని ఒక స్పూను తినాలి. ఆ తర్వాత వేడి నీళ్లు తాగాలి. ఇలా తాగితే కడుపులో ఉన్న మలినాలన్నీ తొలగిపోతాయి.
- ధనియాలు, శొంఠిలను సమపాళ్లలో తీసుకొని.. వేడి నీటిలో మరిగించాలి. అలా తయారయిన కషాయాన్ని తాగి నడిస్తే- గ్యాస్ సమస్య తగ్గుతుంది.
- సోంపు, జీలకర్ర, వాములను సమపాళ్లలో తీసుకొని పొడి చేయాలి. ఈ పొడిని ఉదయం, సాయంత్రం ఒక స్పూను చొప్పున వేడి నీళ్లలో వేసుకొని తాగాలి. ఇలా తాగితే వారం రోజుల్లో గ్యాస్ సమస్య తొలగిపోతుంది.

ఆయుర్వేదం

ఆకలి మందగిస్తే...

మానసిక, శారీరక సమస్యలు రెండూ ఆకలిని దెబ్బతీస్తాయి. కఫం, ఒత్తిడి, అజీర్తి, నిరాశానిస్పృహలు ఆకలిని మందగిసాయి. ఆకలి మందగించినప్పుడు రుచిని కోల్పోతాం. వాంతులు ఉండవచ్చు. ఏ కారణంగా ఆకలి మందగించినా మొదట శారీరకపరమైన కారణాలను విశ్లేషించుకోవాలి. వాటిలో భాగంగా ఆకలి మందగించడానికి అజీర్తి కారణమైతే మొదట 'లంఖణం' అనుసరించాలి. భోజనం మానేసి, తరచుగా నీళ్లు తాగాలి. ఆకలి వేసేవరకూ ఎలాంటి ఆహారం తీసుకోకుండా ఉండాలి. ఆకలి మొదలైనప్పుడు తేలికగా అరిగే ఆహారం తీసుకోవాలి. అలాగే కొన్ని చిట్కాలను పాటించాలి. అవేంటంటే...



- 10 నుంచి 20 మిల్లీ లీటర్ల కలబంద రసాన్ని రోజుకు రెండుసార్లు తీసుకోవాలి.
- భోజనానికి ముందు చిన్న అల్లం ముక్కను దంచి, నిమ్మరసం, తేనెలతో కలిపి తీసుకోవాలి.
- అర చెంచా జీలకర్రను చిటికెడు రాతి ఉప్పుతో కలిపి నమిలి నీళ్లు తాగాలి.
- ఆహారంలో సొంఠి, వాము, మిరియాలు చేర్చాలి.
- భోజనం తర్వాత అరచెంచా త్రికుట చూర్ణాన్ని మజ్జిగ లేదా గోరువెచ్చని నీళ్లతో తీసుకోవాలి.
- మధ్యాహ్న భోజనానికి ముందు ఒక చెంచా హింగ్వాష్టక చూర్ణాన్ని మజ్జిగతో కలిపి తీసుకోవాలి

కిడ్స్ డైట్



అమ్మ చేతి గోరుముద్ద!

పిల్లలు తినడానికి మొండికేస్తారు. అయిష్టత ప్రదర్శిస్తారు. బలవంతం చేస్తే ఏడ్చేస్తారు. అలాగని వదిలేస్తే పిల్లలకు పోషకాలు అందేదెలా? ఇలాంటప్పుడు పిల్లలకు బలవర్ధక ఆహారం మీద ఇష్టం పెరిగే చిట్కాలు పాటించాలి!

పిల్లల పోషకాహారం గురించిన అవగాహన తల్లుల్లో పెరగడం అభినందనీయమే! అయితే ఆ ఆహారంలో విటమిన్లు, ఖనిజలవణాలు, మాంసకృత్తులు, పిండిపదార్థాలు ఉండేలా సరిచూసుకోవడమూ అవసరమే! అయితే అవన్నీ ప్రాంతీయపరమైన, సంప్రదాయపూరితమైన, రుతుపరమైన ఆహార పదార్థాలేనా? మనం తినే ఆహారం, నివసించే వాతావరణాలతో మన అనుబంధం కాలక్రమేణా బలహీనపడుతోంది. ఇప్పటికి పదేళ్ల వెనక్కు వెళ్తే ఏ ఇంట్లో చూసినా పప్పు, అన్నంతో కూడిన భోజనమే తినేవాళ్లం. పిల్లలూ వాటినే ఇష్టంగా తినేవాళ్లు. కానీ ఇప్పుడు పోషకాల మీద పెరిగిన అవగాహన మూలంగా, పిండిపదార్థాలు, కొవ్వులను దూరం పెట్టేస్తున్నాం. ఏం కొంటున్నా, లేబుల్ పరీక్షించి, కేలరీలు లెక్కిస్తున్నాం. కానీ ఇలాంటి విపరీతమైన అప్రమత్తత వల్ల ఎక్కువ సందర్భాల్లో విలువైన పోషకాలకు దూరమవుతున్నాం. ఫిట్‌గా ఉండడానికి బదులు లావుగా తయారవుతున్నాం, తేలికగా జబ్బుల బారిన పడుతున్నాం. పోషకాలను బట్టి ఆహారాన్ని ఎంచుకునే ధోరణి వల్ల లాభపడేది ఆహార సంస్థలే! ప్రజల ఆరోగ్యానికి ఈ ధోరణి ఏమాత్రం ప్రయోజనకారి కాదు. కాబట్టి మరీ ముఖ్యంగా పిల్లలకు ఇచ్చే ఆహారం విషయంలో అమ్మమ్మల నాటి పాతవి, ఆరోగ్యకరమైన పద్ధతులనే ఎంచుకోవాలి.

అమ్మమ్మల ఆహారం!

ప్రపంచం మొత్తంలో స్థూలకాయం కలిగిన పిల్లలున్న దేశంగా భారతదేశం రెండవ స్థానంలో ఉంది. అంతమాత్రాన మనం పిల్లలు, వారి ఆహారపుటలవాట్లను అశ్రద్ధ చేస్తున్నామని కాదు. నిజానికి వారి ఆహారం పట్ల మనం అవసరానికి మించిన శ్రద్ధ ప్రదర్శిస్తున్నాం. పోషకాలున్న ఆహారం అది ప్రాంతీయమైనది కాకపోయినా, వెతికి వెతికి తినిపిస్తున్నాం. కానీ మన అమ్మలు, అమ్మమ్మలు ఇలా చేయలేదు. ఏ రుతువులో కాచే కాయలను ఆ రుతువుల్లో తినిపించారు. పొట్టు తీయని ధాన్యాలు, పెరట్లో పండిన కూరగాయలు, పళ్లు అందించారు. అప్పట్లో వంటగది ఇంటి మధ్యలో ఉండేది. ఎప్పుడు అవసరమైతే అప్పుడు వంటింట్లోకి వెళ్లి ఆహారం అందుకుని తినేటందుకే ఈ ఏర్పాటు. పాలు, పెరుగు, కమ్మని వెన్న, నెయ్యి, జున్నులు ప్రతి ఇంట్లో తాజాగా, సిద్ధంగా ఉండేవి. సున్నుండలు, అరిసెలు లాంటి బలవర్ధకైన చిరుతిళ్లు డబ్బాల్లో నింపి ఉంచేవారు. సెనగపప్పు ఉండలు, వేరుశనగ చెక్కలు, బెల్లం జిలేబీలు...ఇవన్నీ రక్తవృద్ధిని పెంచే చిరుతిళ్లే! వీటిలో ఎటువంటి ప్రిజర్వేటివ్స్, కృత్రిమ రంగులూ ఉండవు. కానీ ఇలాంటి వంటలు వండే బదులు, పాశ్చాత్య ఆహార పద్ధతులను అనుసరిస్తూ మాంసకృత్తుల కోసం సోయా, అవకాడొల మీద, పీచు కోసం ఓట్స్ మీద ఆధారపడుతున్నాం! వీటికంటే మెరుగైన ప్రత్యామ్నాయ, సంప్రదాయ పదార్థాలు ఎన్నో ఉన్నాయి.

పేచీ పెట్టే పిల్లలతో ఇలా...

కొంతమంది పిల్లలు తినడానికి పేచీ పెడతారు. ఆరోగ్యకరమైన ఆకుకూరలు, కూరగాయల పట్ల అయిష్టత ప్రదర్శిస్తారు. ఇలాంటప్పుడు పిల్లలకు ఆ ఆహారం పట్ల ఆసక్తి ఏర్పరిచే ప్రయత్నంచేయాలి. ఇందుకోసం పాలకూరను పెరట్లోనే పెంచాలి. పూల తొట్లలో కొత్తిమీర, పుదీనా, ఆకుకూరల విత్తనాలు చల్లి పిల్లల చేత వాటికి నీళ్లు పోయిస్తూ ఉండాలి. కూరగాయలు, ఆకుకూరలు ఎదిగే క్రమాన్ని పిల్లలు పరిశీలించేలా చేయాలి. అలాగే కూరగాయలు పండించే తోటలకు అరుదుగానైనా పిల్లలను తీసుకెళ్తూ ఉండాలి. పళ్లు, కూరగాయ మొక్కలను పిల్లలు గమనించేలా చేయాలి. ఇలా చేయడం వల్ల ఆ మొక్కల ఉత్పత్తుల పట్ల పిల్లలకు ఆసక్తి పెరుగుతుంది. వాటి వంటలను ఆస్వాదించాలనే కోరిక కూడా పెరుగుతుంది. ఆహారంతో అనుబంధం ఏర్పరచాలంటే పర్యావరణంతోనూ అనుబంధం ఏర్పరచాలి. పెద్దలు ఈ విషయంలో పిల్లలకు మార్గనిర్దేశకులుగా మారాలి. అలాగే బయట భోజనాలకు స్వస్తి చెప్పి, ఇంటి భోజనానికే పెద్దలు కట్టుబడి ఉండాలి. పిల్లలకూ ఆ అలవాటు నేర్పాలి. వంటింట్లో వంటపనిలో నిమగ్నమయ్యే తల్లులను చూసిన పిల్లలు కచ్చితంగా వంటగదిలో తయారయ్యే ఆహారాన్ని ఇష్టపడతారు. అలాగే కుటుంబసభ్యులందరూ నిర్దిష్ట సమయాల్లో కలిసి కూర్చుని భోజనం చేసే కట్టుబాటు అనుసరించాలి. ఆ సమయంలో టివి, సెల్‌ఫోన్ లాంటి వాటికి చోటు ఇవ్వకూడదు.

పిల్లల ఆహారం పసందుగా...

అన్నం, వేరుసెనగపప్పు, నెయ్యి, ఒక పండు, ఇంట్లో తయారైన లడ్డు... ఇదీ పిల్లలకు అనునిత్యం ఇవ్వవలసిన ఆహారం. వీటితోపాటు కూరగాయలు, ఇంట్లో వండిన ఎటువంటి ఆహారమైనా ఇవ్వవచ్చు. చిరుతిళ్లుగా గుప్పెడు వేరుసెనగపప్పులు, తాజా పండ్లు, అటుకుల ఉప్మా, గోధుమరొట్టె, బెల్లం ముక్క, ఇంట్లో తయారైన సున్నుండలు, లడ్లు... ఇలా పోషకభరితమైన చిరుతిళ్లను పిల్లలకు అలవాటు చేయాలి. 'ఫలానా పాఠం తప్పు లేకుండా రాసి చూపిస్తే, చాక్లెట్లు ఇప్పిస్తా!' లాంటి ఆశ పెట్టే పద్ధతులు మానేయాలి. చాక్లెట్లను వారానికి ఒకసారికే పరిమితం చేయాలి. గోధుమ బియ్యంలో పోషకాలు అధికం. అలాగని వాటిని వండి పెడితే పిల్లలు తినడానికి ఇష్టపడరు. కాబట్టి బియ్యంతోపాటు రెండు గరిటెల గోధుమ బియ్యం కలిపి వండి పెట్టవచ్చు. క్యారట్, క్యాప్సికమ్ లాంటి కూరగాయలను అందమైన ఆకారాల్లో కోసి, ఆకర్షణీయమైన అలంకరణతో వడ్డించి, పిల్లల్లో ఆసక్తినీ రేకెత్తించవచ్చు. వీలైనంత వరకూ భిన్నమైన పోషకాలు అందేలా మూడు, నాలుగు కూరగాయలను కలిపి వండవచ్చు. ఇలా పిల్లలకు నచ్చే, వారు మెచ్చే తరహాలోనే ఆహారం పట్ల వారికి ఇష్టాన్ని రెట్టింపు చేయవచ్చు.



పోషకాల చిరుతిళ్లు ఇవే!

పిల్లలకు జంతికలు, గవ్వలు లాంటి నిల్వ పిండిపదార్థాలనే చిరుతిళ్లుగా ఇవ్వవలసిన అవసరం లేదు. పచ్చి కూరగాయ ముక్కలకు ఉప్పు, నిమ్మరసం, చాట్ మసాలా జోడించి సలాడ్‌గా అందించవచ్చు. మొలకెత్తిన పెసలు, సెనగలు ఒక టీస్పూన్ నూనెలో వేయించి, క్రంచీగా ఉండడం కోసం వేయించిన వేరుసెనగ పప్పులు చల్లి, నిమ్మరసం కలిపి అందించవచ్చు. షియా విత్తనాలు నానబెట్టి, పండ్ల ముక్కలు, తేనె కలిపి తినిపించవచ్చు. కీర దోస లేదా జుకినిలను పొడవుగా తరిగి, ఉప్పు, చిల్లీఫ్లేక్స్, మొక్కజొన్న పిండి కలిపిన మిశ్రమంలో ముంచి, బ్రెడ్ పొడి అద్ది నూనెలో వేయించి అందించవచ్చు. కూరగాయలు కలిపి ఆమ్లెట్ వేసి ఇవ్వొచ్చు. పులిసిన పిండితో రొట్టెలు, చద్ది అన్నంతో దద్దోజనం లాంటివి కూడా ఆరోగ్యకరమే! ఆవిరి మీద ఉడికించిన చికెన్, చేప ముక్కలు లేదా గ్రిల్ చేసినవీ పిల్లలకు అందించవచ్చు. పండ్లముక్కలతో కస్టర్డ్ తయారుచేసి పెట్టవచ్చు.

ఆకలి తెలియనివ్వాలి

సాధారణంగా భోజన వేళకు పిల్లలు కూడా కడుపు నిండా తినడం అన్నిసార్లూ వీలుపడకపోవచ్చు. అప్పడప్పుడూ పిల్లల ఆకలి మందగిస్తూ ఉంటుంది. కాబట్టి తినడానికి పేచీ పెట్టినప్పుడు, బలవంతంగా తినిపించే ప్రయత్నం చేయకూడదు. ఆకలి ఉంటేనే పిల్లలకు ఆహారం అందించాలి. భయపెట్టి, బుజ్జగించి తినిపించడం వల్ల తల్లులు ఆశించే ప్రయోజనం నెరవేరకపోవచ్చు. సాధారణంగా తల్లులు, బడికెళ్లే ఈడు వరకూ పిల్లలకు ముద్దలు చేసి తినిపిస్తూ ఉంటారు. కానీ ఈ పద్ధతి కూడా సరికాదు. నడక వచ్చిన వయసు నుంచే పిల్లలు స్వతంత్రంగా తినే అలవాటు చేయాలి. ప్రతి రోజూ ఒకే సమయానికి, ఒకే ప్రదేశంలో తినే ఏర్పాట్లు ఉండాలి. పదార్థాలు నేల మీద పడిపోతాయనో, పిల్లలు చిందరవందర చేస్తారనో, దుస్తులు పాడైపోతాయనో పిల్లలను సొంతగా ఆహారం తిననివ్వకుండా అడ్డుకోకూడదు. పిల్లల కోసం ప్రత్యేకంగా తయారయ్యే స్పూన్లు, ఫోర్కులు, బౌల్స్, ప్లేట్స్‌నే వాడుకోవడం వల్ల వాటితో పిల్లలకు గాయాలు అవకుండా ఉంటాయి. నేల మీద పడినా పగిలిపోకుండా ఉండే పదార్థాలతో తయారైన పాత్రలు, స్పూన్లనే వాడుకోవాలి.

కార్బ్స్ కావలసిందే!

కార్బ్స్‌ను పూర్తిగా దూరం పెట్టేసే డైట్ ట్రెండ్‌ను విస్తృతంగా అనుసరించేవాళ్లున్నారు. కానీ శక్తిని సమకూర్చే పిండిపదార్థాలను పూర్తిగా మానేస్తే శరీరానికి శక్తి సమకూరేదెలా? మంచి, చెడు పిండిపదార్థాల్లో వేటిని ఏ పరిమాణంలో తీసుకోవాలో అవగాహన ఏర్పరుచుకుని తదనుగుణంగా మసలుకోవాలి.

పిండిపదార్థాలు ప్రధాన పోషకాలు. మనం రోజూ తీసుకునే ఆహారంలో 70% పిండిపదార్థాలే ఉంటాయి. జీర్ణవ్యవస్థ పిండిపదార్థాలను గ్లూకోజ్‌గా మారుస్తుంది. శరీరం ఈ గ్లూకోజ్‌ను కణజాలం, కణాలు, అవయవాల శక్తి కోసం వినియోగిస్తుంది. కాబట్టి శక్తినిచ్చే పిండిపదార్థాలు పూర్తిగా మానేయడం అవివేకం.

పిండిపదార్థాలు లోపిస్తే?

శక్తికి మూలాలైన పిండిపదార్థాలు లోపిస్తే శరీరం పలు లక్షణాల రూపంలో ఆ లోపాన్ని బహిర్గతపరిచే ప్రయత్నం చేస్తుంది. అవేంటంటే...

- నీరసం
- నోటి దుర్వాసన
- మలబద్ధకం
- వాంతులు
- తలనొప్పి
- పోషకలోపం


డి - గ్లూకోజ్

అత్యంత ముఖ్యమైన, కీలకమైన పిండిపదార్థం గ్లూకోజ్. అన్ని జీవరాశులు శక్తి కోసం వాడుకునే సులువైన చక్కెర (మోనోశాఖరైడ్) ఇది. అయితే పిండిపదార్థాలు శరీర బరువును కచ్చితంగా పెంచుతాయి. అవసరం లేని చెడు పిండిపదార్థాలు ఎక్కువగా తీసుకుంటూ, అవసరం ఉన్న మంచి పిండిపదార్థాలను పరిమితంగా తీసుకునేవారికి ఈ సమస్య సహజం. కాబట్టి వాటిలో ఏవి మంచి, ఏవి చెడు? అనే విషయం మీద అవగాహన ఏర్పరుచుకోవాలి.

మంచి పిండిపదార్థాలు (కాంప్లెక్స్ కార్బ్స్)

వీటిలోని రసాయన రూపం, పీచులను జీర్ణం చేసుకోవడానికి శరీరం ఎక్కువ శక్తిని ఖర్చుచేయవలసివస్తుంది. వీటి నుంచి అందే శక్తి శరీరానికి ఎక్కువ సమయంపాటు ఉపయోగపడుతుంది. మంచి పిండిపదార్థాలలో...

- పోషకాలు, పీచు ఎక్కువ
- గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ
- తక్కువ క్యాలరీలతోనే కడుపు నిండుతుంది
- శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం (మెటబాలిజం) పెరుగుతుంది.



పొట్టు తీయని గోధుమలతో తయారైన బ్రెడ్, రొట్టెలు, తృణధాన్యాలు, ఆకుపచ్చని కూరగాయలు, చిలకడదుంపలు, తాజా పళ్లు ఈ కోవకు చెందినవి.

చెడు పిండిపదార్థాలు (సింపుల్ కార్బొహైడ్రేట్స్)

ఇవన్నీ పొట్టు తీసి, పాలిష్ చేసిన పదార్థాలు. వీటిలో సహజసిద్ధ పోషకాలు, పీచు తక్కువ. చెడు పిండిపదార్థాల్లో....

- పీచు, పోషకాలు అతి స్వల్పం
- గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువ
- క్యాలరీలు కొవ్వుగా మారతాయి
- అత్యధిక గ్లూకోజ్ స్థాయులు (నీరసం తెప్పిస్తాయి)

చాక్లెట్లు, తీపి పదార్థాలు, తీపి జోడించిన తృణధాన్యాలు, సోడాలు, శీతల పానీయాలు, పొట్టు తీసిన పిండ్లు ఈ కోవకు చెందినవి.

మేలురకం పిండిపదార్థాలు వీటిలో...

ఓట్స్‌తో తయారైన బిస్కెట్లు, నారింజ రసం, యాపిల్, కేరట్లు, టమేటాలు, ఎండుద్రాక్ష, ద్రాక్ష, అరటి పళ్లు.

- **ఓట్‌మీల్:** ఎక్కువ సమయంపాటు శక్తినిచ్చే నిలకడైన పిండిపదార్థం ఇది. నీళ్లు కలిపి తయారుచేసిన ఒక కప్పు ఓట్‌మీల్‌లో 159 క్యాలరీలు ఉంటాయి. 4 గ్రాములు పీచు, 6 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి.
- **యాపిల్:** భోజనానికి, భోజనానికి మధ్య తీసుకోవలసిన ఈ అల్పాహార ఫలంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించే 4 గ్రాముల పీచు, పెక్టిన్‌లు ఉంటాయి. మాంసకృత్తులు పుష్కలంగా ఉండే వేరుసెనగపప్పుతో తయారయ్యే వెన్నతో కలిపి తీసుకుంటే ప్రయోజనకరం.
- **చిలకడదుంపలు:** ఇది నిజమైన 'సూపర్ ఫుడ్'. కప్పు చిలకడదుంప ముక్కల్లో 7 గ్రాముల పీచు, అత్యధిక విటమిన్ ఎ, సిలు, 4 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి.
- **మినుములు:** ఒక కప్పు ఉడకబెట్టిన పొట్టు తీయని మినుముల్లో 15 గ్రాముల పీచు, అంతే పరిమాణంలో మాంసకృత్తులు ఉంటాయి. ఇంత పరిమాణంలో పోషకాలు మరే పదార్థంలోనూ ఉండవు.
- **టమేటాలు:** వీటిలో విటమిన్లు, ఖనిజలవణాలు పుష్కలం. పీచుతో పాటు లైకోపీన్ అనే యాంటీఆక్సిడెంటు కూడా వీటిలో ఉంటాయి.

బ్లడ్ గ్రూప్ డైట్

రక్తగ్రూపును బట్టి ఆహారం!

తీసుకునే ఆహారం శరీర తత్వంతో సరిపోలితే అనారోగ్యాలను కలిగించే జిహ్వాచాపల్యాలకు దూరంగా ఉండగలుగుతాం! ఈ సూత్రం ఆధారంగా వాడుకలోకొచ్చిన తాజా డైట్...'బ్లడ్ గ్రూప్ డైట్'!

'ఒ' రక్త గ్రూపు: మిగతా రక్తగ్రూపులతో పోలిస్తే ఒ రక్తగ్రూపు వ్యక్తుల పొట్టలో ఆమ్లం ఎక్కువగా ఉత్పత్తి అవుతూ ఉంటుంది. అలాగే వీళ్లు శారీరకంగా ఎంతో చురుకుగా కూడా ఉంటారు. ఈ కోవకు చెందినవారు....

తినవలసినవి: అత్యధిక మాంసకృత్తులు కలిగి ఉండే ఆహారం తినాలి. ఇందుకోసం పచ్చిబఠాణీ, పాలు, జున్ను, అవకాడో, చిక్కుళ్లు, పప్పులు, విత్తనాలు తినాలి.

- మాంసకృత్తులను శరీరం శోషించుకోవడం కోసం ఎక్కువగా నీళ్లు కూడా తాగుతూ ఉండాలి.
- మాంసకృత్తులు, ఇతర పోషకాలను శరీరం తేలికగా, త్వరగా శోషించుకోవడం కోసం ఎక్కువగా ఇనుము ఉండే ఆహారం కూడా తింటూ ఉండాలి. ఇందుకోసం ఆకుపచ్చని కూరగాయలు, ఆకుకూరలు తినాలి.
- క్షార గుణం కలిగి ఉండే బెర్రీ పళ్లు, యాపిల్స్, మామిడి పళ్లు, అరటిపళ్లు తినాలి.

తినకూడనివి: విటమిన్ మాత్రలు, ప్రొటీన్ పొడర్లు

- పుల్లని పళ్లు
- వెన్న, సోయాపాలు, మొదలైనవి తక్కువగా తినాలి. లేదంటే జీర్ణసంబంధ సమస్యలు తలెత్తుతాయి.

'ఎ' రక్తగ్రూపు: ఈ గ్రూపు వ్యక్తులకు హృద్రోగాలు, కేన్సర్, మధుమేహం వచ్చే అవకాశాలు తక్కువ. ఈ వ్యక్తులు సున్నితమైన శరీర తత్వం కలిగి ఉంటారు. కాబట్టి సాధ్యమైనంతవరకూ సహజసిద్ధ రూపంలో ఉండే ఆహార పదార్థాలనే ఎంచుకోవాలి. వీరి పొట్టలో ఆమ్ల ఉత్పత్తి తక్కువ కాబట్టి తేలికగా అరిగే పదార్థాలే తినాలి.

తినవలసినవి: పళ్ల రసాలు. ఇవి శరీరంలో నీటి శాతాన్ని స్థిరంగా ఉంచడంతో పాటు ఈ రక్తగ్రూపుకు మేలు చేస్తాయి.



- సోయా, టోఫు, విత్తనాల ద్వారా సరిపడా మాంసకృత్తులు పొందవచ్చు.
- కూరగాయల ద్వారా విటమిన్లు, ఖనిజలవణాలు, యాంటీఆక్సిడెంట్లు పొందాలి.

తినకూడనివి: పాల ఉత్పత్తులు జీర్ణం కావడం కష్టం కాబట్టి వీలైనంత తక్కువ తీసుకోవాలి.

- బంగాళాదుంపలు, చిలకడదుంపలు, క్యాబేజీ, టమాటాలలో ఉండే పెప్టిన్ అనే ఎంజైమ్ జీర్ణం కాదు. కాబట్టి వీటికి దూరంగా ఉండాలి.

'బి' రక్తగ్రూపు: ఈ గ్రూపుకు చెందిన ఆహారం సమతులంగా ఉండి, పరిపూర్ణంగా కూడా ఉంటుంది. ఈ గ్రూపు వ్యక్తులు ఎలాంటి ఆహారాన్నైనా జీర్ణం చేసుకోగలరు. కాబట్టి ఆహారంలో ఎన్నో రకాల పదార్థాలను చేర్చుకోవచ్చు. కూరగాయలు, పళ్లు, పాల ఉత్పత్తులు....సమస్తం వీళ్లు తినవచ్చు.

'ఎబి' రక్తగ్రూపు: ఇది అరుదైన రక్తగ్రూపు. వీరికి 'ఎ', 'బి'....ఈ రెండు రక్తగ్రూపుల లక్షణాలు ఉంటాయి. కాబట్టి ఈ రెండు గ్రూపులకు చెందిన ఆహారం తింటూ ఒంట్లో ఆమ్ల తత్వాన్ని స్థిరంగా ఉంచుకోవాలి. ఇందుకోసం....

తినవలసినవి: పాల ఉత్పత్తులు వీరికెంతో మేలు చేస్తాయి. కాబట్టి పాలు, పెరుగు, వెన్న, జున్ను... తింటూ ఉండాలి.

- బీన్స్, చిక్కుళ్లు, సోయా, వేరుసెనగపప్పు, పెసలు తింటూ ఉండాలి.
- బీట్‌రూట్, బ్రొకొలి, దోస, వంకాయ ఎక్కువగా తినాలి.
- శరీరంలో నీటి శాతం స్థిరంగా ఉంచడం కోసం ఎక్కువగా పళ్లరసాలు తాగుతూ ఉండాలి.

తినకూడనివి: మాంసాహారం.

ఫిట్‌నెస్

లెగ్స్ లవ్లీగా...

కాళ్లు, తొడలు నాజూకుగా తయారవ్వాలంటే ఆ ప్రదేశాల్లోని కొవ్వును కరిగించి, కండరాలను బలపరిచే వ్యాయామాలు చేయాలి. ఇందుకోసం బరువులు లేకుండా, బరువులతో కూడిన కొన్ని రకాల వ్యాయామాలు చేయాలి.


వార్మప్ వ్యాయామాలు: వ్యాయామానికి తగ్గట్టుగా శరీరాన్ని, మరీ ముఖ్యంగా కాళ్లు, తొడలను సిద్ధం చేయడం కోసం....

- **సిట్ అప్స్:** మోకాళ్లు వంచి, నేల మీద గొంతుక్కూర్చునే వ్యాయామం చేయాలి. ఇలా 25 రిపిటీషన్స్ 3 సెట్స్ చేయాలి.
- **వాల్ సిట్ అప్:** గోడ కుర్చీ వ్యాయామం ఇది. ఈ భంగిమలో 30 సెకండ్ల పాటు 5 సార్లు కూర్చోవాలి.

లెగ్ థై ప్రెస్: ఈ వ్యాయామం కోసం కేటాయించిన పరికరం మీద కూర్చుని 50 కిలోల బరువులను కాళ్లతో నెట్టాలి.

- ఆసరా కోసం పరికరానికి ఇరువైపులా ఉన్న హ్యాండిల్స్‌ను పట్టుకోవాలి. వెన్ను, తలను నిటారుగా ఉంచాలి.
- రెండు పాదాలను పెడల్ పై ఉంచి, రెండు కాళ్ల మీద సమంగా బలం మోపుతూ పెడల్‌ను ముందుకు నెట్టాలి.
- ఈ వ్యాయామంతో తొడల మీద బరువు పడుతుంది.
- ఈ వ్యాయామం 20 రిపిటీషన్స్ 3 సెట్లు చేయాలి.

స్క్వాట్ ప్రెస్: ఈ వ్యాయామం నేల మీద నిలబడి చేయాలి. ఇందుకోసం 25 కిలోల డంబెల్స్ ఎంచుకోవచ్చు.



- కాళ్ల మధ్య అడుగు దూరం ఉంచి నిటారుగా నిలబడాలి.
- రెండు చేతుల్లోకి డంబెల్స్ తీసుకుని తల మీదుగా పైకి లేపాలి.
- బరువులు లేపినప్పుడు రెండు చేతులు వంచకుండా నిటారుగా ఉంచాలి.
- ఇదే భంగిమలో నెమ్మదిగా కాళ్లను వంచి కుర్చీ మీద కూర్చున్నట్టుగా కిందకు కుంగాలి.
- తిరిగి అంతే నెమ్మదిగా పైకి లేవాలి.
- ఇలా 25 రిపిటీషన్స్ 3 సెట్లు చేయాలి.

రొమేనియన్ డెడ్ లిఫ్ట్: బరువైన రాడ్‌తో చేసే వ్యాయామమిది. చెరో వైపు 10 కిలోల బరువులను ఎంచుకోవచ్చు.

- నిటారుగా నిలబడి, వంగి రాడ్‌ను రెండు చేతుల్లోకి తీసుకుని పైకి లేవాలి. లేచేటప్పుడు ఛాతీ ముందుకు ఉండాలి.
- వెన్ను నిటారుగా ఉండాలి, బరువును వంగి చేతుల్లోకి తీసుకునేటప్పుడు మోకాళ్లను కొద్దిగా వంచాలి.
- ఇలా 15 రిపిటీషన్స్ 3 సెట్లు చేయాలి.

స్టిఫ్ లెగ్ డంబెల్ డెడ్ లిఫ్ట్: ఈ వ్యాయామం 20 కిలోల బరువులతో చేయవచ్చు.

- చెరొక చేత్తో పది కిలోల డంబెల్స్‌ను తీసుకోవాలి.
- రెండు కాళ్ల మధ్య అరడుగు దూరం ఉంచి నిటారుగా నిలబడాలి.
- రెండు చేతుల్లోని డంబెల్స్ అభిముఖంగా వచ్చేవిధంగా ముందుకు వంగి చేతులను దించాలి.
- వంగేటప్పుడు మోకాళ్లను కొద్దిగా వంచి, పైకి లేవాలి.
- ఇలా 20 రిపిటీషన్స్ 3 సెట్లు చేయాలి.

ఎన్‌డీఆర్‌ఎఫ్ తరహాలో టీజీ-డీఆర్‌ఎఫ్!

- విపత్తులను ఎదుర్కొనేందుకు సొంత వ్యవస్థ
- అధికారులకు సీఎం ఆదేశాలు.. 1,600 మందికి శిక్షణ

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు కేంద్ర ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూసే పనిలేకుండా విపత్తులను ఎదుర్కొనేలా సొంత వ్యవస్థను సన్నద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా వినియోగించుకునేలా తెలంగాణ విపత్తు నిర్వహణ బృందం (టీజీ-డీఆర్‌ఎఫ్) వ్యవస్థను తయారు చేయాలని సూచించారు. రెండ్రోజులుగా కురిసిన వర్షాలకు పలు జిల్లాల్లో వరద పోటెత్తడంతో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను పిలిపించేందుకు ఓ ఐఏఎస్ అధికారి రోజంతా ఢిల్లీ ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులతో సంప్రదింపులు జరిపినా ఆరు బృందాలు మాత్రమే రాష్ట్రానికి వచ్చాయి. దీన్ని సీరియస్‌గా తీసుకున్న సీఎం సొంతంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ తరహాలో టీజీడీఆర్‌ఎఫ్ ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం అగ్నిమాపక శాఖ పరిధిలో పని చేస్తున్న సుమారు 1,600 మంది సిబ్బందికి, ప్రత్యేక పోలీసు దళాలకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఇలా శిక్షణ పొందిన వారిని 8 ప్రాంతాల్లో విపత్తుల నిర్వహణకు సన్నద్ధం చేయాలన్నారు. విపత్తులు లేని సమయంలో వీరి సేవలను బతుకమ్మ ఉత్సవాలు, వినాయక చవితి వేడుకలు, సమ్మక్కసారక్క జాతర సమయంలో వాడుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించినట్లు తెలిసింది.

జిల్లాల్లో వర్షాలపై మాన్యువల్ తప్పనిసరి

ఇక నుంచి వర్షాలకు సంబంధించి అన్ని జిల్లాల పరిధిలో ప్రత్యేక మాన్యువల్ తయారు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. 10సెం.మీ. వర్షం పడితే ఎలాంటి చర్యలు తీసుకోవాలి, 20సెం.మీ. దాటితే ఏం చేయాలి..? ఇలా వర్షపాతాన్ని అంచనా వేసి ముందస్తు చర్యలపై ఒక ప్రణాళికను సిద్ధం చేసి పెట్టుకోవాలని కలెక్టర్లను ఆదేశించినట్లు తెలిసింది. పదేళ్లుగా విపత్తుల నిర్వహణపై ఎలాంటి ప్రణాళికలు లేకపోవడం, కనీసం ఒక సమావేశం కూడా ఏర్పాటు చేయకపోవడంపై సీఎం అసహనం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన యాక్షన్ ప్లాన్ అన్ని జిల్లాల్లో సిద్ధంగా ఉండాలని, దీన్ని విపత్తుల నిర్వహణ విభాగం పర్యవేక్షణ చేయాలని ఆయన ఆదేశించారు.

వర్షాలు, వరదలతో 17 మంది మృతి..

కుండపోత వర్షాలు, భారీ వరదల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 17 మంది మృతి చెందినట్లు విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు ప్రకటించారు. ఖమ్మంలో 45 సెం.మీ., మహబూబాబాద్‌లో 25 సెం.మీ. వర్షపాతం నమోదైందన్నారు. మహబూబాబాద్ జిల్లాలో ముగ్గురు, భద్రాది కొత్తగూడెంలో ముగ్గురు, ఖమ్మంలో ఇద్దరు, నారాయణపేటలో ఇద్దరు, కామారెడ్డిలో ఒకరు, వనపర్తిలో ఒకరు, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ఐదుగురు వరదల్లో కొట్టుకుపోయి మృతి చెందినట్లు వివరించారు. మహబూబాబాద్‌లో ఆకేరు వాగులో కొట్టుకుపోయి మృతి చెందిన వ్యవసాయ శాస్త్రవేత అశ్విని, ఆమె తండ్రి మోతీలాల్‌ను వరదలు ఉన్నందున ప్రయాణం విరమించుకోవాలని పోలీసులు ముందే హెచ్చరించారని వెల్లడించారు. కె.సముద్రంలో వరదల్లో చిక్కుకున్న సంఘమిత్ర రైల్లోని 1,200 మంది ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించి భోజనం పెట్టి.. బస్సుల ద్వారా వారి గమ్యస్థానాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు

- వైద్య సిబ్బంది రక్షణకు పోలీస్ అవుట్ పోస్టులు: మంత్రి దామోదర

హైదరాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాల్లో వైద్య క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి దామోదర రాజనర్సింహా ఆదేశించారు. అవసరమైన వారందరికీ వైద్య సహాయం అందించాలని సూచించారు. వరదల తీవ్రత ఎక్కువగా ఉన్న ఖమ్మం జిల్లాలో పది వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని, ప్రతి బృందంలో స్పెషలిస్టు వైద్యులు, వైద్యపరికరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వరదల తర్వాత జ్వరాలు, డయేరియా వంటి రోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో 6 వేలకు పైగా డెంగీ కేసులు నమోదయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న కేటీఆర్ ట్వీట్‌పై మంత్రి స్పందించారు. బీఆర్‌ఎస్ హయాంలో నమోదైన డెంగీ కేసుల కంటే, ఈ ఏడాది తక్కువగా నమోదయ్యాయని, రాజకీయాల కోసం అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని విమర్శించారు. వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి జ్వర సర్వే చేస్తున్నారని, ఇప్పటికే 2.93 లక్షల మంది బాధితులను గుర్తించి, చికిత్స అందించామని వివరించారు. మరోవైపు, రాష్ట్రంలోని అన్ని బోధనాస్పత్రుల్లో వైద్య సిబ్బంది రక్షణ నిమిత్తం శాశ్వత ప్రాతిపదికన పోలీసు అవుట్ పోస్టులను నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. సుప్రీంకోర్టు ఆదేశాలకనుగుణంగా ఆస్పత్రుల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని, సీసీ కెమెరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లకు అనుసంధానం చేయాలని సూచించారు.

అంటువ్యాధుల ముప్పు?

- వర్షాల తర్వాత విజృంభించే అవకాశం
- వ్యక్తిగత శుభ్రత తప్పదంటున్న వైద్యనిపుణులు
- 4 వారాల పాటు జాగ్రత్తలు తప్పనిసరని సూచన

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్షాలు, వరదలు శాంతించిన వారం తర్వాత అంటువ్యాధులు విజృంభించే అవకాశాలు ఉంటాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంటు వ్యాధులతో పాటు సీజనల్ వ్యాధులు కూడా ప్రబలే ప్రమాదం ఉందంటున్నారు. ఇప్పటికే డెంగీ, మలేరియా, చికున్ గున్యా కేసులు హడలెత్తిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గత 45 రోజుల్లో 3.10 లక్షల జ్వరాల కేసులు, 6 వేలకు పైగా డెంగీ కేసులు నమోదవడం గమనార్హం. వర్షాలు, వరదల కారణంగా నీరు, ఆహారం కలుషితం అవుతాయని.. దాంతో టైఫాయిడ్, డయేరియా, కలరా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. వీటితో పాటు గ్యాస్ట్రోఎంటెరిటిస్ కేసులు భారీగా వచ్చే అవకాశం ఉంటుందని, ఇవి వైరస్ వల్ల వస్తాయని అంటున్నారు. కలుషితమైన నీరు, ఆహారం, బ్యాక్టీరియా, పరాన్న జీవులతో కలిసి వస్తుందని.. ఇది అంటువ్యాధి అని హెచ్చరించారు. వాంతులు, జ్వరం, ఆకలి లేకపోవడం, ఒంటి నొప్పులు, తల నొప్పి లాంటి లక్షణాలు ఉంటాయి. అలాగే వాతావరణ మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు ఇంకా ఎక్కువగా సోకే ప్రమాదం ఉంటుంది. ఇక జలుబు, ఫ్లూ, న్యూమోనియా లాంటివీ వస్తాయని వైద్యులు చెబుతున్నారు. వీటితో పాటు దోమల కారణంగా డెంగీ, చికున్‌గున్యా, మలేరియా విజృంభించవచ్చని అంటున్నారు. అలాగే ఎలుకల మలమూత్రాల కారణంగా లెప్టోస్పైరిసెస్ వచ్చే అవకాశం ఉందని, దాంతో కామెర్లు, కిడ్నీ వ్యాధులు, తీవ్రమైన జ్వరం లాంటివి వస్తాయని చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వారికి కాలి వేళ్ల మధ్యలో ఫంగస్, ఇతర చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని అంటున్నారు. నెల రోజుల పాటు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా ముఖ్యమంటున్నారు. ఇంటి చుట్టూ నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోతే టైఫాయిడ్, డయేరియా బారినపడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

బయటి ఆహారం వద్దు



ప్రజలు కొద్దిరోజుల పాటు బయటి ఆహార పదార్థాలను తినకపోవడమే ఉత్తమం. నీరు, ఆహారం ఎక్కువగా కలుషితం అయ్యే అవకాశం ఉంది. తాజా ఆహారాన్ని, కాచి, వడపోసిన నీటిని తీసుకోవాలి. సొంత వైద్యం వద్దు. వైరల్ ఫీవర్లకు యాంటీబయాటిక్స్ పనిచేయవు. వైద్యుల సలహా మేరకు, అవసరమైతేనే రక్త పరీక్షలు చేయించుకోవాలి. డెంగీ, చికున్‌గున్యాతో వచ్చే ఒంటి నొప్పులతకు నొప్పి నివారణ మందులు అస్సలు వాడొద్దు. వాటి వల్ల శరీరంలో ప్లేట్‌లెట్లు పడిపోయే ప్రమాదం ఉంది. ప్రజలంతా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలి. ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులకు ఆస్పత్రిలో చేరాల్సిన అవసరం 90 శాతం వరకు ఉండదు. సాధారణ చికిత్స సరిపోతుంది. - డాక్టర్ ఎంవీ రావు, యశోదా ఆస్పత్రి

నవ్య | చిత్రజ్యోతి

వారి మౌనం అంగీకారమే

నటి రాధిక



చిత్రపరిశ్రమలో నటీమణులపై జరుగుతున్న లైంగిక వేధింపులపై పలువురు సీనియర్ హీరోలు 'నో కామెంట్' అంటూ మౌనం దాల్చడంపై సీనియర్ నటి రాధిక ఘాటుగా స్పందించారు. వారి మౌనం అంగీకారంతో సమానమని వ్యాఖ్యానించారు. రాధిక సోమవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ.. 'చిత్రపరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ ఉన్న మాట నిజమే. నా కళ్ళ ఎదుటే పలు సంఘటనలు జరిగాయి. వాటిని నేను అక్కడే ఎదిరించాను. బాధితులకు అండగా నిలబడ్డాను. ప్రముఖ హీరోను పెళ్ళి చేసుకున్న ఒక హీరోయిన్‌కు ఈ తరహా వేధింపులు తప్పలేదు. ఆ సమయంలో ఆమెకు నేను అండగా ఉన్నాను. సినిమాలో నటించే హీరోయిన్‌తో పాటు జూనియర్ ఆర్టిస్టులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ఆయా చిత్ర నిర్మాతలు, ప్రొడక్షన్ యూనిట్ సభ్యులదే. ఒక సంఘటన జరిగితే బాధితురాలికి న్యాయం జరిగేందుకు కొన్నేళ్ళ పాటు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది.. ఉదాహరణకు నిర్భయ కేసే తీసుకోండి. ఎనిమిదేళ్ళ సమయం పట్టింది. ఈ లోపు ఆ బాధితులురాలు ఎంతగానో మానసిక క్షోభకు గురవుతారు. సమాజ సేవ కోసం, ప్రజల తరపున పోరాటం చేసేందుకు రాజకీయ పార్టీలు స్థాపించాలని భావించే పెద్దపెద్ద హీరోలు తమ తోటి మహిళా కళాకారులకు అండగా నిలవడం నేర్చుకోవాల్సి వుంది. ఇలాంటి తరుణంలోనే హీరోలు స్పందించాలి. కొందరి మౌనం అంగీకారంతో సమానం' అని ఆమె వ్యాఖ్యానించారు. మాలీవుడ్ కేరవాన్‌లలో సీక్రెట్ కెమెరాలు పెట్టారంటూ రాధిక చేసిన వ్యాఖ్యలపై స్పందించిన కేరళ పోలీసులు.. సోమవారం ఆమె వద్ద ఆరా తీశారు. దీని గురించి రాధిక మాట్లాడుతూ.. తనకు తెలిసిన విషయాలనే చెప్పాను తప్ప, తాను ఎవ్వరిపైనా ఫిర్యాదు చేయలేదని స్పష్టం చేశారు. మాలీవుడ్ హేమా కమిటీ నివేదిక అంశాల వెల్లడిపై ప్రస్తుతమున్న టాప్ హీరోలు తమ అభిప్రాయాలు చెబితే తమలాంటి నటీమణులకు ఓదార్పు కలుగుతుందన్నారు. ఎవరు తప్పు చేసినా తాను చూస్తూ ఊరుకోబోనని, హేమాకమిటీలా కోలీవుడ్‌కు కూడా ఓ కమిటీని ఏర్పాటు చేస్తే బాగుంటుందని రాధిక పేర్కొన్నారు.

మీటూ పార్ట్ 2 వచ్చింది అంతే

మహిళల పట్ల మాలీవుడ్‌లో ఉన్న పరిస్థితులు తమిళ పరిశ్రమలో లేవన్నారు హీరో జీవా. ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన సందర్భంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో 'మీటూ' పార్ట్ 1 వచ్చింది. ఇప్పుడు పార్ట్ 2 చూస్తున్నామన్నారు. రిపోర్టర్లు వరుస ప్రశ్నలు సంధించడంతో ఆయన వారిపై కోపగించుకొని వెళ్లిపోయారు. జీవా వ్యాఖ్యలను గాయని చిన్మయి శ్రీపాద ఖండించారు. కోలీవుడ్‌లో లైంగిక వేధింపులు లేవని ఆయన ఎలా చెబుతున్నారో తనకు అర్థం కావడం లేదన్నారు. హేమ కమిటీ నివేదికపై రాష్ట్ర ప్రభుత్వం జరుపుతున్న విచారణను సీబీఐకి అప్పగించాలని న్యాయవాదులు జన్నత్, ప్రేమ్‌జిత్‌లు హైకోర్టును ఆశ్రయించారు. హేమ కమిటీ ముందు హాజరైన బాధితులకు రక్షణ కల్పించాలనీ, ఈ తరహా కేసుల విచారణకు ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలని వారు కోరారు. మహిళలపై వేధింపులు ఒక్క సినిమా రంగానికి పరిమితం కాదు, ఇతర రంగాల్లోనూ ఉన్నాయి, కాబట్టి అక్కడ కూడా హేమ కమిటీ లాంటివి ఏర్పాటు చేయాలని దర్శకుడు వెంకట్‌ప్రభు అన్నారు.



త్వరలో తల్లికాబోతున్నారు బాలీవుడ్ కథానాయిక దీపికా పదుకొనే. బుజ్జాయి కోసం భర్త రణ్‌వీర్‌సింగ్ తో కలసి ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఆ ఆనందాన్ని ఆమె తన అభిమానులతో పంచుకున్నారు. తన మెటర్నిటీ ఫొటో షూట్‌కు సంబంధించిన కొన్ని చిత్రాలను దీపిక సోమవారం ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.

రాజమౌళి స్ఫూర్తితో తీసిన సినిమా ఇది

వెంకట్ ప్రభు



'గోట్ చిత్రంలో దళపతి విజయ్‌ను కొత్తగా చూపించబోతున్నాం. భారీ తారాగణం ఉన్నా ఏడాదిలో చిత్రీకరణ పూర్తి చేశాం. దీనికి స్ఫూర్తి రాజమౌళి గారే. నేను ఆయనకు పెద్ద అభిమానిని. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని విడుదల చేయడం గౌరవంగా భావిస్తున్నాను' అని దర్శకుడు వెంకట్ ప్రభు చెప్పారు. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలవుతున్న సందర్భంగా యూనిట్ సోమవారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా నటుడు ప్రశాంత్ మాట్లాడుతూ 'ఇదొక అద్భుతమైన చిత్రం. ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేసేలా ఉంటుంది. ఇంతమంది స్టార్స్‌తో ఒక సినిమా తీయడం మామూలు విషయం కాదు. వెంకట్ ప్రభు చాలా కష్టపడ్డారు. యువన్ మ్యూజిక్ ఈ చిత్రానికి ప్రత్యేకాకర్షణ' అన్నారు. నిర్మాత అర్చనా కల్పాతి మాట్లాడుతూ "ది గోట్ చిత్రం గొప్ప విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ఉంది. మైత్రీ మూవీ మేకర్స్‌తో కలసి పనిచేయడం ఆనందంగా ఉంది. చాలా ఎక్కువ థియేటర్లలో చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. సినిమాను ఎంజాయ్ చేయండి' అని ప్రేక్షకులను కోరారు. మీనాక్షి చౌదరి మాట్లాడుతూ 'నా కెరీర్ ప్రారంభంలోనే ఈ చిత్రంతో చాలా గొప్ప నటీనటులతో పనిచేసే అవకాశం దక్కింది. విజయ్ గారు చాలా కూల్‌గా ఉంటారు. ఆయనతో పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాను. సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి' అన్నారు. విజయ్, వెంకట్ ప్రభుతో కలసి పనిచేసే అవకాశం దక్కినందుకు ఆనందంగా ఉంది అని లైలా చెప్పారు. చాలా రోజుల తర్వాత నా సినిమా వస్తోంది, మిమ్మల్ని అలరిస్తుంది అని స్నేహ అన్నారు.

పదేళ్లు గుర్తుండే సినిమా



'నేను'మను' చిత్రంతో నిర్మాతగా మారా. అది సెప్టెంబర్ 6న విడుదలైంది. నా పదో చిత్రం '35.. ఇది చిన్న కథ కాదు' కూడా సెప్టెంబర్ 6నే విడుదలవుతుండడం ఆనందంగా ఉంది' అన్నారు సృజన్ యరబోలు. సిద్ధార్థ్ రాళ్లపల్లితో కలసి ఆయన నిర్మించిన '35.. ఇది చిన్న కథ కాదు' విడుదల సందర్భంగా మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడించారు. 'జనాలకు గుర్తుండిపోయి, క్లాసిక్‌గా నిలిచే కథ కోసం వెదుకుతున్న తరుణంలో నాకు నచ్చిన కథ '35.. చిన్న కథకాదు'. మదర్ సెంటిమెంట్‌కు మించిన కమర్షియల్ ఎలిమెంట్ లేదు. ఈ కథలో అది అద్భుతంగా కుదిరింది. చిత్రం విడుదలయ్యాక బాగుందనే టాక్ స్ప్రెడ్ అవుతుందనే నమ్మకం ఉంది. ఇది థియేటర్ కోసమే తీసిన సినిమా. పదేళ్లు గుర్తుండి పోతుంది' అన్నారు సృజన్.

ఆద్యంతం నవ్విస్తుంది



సుహాస్, సంకీర్తన జంటగా నటిస్తున్న 'జనక అయితే గనక' ఈ నెల 7న విడుదల కానుంది. సందీప్ రెడ్డి బండ్ల దర్శకత్వంలో హర్షిత్‌రెడ్డి, హన్షిత నిర్మించారు. శిరీష్ సమర్పకుడు. సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దిల్ రాజు మాట్లాడుతూ 'సుహాస్ ప్రతి సినిమాతో ఒక్కో మెట్టు ఎక్కుతున్నాడు. కొత్త కథలు అందించే ప్రయత్నం చేస్తున్నాడు. 'జనక అయితే గనక' కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. ఆద్యంతం నవ్విస్తుంది' అని చెప్పారు. సుహాస్ మాట్లాడుతూ 'కథ విన్నప్పుడు నవ్వుతూనే ఉన్నా. ఈ సినిమాను ఓవర్సీస్‌లో రిలీజ్ చేస్తున్నా' అని చెప్పారు. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఈ కథ బాగుందని మెచ్చుకున్నారని దర్శకుడు సందీప్‌రెడ్డి చెప్పారు.

అమెరికాలో తెలుగు సినిమా



శివకుమార్, నందిని రాయ్ జంటగా నటించే చిత్రం షూటింగ్ అమెరికాలోని వర్జీనియా సాయిబాబా టెంపుల్‌లో మొదలైంది. రవికుమార్ నాను దర్శకుడు. థ్రిల్లర్ జానర్‌లో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ మొత్తం అమెరికాలోనే జరుగుతుందని నిర్మాతలు శ్రావణి మాదిరాజు, మాధవి నాను చెప్పారు. ఈ సినిమాకు లైన్ ప్రొడ్యూసర్: పద్మ వాయువేగుల, చైతన్య వర్మ.

వడ్డేపల్లి కృష్ణకు జీవిత సాఫల్య పురస్కారం



ఆదివారం హైదరాబాద్‌లో తెలుగు సినీ రచయితల సంఘం త్రిశతాబ్ది ఉత్సవాలు జరిగాయి. పరుచూరి గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి నిర్మాత సురేశ్‌బాబు, నటుడు మురళీమోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గీత రచయిత వడ్డేపల్లి కృష్ణకు జీవిత సాఫల్య పురస్కారాన్ని సభ్యుల కరతాళ ధ్వనుల మధ్య అందజేశారు.

కొత్తగా..

వరద బాధితులకు చిత్రపరిశ్రమ విరాళం

ఉభయ తెలుగు రాష్ట్రాలు వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో బాధితులను ఆదుకునేందుకు తెలుగు చిత్ర పరిశ్రమ ముందుకొచ్చింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి ప్రముఖ నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ రూ. 25 లక్షల విరాళాన్ని ప్రకటించింది. అలాగే 'ఆయ్' చిత్రానికి సోమవారం నుంచి వారాంతం వరకూ వచ్చే కలెక్షన్లలో 25 శాతం వరద బాధితులకు జనసేన పార్టీ ద్వారా విరాళంగా అందజేస్తామని చిత్ర నిర్మాత బన్నీ వాసు ప్రకటించారు.

టైమ్ ట్రావెల్ నేపథ్యంలో



కన్నడ హీరో కిచ్చా సుదీప్, 'హనుమాన్' చిత్ర నిర్మాతలు కె. నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి కాంబినేషన్‌లో ఓ చిత్రం సెట్టయింది. 'బిల్లా రంగ బాషా' పేరుతో వస్తున్న ఈ సినిమాకు అనూప్ భండారి దర్శకుడు. సోమవారం సుదీప్ పుట్టిన రోజు సందర్భంగా యూనిట్ ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. ఈ చిత్రం టైమ్ ట్రావెల్ నేపథ్యంలో రూపొందుతోంది, త్వరలోనే చిత్రీకరణ ప్రారంభిస్తామని నిర్మాతలు తెలిపారు.

హీరోగా పరుచూరి మనవడు



ప్రముఖ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు మనవడు సుదర్శన్ హీరోగా పరిచయమవుతున్న 'మిస్టర్ సెలెబ్రిటీ' చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పరుచూరి వెంకటేశ్వరావు మాట్లాడుతూ 'సెలబ్రిటీల గురించి వినిపించే రూమర్స్‌ను బేస్ చేసుకుని దర్శకుడు రవికిశోర్ కథ రాసుకుని బాగా తీశాడు. సినిమా పెద్ద విజయం సాధించాలి' అని ఆకాంక్షించారు. 'నేను హీరోనవుతానని చెప్పగానే మా తాతగారు కొన్ని పరీక్షలు పెట్టారు. ఎవరికీ చెప్పకుండా జూనియర్ ఆర్టిస్టుగా పని చేశాను. ఒళ్లు దగ్గర పెట్టుకుని నటించు.. అని తాతగారు చెప్పారు. సినిమా చూసి మా టీమ్‌ను ఆశీర్వదించాలి' అన్నారు సుదర్శన్. సినిమాలో పతాక సన్నివేశం విభిన్నంగా ఉంటుందని దర్శకుడు రవికిశోర్ చెప్పారు.

అడవి వీరుల్ని అంతం చేసే కాలముఖ



డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'కన్నప్ప'లో మంచు విష్ణు టైటిల్ పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకుడు. సోమవారం కాలముఖ పాత్ర పోషిస్తున్న అర్పిత్ రంకా పాత్రను పరిచయం చేశారు. వేలాది మంది రక్తపాతాన్ని చూసే దాహం, అడవిని అడవి వీరుల్ని సైతం అంతం చేసే క్రూరత్వం అంటూ ఈ పాత్రను పరిచయం చేశారు. డిసెంబర్‌లో 'కన్నప్ప' విడుదలవుతుంది.

కుటుంబ ప్రేక్షకులు ఆదరిస్తున్నారు



రాజేశ్ నెల్లూరు దర్శకత్వం వహించిన మహిళా ప్రాధాన్య చిత్రం 'కావేరి' ఇటీవలే విడుదలై చక్కటి ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. కుటుంబ ప్రేక్షకుల నుంచి సినిమాకు మంచి ప్రశంసలు వస్తున్నాయని నిర్మాత అల్లాబక్ష తెలిపారు. తక్కువ బడ్జెట్‌లో రూపొందించిన చిత్రమైనా ప్రేక్షకులు ఆదరిస్తున్నారని దర్శకుడు తెలిపారు.

స్పోర్ట్స్

హైదరాబాద్ ● మంగళవారం 3 సెప్టెంబరు 2024



ఫైనల్‌కు దీప్తి

పారిస్: తెలుగమ్మాయి దీప్తి జీవాంజి పారాలింపిక్స్‌లో పతకం దిశగా దూసుకెళ్తోంది. తెలంగాణకు చెందిన దీప్తి మహిళల 400 మీటర్ల రేసు టీ20 విభాగంలో ఫైనల్‌కు అర్హత సాధించింది. సోమవారం రాత్రి జరిగిన హీట్-1లో 55.45 సెకన్లలో గమ్యాన్ని చేరుకొని అగ్రస్థానంలో నిలిచింది. రెండు హీట్స్ నుంచి తొలి మూడు స్థానాల్లో నిలిచిన అథ్లెట్లు, ఫాస్టెస్ట్ టైమింగ్ నమోదు చేసిన మరో ఇద్దరితో కలిపి మొత్తం ఎనిమిది మంది అథ్లెట్లు ఫైనల్‌కు ఎంపికవుతారు. ఫైనల్ మంగళవారం రాత్రి 10.30కు జరగనుంది.

గాఫ్, పౌలిని అవుట్


కొకొ గాఫ్

యూఎస్ ఓపెన్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో సంచలనాల జోరు ఆగడంలేదు. ఇప్పటికే హాట్ ఫేవరెట్ అల్కారజ్, పురుషుల సింగిల్స్ నిరుటి విజేత జొకోవిచ్ ఇంటిబాట పట్టగా.. తాజాగా మహిళల డిఫెండింగ్ చాంపియన్ కొకొ గాఫ్, ఐదోసీడ్ జాస్మిన్ పౌలిని కూడా వెనుదిరిగారు. సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్లో అమెరికాకు చెందిన 13వ సీడ్ ఎమ్మా నవారో 6-4, 4-6, 6-3తో తన దేశానికే చెందిన మూడో సీడ్ గాఫ్‌కు షాకిచ్చింది. అయితే ఈ ఓటమి గాఫ్ స్వయంకృతమే. ఏకంగా 19 డబుల్‌ఫాల్ట్‌లు చేసిన కొకొ పరాజయం కొనితెచ్చుకుంది. మరో నాలుగో రౌండ్ పోరులో అన్‌సీడెడ్ కరోలినా ముచోవా (చెక్ రిపబ్లిక్) 6-3, 6-3తో ఇటలీ సంచలనం పౌలినిని చిత్తుచేసింది. ఇతర మ్యాచ్‌ల్లో రెండో సీడ్ సబలెంకా 6-2, 6-4తో మెర్టెన్స్‌పై, ఆరో సీడ్ పెగులా 6-4, 6-2తో ష్నీడెర్‌పై, ఏడో సీడ్ జాంగ్ 7-6 (2), 4-6, 6-2తో 24వ సీడ్ వెకిక్‌పై విజయంతో క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించారు. పురుషుల సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో 4వ సీడ్ జ్వెరెవ్ 3-6, 6-1, 6-2, 6-2 నకాషిమాని ఓడించగా, జొకోవిచ్‌కు ఝలకిచ్చిన 28వ సీడ్ పాపిరిన్‌కు 6-4, 7-6 (3), 2-6, 6-3తో 20వ సీడ్ టియఫో చెక్ పెట్టి క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. ఇక ఆరో సీడ్ రుబ్లేవ్, ఎనిమిదో సీడ్ రూడ్‌కు కూడా రౌండ్-16లో చుక్కెదురైంది. పురుషుల డబుల్స్‌లో భారత వెటరన్ స్టార్ రోహన్ బోపన్న పోరాటం ముగిసింది. మూడో రౌండ్‌లో రోహన్ బోపన్న/ఎబ్డెన్ జోడీ 1-6, 5-7తో అర్జెంటీనా జంట గొంజాలెజ్/మోంటెనీ చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది.

ఓటమి ముంగిట పాక్

రావల్పిండి: చరిత్రాత్మక టెస్ట్ సిరీస్ క్లీన్‌స్వీప్‌నకు బంగ్లాదేశ్ 143 పరుగుల దూరంలో ఉంది. బంగ్లా పేసర్లు హసన్ మహమూద్ (5/43), నహీద్ రాణా (4/44) నిప్పులు చెరగడంతో.. ఆటకు నాలుగోరోజు రెండో ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్ 172 రన్స్‌కే కుప్పకూలింది. ఓవర్‌నైట్ స్కోరు 9/2కు 162 రన్స్ మాత్రమే జోడించిన పాక్ మిగతా 8 వికెట్లు చేజార్చుకొంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 12 రన్స్‌తో కలిపి మొత్తం 185 పరుగుల లక్ష్యాన్ని బంగ్లా ముందుంచింది. అనంతరం ఛేదనలో వర్షం కారణంగా సోమవారం ఆట నిలిచేసరికి బంగ్లా వికెట్ నష్టపోకుండా 42 రన్స్ చేసింది. అయితే, ఘోర అవమానం నుంచి తప్పించుకోవాలంటే ఆటకు ఐదో, ఆఖరిరోజు పాక్ 10 వికెట్లు కూల్చాలి. తొలి ఇన్నింగ్స్‌లో పాక్ 274, బంగ్లా 262 రన్స్ చేశాయి. రెండు టెస్టుల సిరీస్‌లో తొలిమ్యాచ్‌లో బంగ్లా నెగ్గింది.

డేవిస్ కప్ నుంచి నగాల్ అవుట్

న్యూఢిల్లీ: భారత అగ్రశ్రేణి టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నగాల్ వెన్ను గాయం కారణంగా డేవిస్ కప్ నుంచి తప్పుకొన్నాడు. వచ్చే నెల 14 నుంచి స్టాక్‌హోమ్ వేదికగా స్వీడన్ జట్టుతో భారత్ డేవిస్ కప్‌లో తలపడనుంది. ఈ పోరుకు నగాల్ దూరమయ్యాడు. 'వెన్నునొప్పితో బాధపడుతున్నా. రెండువారాలు విశ్రాంతి అవసరం వైద్యులు సూచించారు. అందుకే టోర్నీలో ఆడడం లేదు' అని నగాల్ తన సోషల్ మీడియా ఖాతాలో తెలిపాడు.

పసిడి పంట



నితేశ్, సుమిత్‌కు స్వర్ణాలు

సుహాస్, తులసి, యోగేశ్‌కు రజతాలు

మనీషాకు కాంస్యం

పారాలింపిక్స్‌లో పతకాల మోత మోగుతోంది. గత మూడు రోజుల్లో ఏడు మెడల్స్‌తో అదుర్స్ అనిపించిన దివ్యాంగ అథ్లెట్లు.. సోమవారం మరింత విజృంభించారు. ఈ ఒక్కరోజే మరో ఏడు పతకాలతో మురిపించారు. స్టార్ జావెలిన్‌త్రోయర్ సుమిత్ అంటిల్, షట్లర్ నితేశ్ స్వర్ణాలతో సత్తా చాటగా.. మరో షట్లర్ సుహాస్, డిస్కస్ త్రోయర్ యోగేశ్ వరుసగా రెండో పారాగేమ్స్‌లోనూ రజతాలతో ఆకట్టుకున్నారు. అలాగే మహిళా షట్లర్లు తులసిమతి రజతం, ఆర్చరీ జోడీ రాకేశ్-శీతల్, మనీషా కాంస్యాలతో సత్తా చాటారు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

అరంగేట్ర పారాలింపిక్స్‌లోనే స్వర్ణ పతకం సొంతం చేసుకున్న నితేష్ కుమార్ రాజస్థాన్‌లో జన్మించాడు. నితేష్ తండ్రి నేవీలో అధికారి.


రైలు ప్రమాదంలో కాలు కోల్పోయినా..


నితేశ్ కుమార్

ఆయన బాటలో నడుస్తూ నౌకాదళంలో ప్రవేశించి దేశ సేవ చేయాలని కూడా అనుకున్నాడు. కానీ 2009లో జరిగిన ప్రమాదం కుమార్ కలలను చిదిమేసింది. విశాఖట్నంలో కదులుతున్న రైలుబోగీ నుంచి జారిపడడంతో ఎడమ కాలును కోల్పోయాడు. దాంతో ఎన్నోరోజులు మంచానికే పరిమితమయ్యాడు. ఆ విషాదం నుంచి కోలుకొని చదువు కొనసాగించాడు. పుణెలో కృత్రిమ అవయవ కేంద్రాన్ని సందర్శించడం కుమార్ జీవిత దృక్పథాన్ని మార్చివేసింది. యుద్ధాలలో గాయపడిన అనేకమంది సైనికులను ఆ కేంద్రంలో చూశాక..తన అవయవలోప సవాలును అధిగమించడం కష్టమేమీ కాదని గ్రహించాడు. ఆపై ఏడాదిపాటు కష్టపడి చదివి 2013లో మండిలోని ఐఐటీలో సీటు సాధించాడు. అక్కడే బ్యాడ్మింటన్‌పట్ల ఆసక్తి పెంచుకున్న నితేశ్.. 2016లో పారా జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం అందుకున్నాడు. 2017లో ఐరిష్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ దక్కించుకున్నాడు. ఇక, 2019, 2020 ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో రజతాలు, 2024 ప్రపంచ టోర్నీలో కాంస్య పతకంతో అదరగొట్టాడు. ఆసియా పారా గేమ్స్‌లో ఒక స్వర్ణం, మరో రజతం, రెండు కాంస్య పతకాలు కుమార్ కొల్లగొట్టాడు. 29 ఏళ్ల నితేష్ హరియాణా ప్రభుత్వ క్రీడా యువజన శాఖలో బ్యాడ్మింటన్ సీనియర్ కోచ్‌గా భవిష్య షట్లర్లను తీర్చిదిద్దుతున్నాడు.

శీతల్ జోడీ కంచు మోత

మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్‌లో ఆర్చర్లు రాకేశ్ కుమార్, 17 ఏళ్ల శీతల్ దేవి పతకంతో సత్తా చాటారు. ఇద్దరికీ పారాగేమ్స్‌లో ఇదే తొలిపతకం కావడం విశేషం. సెమీస్‌లో ఇరాన్ చేతిలో షూటాఫ్‌లో ఓడిన భారత జోడీ కాంస్య పోరులో మాత్రం ఒత్తిడికి లోనుకాలేదు. ఇటలీ జోడీ సార్టి-బొనాసినాతో సాగిన ఈ మ్యాచ్‌లో శీతల్ జంట 156-155తో గెలిచింది. మనోళ్లు తొలి మూడు సెట్లలో రెండింటిని కోల్పోయినా చివరిదైన నాలుగో సెట్‌లో మాత్రం కచ్చితమైన గురితో బాణాలు వదిలారు. ఇద్దరూ తమ రెండు ప్రయత్నాల్లోనూ పర్ఫెక్ట్ 10 సాధించి 40 పాయింట్లు సాధించారు. అటు ఇటలీ జోడీ మాత్రం 9,9,10,10తోనే సరిపెట్టుకున్నారు. రెండు చేతులు లేకపోయినా కాళ్లతోనే బాణాలు సంధిస్తూ టీనేజర్ శీతల్ ఇప్పటికే ప్రపంచ క్రీడాభిమానులను ఆకట్టుకుంటున్న విషయం తెలిసిందే. వీరిద్దరూ తమ వ్యక్తిగత కాంపౌండ్ విభాగాల్లో మాత్రం మెడల్స్ అందుకోలేకపోయారు.


సుహాస్


మనీషా


తులసిమతి

పారిస్: భారత అథ్లెట్లు తమ అద్భుత ప్రదర్శనతో పారాలింపిక్స్‌లో పతకాల వరద పారిస్తున్నారు. గేమ్స్ రెండో రోజు నుంచే ఖాతా ఆరంభించిన భారత్ ఆ తర్వాత క్రమం తప్పకుండా పతకాల సంఖ్యను పెంచుకుంటూ వెళుతోంది. తాజాగా సోమవారం దేశానికి మరో ఏడు పతకాలు లభించాయి. ఇందులో షట్లర్లవే నాలుగుండడం విశేషం. తాజాగా భారత్ 3 స్వర్ణాలు, 5 రజతాలు, 6 కాంస్యాలతో 14 పతకాలను ఖాతాలో వేసుకుంది.

షట్లర్ల పతక జోరు: సోమవారం పోటీల్లో భారత షట్లర్లు పతకాల పండగ చేసుకున్నారు. ముందుగా పురుష సింగిల్స్ ఎస్ఎల్3 ఫైనల్లో వరల్డ్ నెంబర్‌వన్ నితేశ్ కుమార్ 21-14, 18-21, 23-21తో డానియెల్ బెథెల్ (గ్రేట్ బ్రిటన్)పై గెలిచి స్వర్ణం సాధించాడు. బెథెల్‌పై ఆడిన పది మ్యాచ్‌ల్లో నితేశ్‌కిదే తొలి విజయం. తొలి రెండు గేమ్‌ల్లో ఇరువురు ఆధిక్యం చూపగా.. నిర్ణాయక గేమ్ ఓ దశలో 19-19తో ఉత్కంఠను పెంచింది. చివరకు 23-21తో నితేశ్ మ్యాచ్‌ను ముగించి సంబరాలు చేసుకున్నాడు. ఇక ఏకపక్షంగా సాగిన పురుషుల సింగిల్స్ ఎస్ఎల్4 ఫైనల్లో సుహాస్ యతిరాజ్ 9-21, 13-21తో లుకాస్ మజుర్ (ఫ్రాన్స్) చేతిలో ఓడాడు. దీంతో వరుసగా రెండోసారి రజతంతో సంతృప్తిపడాల్సి వచ్చింది. టోక్యో గేమ్స్ ఫైనల్లోనూ వీరిద్దరే తలపడ్డారు. అలాగే మహిళల సింగిల్స్ ఎస్‌యూ5లో స్వర్ణంపై ఆశలు రేపిన తులసిమతి మురుగేశన్ ఫైనల్లో 17-21, 10-21తో యాంగ్ క్విక్సియా (చైనా) చేతిలో ఓడి రజతం సాధించింది. ఇదే విభాగం కాంస్య పతక పోరులో మనీష రామదాస్ 21-12, 21-8తో క్యాథరిన్ (డెన్మార్క్)పై సులువుగా నెగ్గింది. అయితే మిక్స్‌డ్ డబుల్స్ ఎస్‌హెచ్6 కాంస్య పోరులో శివరాజన్-నిత్యశ్రీ 17-21, 12-21తో సుబాన్-రీనా (ఇండోనేసియా) చేతిలో నిరాశే ఎదురైంది.

నయా చరిత్ర



స్టార్ జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్ పారాలింపిక్స్‌లో చరిత్ర సృష్టించాడు. ఎఫ్64 విభాగంలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన అతను వరుసగా రెండోసారి విజేతగా నిలిచాడు. అంతేకాకుండా.. టోక్యో గేమ్స్‌లో తాను నెలకొల్పిన రికార్డు (68.55 మీ.)ను ఏకంగా రెండుసార్లు నవరించాడు. ఈసారి జావెలిన్‌ను 70.59 మీ. దూరం విసిరి పారా గేమ్స్‌లో సరికొత్త రికార్డును నెలకొల్పాడు. వాస్తవానికి తన తొలి ప్రయత్నంలోనే 69.11 మీ. దూరంతో టోక్యో రికార్డును నవరించాడు. అలాగే భారత్‌కు చెందిన మరో భారత అథ్లెట్ సందీప్ చౌదరి 62.80 మీ. దూరంతో నాలుగో స్థానంలో నిలిచాడు.


యోగేశ్ భేష్

27 ఏళ్ల డిస్కస్ త్రోయర్ యోగేశ్ కతునియా కెరీర్‌లో రెండో రజతం సాధించాడు. పురుషుల డిస్కస్ త్రో ఎఫ్ 56 ఈవెంట్‌లో అతను డిస్క్‌ను 42.22 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచాడు. క్లాడినీ బటిస్టా (46.86 మీ.- బ్రెజిల్)కు స్వర్ణం, జొనిస్ (41.32 మీ.-గ్రీస్)కు కాంస్యం దక్కాయి. టోక్యో గేమ్స్‌లోనూ యోగేశ్ సిల్వర్ మెడల్‌తో రాణించాడు.

త్వరలో రిటైర్మెంట్‌పై నిర్ణయం

సైనా నెహ్వాల్

న్యూఢిల్లీ: కొన్నాళ్లుగా ఆటకు దూరమైన భారత వెటరన్ షట్లర్ సైనా నెహ్వాల్ ఈ ఏడాది చివర్లో రిటైర్మెంట్‌పై నిర్ణయం తీసుకుంటానని వెల్లడించింది. కీళ్ల నొప్పుల కారణంగా గతంలో మాదిరి ఎక్కువ గంటలు సాధన చేయలేకపోతున్నానని తెలిపింది. 'నాకు కీళ్ల నొప్పులు మొదలయ్యాయి. రోజుకు 8-9 గంటలు సాధన చేయడం కష్టంగా తయారైంది. ఈ స్థితిలో ప్రపంచ మేటి షట్లర్లతో ఎలా తలపడగలను? త్వరలో రిటైర్మెంట్‌పై నిర్ణయం తీసుకుంటా' అని సైనా తెలిపింది.

బిజినెస్

ఎస్‌బీఐలో మరో తెలుగు తేజం

ఎండీగా రామ మోహన రావు నియామకం



న్యూఢిల్లీ: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ)లో కీలక పదవికి మరో తెలుగు తేజం ఎంపియ్యారు. ఆంధ్రప్రదేశ్, బాపట్లకు చెందిన రామ మోహన రావు అమర.. బ్యాంక్ కొత్త మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా ఎంపికయ్యారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ), ఆర్థిక సంస్థల కీలక పదవులకు అభ్యర్థులను ఎంపిక చేసే 'ది ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇనిస్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) మొత్తం తొమ్మిది మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి రామ మోహన రావు పేరును ఎంపిక చేసింది. ఈ సిఫారసును కేంద్ర క్యాబినెట్ ఆమోదించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఎస్‌బీఐ ఎండీగా ఉన్న మరో తెలుగు తేజం సీ శ్రీనివాసులు శెట్టి ఇటీవలే ఎస్‌బీఐ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన స్థానంలో రామ మోహన రావు బ్యాంక్ ఎండీగా బాధ్యతలు స్వీకరించబోతున్నారు. ఇంజనీరింగ్ పట్టభద్రుడైన రావు 1991లో ప్రొబేషనరీ ఆఫీసరుగా ఎస్‌బీఐలో చేరారు. తన 32 సంవత్సరాల సర్వీసులో దేశ, విదేశాల్లోని ఎస్‌బీఐ శాఖల్లో ఆయన అనేక కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఈయన ఎస్‌బీఐ డిప్యూటీ ఎండీగా ఉన్నారు. భారత బ్యాంకింగ్ రంగంలో రారాజుగా భావించే ఎస్‌బీఐ చరిత్రలో రెండు కీలక పదవులకు ఇరువురు తెలుగు వారు ఒకేసారి ఎంపిక కావడం ఇదే మొదటిసారి.

రెండేళ్లలో మరో 6 ప్లాంట్లు

- రూ.1,000 కోట్లతో బయోలాజిక్స్ ప్లాంట్
- 2023-24లో రూ.29,000 కోట్ల టర్నోవర్

అరబిందో ఫార్మా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే అరబిందో ఫార్మా జెనరిక్స్ రంగంలో దూసుకుపోతోంది. ఫార్మా రంగంలో అత్యంత కీలకమైన యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రిడియెంట్స్ (ఏపీఐ) తయారీ కోసం 1986లో ఏర్పాటైన ఈ కంపెనీ.. ఇతర ఫార్మా కంపెనీల కొనుగోళ్లు, కొత్త ప్లాంట్ల ఏర్పాటు ద్వారా ప్రస్తుతం భారత ఫార్మా రంగంలో మేటి సంస్థగా ఎదిగింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో 350 కోట్ల డాలర్ల (సుమారు రూ.29,300 కోట్లు) టర్నోవర్ నమోదు చేసింది.

భారీ విస్తరణ బాటలో: కంపెనీ ప్రస్తుతం 29 ఉత్పత్తి యూనిట్లతో ఏటా 5,000 కోట్లకు పైగా ఫార్ములేషన్లు, 19,000 టన్నుల ఏపీఐల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంది. వీటికి తోడుగా వచ్చే రెండేళ్లలో మరో ఆరు కొత్త ఉత్పత్తి యూనిట్లు ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు వీలుగా ప్రత్యేక ఔషధాలపై దృష్టి పెట్టింది. దీనికి తోడు అమెరికాతో సహా ప్రధాన మార్కెట్లపై ప్రత్యేక దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా ఇటీవల ఇండోనేషియాలో ఫైజర్/వయాట్రిస్ కంపెనీల నుంచి 17 బ్రాండ్లను కొనుగోలు చేసి, అక్కడి మార్కెట్‌పై పట్టు సాధించేందుకు కృషి చేస్తోంది. ఇప్పటికే 14 బయోసిమిలర్ ఔషధాల అభివృద్ధి వివిధ దశల్లో ఉంది. ఇవిగాక మరో 14 పెప్టైడ్ ఏపీఐల కోసం డీఎంఎఫ్‌లను అమెరికాలో ఫైల్ చేసింది. కాగా ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) కింద రూ.2,500 కోట్ల పెట్టుబడితో పెన్సిలిన్-జీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది.


బయోలాజిక్స్‌లోకి ప్రవేశం

అరబిందో ఫార్మా ఈ మధ్యనే బయోలాజిక్స్ ఔషధాల కాంట్రాక్టు తయారీలోకి ప్రవేశించింది. ఇందుకోసం 'థెరానియమ్ బయోలాజిక్స్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో ప్రత్యేక అనుబంధ కంపెనీని ఏర్పాటు చేసింది. బయోలాజిక్స్ కోసం త్వరలో రూ.1,000 కోట్లతో ఏటా రెండున్నర నుంచి మూడు కోట్ల వయల్స్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్లాంట్ నుంచి కాంట్రాక్టు పద్ధతిలో బయోసిమిలర్స్ సరఫరా చేసేందుకు ఎంఎస్‌డీ కంపెనీతో మాస్టర్ సర్వీస్ ఒప్పందం (ఎంఎస్ఏ) కుదుర్చుకుంది. ఈ పెట్టుబడులు తమ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకువెళతాయని అరబిందో ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ కే నిత్యానంద రెడ్డి తెలిపారు.

హైదరాబాద్ విమానాశ్రయంలో ప్రైవేట్ విమానాల కోసం ప్రత్యేక టెర్మినల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్/శంషాబాద్ రూరల్): హైదరాబాద్, శంషాబాద్‌లో జీఎంఆర్ గ్రూప్ నిర్వహణలోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (ఆర్‌జీఐఏ).. ప్రైవేట్ విమానాల కోసం ప్రత్యేక టెర్మినల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆర్‌జీఐఏ టెర్మినల్ పక్కన 11,234 చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక సదుపాయాలతో ఈ టెర్మినల్ ఏర్పాటు చేసినట్టు ఆర్‌జీఐఏ తెలిపింది. ప్రైవేట్ ఎంట్రెన్స్, కార్ల పార్కింగ్ కూడా ఈ టెర్మినల్‌లో అందుబాటులో ఉంటాయి. వ్యక్తిగత లేదా వ్యాపార అవసరాల కోసం ప్రైవేట్ విమానాలు, చార్టర్డ్ విమానాల్లో వచ్చే కుబేరులు, వ్యాపార ప్రముఖుల విమానాలు ఈ టెర్మినల్ ద్వారా రాకపోకలు సాగించవచ్చు. హైదరాబాద్ ఇప్పటికే ఫార్మా, ఐటీ రంగాల్లో బాగా అభివృద్ధి చెందింది. ఇటీవల అనేక బహుళ జాతి కంపెనీలు ఇక్కడ తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ ఏర్పాటు చేస్తున్నాయి. ఈ రంగాలకు చెందిన ప్రముఖుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక టెర్మినల్ ఏర్పాటు చేసినట్టు జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సీఈఓ ప్రదీప్ పణిక్కర్ తెలిపారు.

మహీంద్రా సీబీజీ యువో టెక్ ప్లస్ ట్రాక్టర్



న్యూఢిల్లీ: మహీంద్రా ట్రాక్టర్స్.. కంప్రెస్డ్ బయోగ్యాస్‌తో (సీబీజీ) పని చేసే యువో టెక్ ప్లస్ ట్రాక్టర్‌ను కేంద్ర రోడ్డు రవాణా, హైవే శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమక్షంలో ఆవిష్కరించింది. సీబీజీతో పని చేసే ఈ ట్రాక్టర్ కాలుష్యం, కర్బన వ్యర్థాలను గణనీయంగా తగ్గించగలుగుతుందని కంపెనీ తెలిపింది. సీఎన్‌జీ అయితే శిలాజ ఇంధనాల నుంచి తయారవుతుందని, దానికి భిన్నంగా సీబీజీ పూర్తిగా హరిత, పునరుత్పాదక ఇంధనాల నుంచి తయారవుతుందని కంపెనీ పేర్కొంది.

ఐపీఓలో కేటాయించిన షేర్లలో 54% వారంలోపే విక్రయిస్తున్నారు..

సెబీ అధ్యయన నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: ప్రస్తుతం మార్కెట్లో పబ్లిక్ ఇష్యూల (ఐపీఓ)ల బూమ్ నడుస్తోంది. బడా ఇన్వెస్టర్ల నుంచి రిటైల్ మదుపరుల వరకు అందరూ వీటిల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఎగబడుతున్నారు. ఈ నేపథ్యంలో ఐపీఓ ఇన్వెస్టర్ల ప్రవర్తనా శైలిపై అధ్యయన నివేదికను క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ సోమవారం విడుదల చేసింది. యాంకర్ ఇన్వెస్టర్లు మినహాయించి మిగతా పెట్టుబడిదారులు తమకు పబ్లిక్ ఇష్యూ ద్వారా కేటాయించబడిన షేర్లలో 54 శాతం (విలువపరంగా) వారంలోపే విక్రయించేస్తున్నారని సెబీ రిపోర్టు వెల్లడించింది. ఇన్వెస్టర్లలో లాభాలను తక్షణం సొమ్ము చేసుకునే స్వభావం పెరిగిందని నివేదిక గుర్తించింది. లాభాలతో లిస్టయ్యే కంపెనీ షేర్లలోనే ఈ ట్రెండ్ అధికంగా కన్పిస్తోందని సెబీ పేర్కొంది. మరిన్ని ముఖ్యాంశాలు..

- 2021 ఏప్రిల్ నుంచి 2023 డిసెంబరు మధ్య కాలంలో ఐపీఓకు వచ్చిన 144 కంపెనీల డేటాను సెబీ అధ్యయనం చేసింది. ఈ 144 కంపెనీలు ప్రైమరీ మార్కెట్ నుంచి మొత్తం రూ.2.13 లక్షల కోట్లు సమీకరించాయి. అందులో 65 శాతం నిధులు ఆయా కంపెనీల ప్రమోటర్లు, ఇన్వెస్టర్ల జేబుల్లోకే వెళ్లాయి.
- వ్యక్తిగత ఇన్వెస్టర్లు 70 శాతం షేర్లను ఏడాదిలోగా విక్రయిస్తున్నారు. కాగా, మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఐపీఓల్లో దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెడుతున్నాయి. బ్యాంకులు మాత్రం వెంటనే ఎగ్జిట్ అవుతున్నాయి. మ్యూచువల్ ఫండ్లు 3.3 శాతం షేర్లను వారంలోపే విక్రయిస్తుండగా.. బ్యాంకుల విషయంలో ఈ వాటా ఏకంగా 79.8 శాతంగా ఉంది.
- ఐపీఓలో కేటాయించబడిన షేర్ల విక్రయ స్వభావాన్ని లిస్టింగ్ లాభాలు ప్రధానంగా ప్రభావితం చేస్తున్నట్టు అధ్యయనంలో వెల్లడైంది.
- లిస్టయిన వారంలో 20 శాతానికి పైగా రిటర్నులు పంచినప్పుడు, వ్యక్తిగత ఇన్వెస్టర్లు 67.6 శాతం షేర్లను వారంలోపు విక్రయించేశారు. కాగా, లిస్టింగ్‌లో నష్టాలు పంచిన కంపెనీ షేర్లను మాత్రం 23.3 శాతమే విక్రయించారు.
- ప్రాంతాలవారీగా పరిశీలిస్తే, గుజరాత్‌కు చెందిన రిటైల్ ఇన్వెస్టర్లు అత్యధికంగా ఈ కేటగిరీలో 39.3 శాతం షేర్లను అందుకున్నారు. మహారాష్ట్ర (13.5 శాతం), రాజస్థాన్ (10.5 శాతం) ఇన్వెస్టర్లు ఆ తర్వాత స్థానాల్లో ఉన్నారు.
- ఐపీఓల్లో చిన్న మదుపరుల పెట్టుబడులు పెరగడానికి గడిచిన కొన్నేళ్లలో డీమ్యాట్ అకౌంట్లు బాగా పెరగడం కూడా ఓ కారణం. 2021 ఏప్రిల్ నుంచి 2023 డిసెంబరు మధ్యలో ఐపీఓల కోసం దరఖాస్తు చేసిన డీమ్యాట్ ఖాతాల్లో దాదాపు సగం 2021-2023 మధ్య కాలంలో తెరిచినవే.

టాటా మోటార్స్ నుంచి కర్వ్ పెట్రోల్, డీజిల్ కార్లు

ప్రారంభ ధర రూ.9.99 లక్షలు



న్యూఢిల్లీ: దేశీయ కార్ల దిగ్గజం టాటా మోటార్స్ మిడ్‌సైజ్ ఎస్‌యూవీ కూపే కర్వ్ పెట్రోల్, డీజిల్ వెర్షన్లను మార్కెట్లోకి తెచ్చింది. దీని ప్రారంభ ధర రూ.9.99 లక్షలు. ఆగస్టు నెలలోనే టాటా కర్వ్ విద్యుత్ వెర్షన్‌ను విడుదల చేశారు. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మిడ్‌సైజ్ ఎస్‌యూవీ విభాగంలో దీన్ని ప్రవేశపెడుతున్నామని, మొత్తం ఆటోమొబైల్ పరిశ్రమలో ఈ విభాగం ప్రస్తుతం 16 శాతం వాటా కలిగి ఉందని టాటా మోటార్స్ ప్రయాణికుల వాహన విభాగం ఎండీ శైలేష్ చంద్ర అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతున్న ఎస్‌యూవీ కూపే బాడీతో కర్వ్‌ను తయారుచేసినట్టు ఆయన తెలిపారు. కర్వ్ రెండు పెట్రోల్, ఒక డీజిల్ వెర్షన్‌లో అందుబాటులో ఉంటుందని చెప్పారు.

రూ.250తో సిప్!

త్వరలోనే అందుబాటులోకి

సెబీ చీఫ్ మాధవి పురి బుచ్



ముంబై: దేశంలో క్రమానుగుత పెట్టుబడులను (సిప్) మరింతగా ప్రోత్సహించడంతో పాటు సామాన్య ప్రజానికానికీ ఈ పథకాలను అందుబాటులోకి తెచ్చేందుకు మ్యూచువల్ ఫండ్ పరిశ్రమతో కలిసి కృషి చేస్తున్నట్టు సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ తెలిపారు. దేశీయ మదుపరులు త్వరలోనే నెలకు రూ.250తో సిప్ చేయగలుగుతారని ఆమె అన్నారు. సీఐఐ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఓ సదస్సులో బుచ్ ఈ విషయాన్ని వెల్లడించారు. కాగా, దేశంలో తొలిసారిగా రూ.250 సిప్ ప్లాన్‌ను ప్రవేశపెట్టేందుకు ఆదిత్య బిర్లా సన్ లైఫ్ మ్యూచువల్ ఫండ్ సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్ సంస్థల పథకాల్లో నెలకు కనీసం సిప్ చేయగలిగే పరిమితి రూ.500గా ఉంది.

త్వరలో సింగిల్ ఫైలింగ్ విధానం: లిస్టెడ్ కంపెనీలకు సమాచార బహిర్గత ప్రక్రియను మరింత సులభతరం చేయనున్నట్టు, సింగిల్ ఫైలింగ్ విధానాన్ని త్వరలోనే అమల్లోకి తేనున్నట్టు బుచ్ తెలిపారు. కొత్త విధానంలో లిస్టెడ్ కంపెనీలు ఏదైనా స్టాక్ ఎక్స్ఛేంజీకి సమాచారం అందిస్తే, ఆ సమాచారం ఇతర ఎక్స్ఛేంజీలోనూ ఆటోమెటిక్‌గా అప్‌లోడ్ అవుతుంది. తద్వారా కంపెనీలు ప్రతి ఎక్స్ఛేంజీలకు విడివిడిగా ఫైలింగ్ చేసే బెడద తప్పనుంది.

రీట్స్‌పై నో కామెంట్స్: రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్ (రీట్స్)పై వ్యాఖ్యానించేందుకు సెబీ చీఫ్ నిరాకరించారు. "ప్రస్తుతం రీట్స్‌పై తానేం మాట్లాడినా పరస్పర విరుద్ధ ప్రయోజన ఆరోపణలు వచ్చే ప్రమాదం ఉంది" అన్నారు. రీట్స్ నిబంధనలకు సెబీ ఈ మధ్య జరిపిన సవరణలు మాధవి పురి బుచ్ భర్త ధవల్ బుచ్ భాగస్వామ్యుడిగా ఉన్న కంపెనీకి లబ్ధి చేకూర్చేలా ఉన్నాయని హిండెన్‌బర్గ్ ఇటీవల ఆరోపించింది. అయితే, సెబీ ఆ ఆరోపణలను ఖండించింది. కాగా, దేశీయ రీట్స్ విభాగంలో భారీగా పెట్టుబడులు కలిగిన అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్‌కు ధవల్ బుచ్ సీనియర్ సలహాదారుగా ఉన్నారు.

అన్‌స్టాపబుల్ ర్యాలీ

సరికొత్త శిఖరాలకు సూచీలు

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఈ నెలలోనే తగ్గించవచ్చన్న అంచనాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల దన్నుతో దేశీయ ఈక్విటీ సూచీలు సోమవారం సరికొత్త శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ ఒక దశలో 359.51 పాయింట్లు వృద్ధి చెంది 82,725.28 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి సూచీ 194.07 పాయింట్ల లాభంతో 82,559.84 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపును కూడా నమోదు చేసింది. సెన్సెక్స్ లాభపడటం వరుసగా ఇది పదో రోజు. 2023 సెప్టెంబరు తర్వాత సూచీకిదే సుదీర్ఘ ర్యాలీ. కాగా, నిఫ్టీ 97.75 పాయింట్ల వరకు పెరిగి 25,333.65 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 42.80 పాయింట్ల లాభంతో 25,278.70 వద్ద సరికొత్త గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. సూచీ ర్యాలీ తీయడం వరుసగా ఇది 13వ రోజు. గడిచిన పదమూడు ట్రేడింగ్ సెషన్లలో నిఫ్టీ 1,140 పాయింట్లు (4.72 శాతం), గత పది రోజుల్లో సెన్సెక్స్ 2,135.16 పాయింట్లు (2.65 శాతం) వృద్ధి చెందాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,770 ▼	66,700 ▼	91,000 ▼
ముంబై	71,511 ▼	65,504 ▼	82,780 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

3వ తేదీ			
హైదరాబాద్	465	విజయవాడ	495
వరంగల్	467	గోదావరి	495
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	99	విజయవాడ	108
వరంగల్	99	గుంటూరు	105
కరీంనగర్	99	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	87
కర్నూలు	99	నెల్లూరు	87
విశాఖపట్నం	99	అనంతపురం	100
గోదావరి	108		


మహబూబాబాద్‌లో మున్నేరు వాగు వద్ద దెబ్బతిన్న రోడ్డు


నిజామాబాద్ జిల్లా హంగర్గలో నీట మునిగిన పంట పొలంలో రైతులు

వరద నష్టం.. తీరని కష్టం

రాష్ట్రవ్యాప్తంగా 173 మండలాల్లో భారీ వర్షాలు

- కామారెడ్డి సదాశివనగర్ మండలంలో 24 సెం.మీ వర్షం
- ఖమ్మం జిల్లాలో 60-70 వేల ఎకరాల్లో పంట నీటమునక
- రూ.1000 కోట్ల నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా
- మహబూబాబాద్ జిల్లాలో తెగిన 53 చెరువుల కట్టలు
- ఉమ్మడివరంగల్ జిల్లాలో 35 వేలకు పైగా ఎకరాల మునక
- ఆగిన బొగ్గు ఉత్పత్తి.. సింగరేణికి రూ.60 కోట్లకు పైగా నష్టం
- వర్షాలు తగ్గడంతో ఊపిరి పీల్చుకుంటున్న ఉమ్మడి నల్లగొండ
- ఉమ్మడి పాలమూరులో 10వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో నేడు విద్యాసంస్థలకు సెలవు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రెండు రోజులుగా రాష్ట్రాన్ని కుదిపేస్తున్న వర్షబీభత్సం మూడోరోజూ కొనసాగింది. రాష్ట్రవ్యాప్తంగా 173 మండలాల్లో సోమవారం భారీ వర్షాలు కురిశాయి! అయితే.. శని, ఆదివారాల్లో కురిసిన భారీ, అతిభారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న ఉమ్మడి నల్లగొండ, మానుకోట, ఖమ్మం జిల్లాల్లో వాన ఉధృతి ఒకింత తగ్గింది. కానీ.. ప్రజల కంట కన్నీరే మిగిలింది! లక్షల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి! వేలాదిగా ఇళ్లు కూలాయి!! అయినవారిని కోల్పోయినవారు కొందరు.. ఇళ్లు పూర్తిగా నీట మునగడంతో కట్టుబట్టలతో మిగిలినవారు ఇంకొందరు! నీటమునిగిన పంటలను చూసి రైతన్నలు కంటతడి పెడుతున్నారు.

తేరుకుంటున్న మానుకోట

రెండురోజులుగా కురిసిన భారీ వర్షాలు దెబ్బకు అతలాకుతలమైన మహబూబాబాద్ (మానుకోట) జిల్లా ఇప్పుడిప్పుడే తేరుకుంటోంది. వర్ష బీభత్సానికి జిల్లాలో పలుచోట్ల పంటలు కొట్టుకుపోగా, పొలాల్లో ఇసుక మేట వేసింది. అనేక చోట్ల వాగులపై వంతెనలు, బీటీరోడ్లు, అప్రోచ్ రోడ్లు ధ్వంసం కాగా, చెరువు కట్టలు తెగిపోయాయి. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం వరకు పడిన భారీ వర్షానికి మహబూబాబాద్ జిల్లాలో 53 చెరువుల కట్టలు తెగినట్టు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. పాలేరు, ఆకేరువాగులపై మూడు చెక్‌డ్యాంలు కొట్టుకుపోయాయి. వాన ఉధృతికి జిల్లా వ్యాప్తంగా 15 రోడ్లు దెబ్బతినగా.. సుమారు 28 వేల ఎకరాలు నీటమునిగినట్టు ప్రాథమిక అంచనా. కాగా.. రాళ్లవాగులో ఆదివారం రాత్రి కొట్టుకుపోయిన నాగభూషణం (రాజమండ్రి వాసి) ఆచూకీ ఇంత వరకు లభించలేదు. తొర్రూరు మండలం వెంకటపురం వాగులో గల్లంతైన వ్యక్తి చిన్న సోమయ్య మృతదేహాన్ని సోమవారం పోలీసులు వెలికితీశారు. ఇక.. భారీ వర్షాలతో హనుమకొండ జిల్లాలో సుమారు 1000 చెరువులూ నిండుకుండలను తలపిస్తున్నాయి. వరంగల్ జిల్లాలో 6,533 ఎకరాల్లో పంట నీట మునిగింది. జనగామ జిల్లాలో సుమారు 278 ఎకరాల్లో వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. మల్హర్ మండలంలోని తాడిచర్ల ఓసీపీలో భారీ వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. రెండు రోజుల్లో 12 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.50 లక్షల ఓబీ వెలికితీత పనులు జరగాల్సి ఉండగా అవన్నీ స్తంభించిపోయాయి. ఓసీపీలోకి వరద నీరు భారీగా వచ్చి చేరడంతో మోటార్ల ద్వారా నీటిని బయటకు పంపిస్తున్నారు. భూపాలపల్లి సింగరేణి ఏరియాలో భారీ వర్షాలకు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-2, 3లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. మూడు రోజులలో వర్ష ప్రభావంతో ఓసీ-2, 3 ప్రాజెక్టుల నుంచి సుమారు 17వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగిందని.. దీంతో సింగరేణికి సుమారు రూ. 60 కోట్లు నష్టం వచ్చిందని అధికారులు తెలిపారు.


ఖమ్మం జిల్లా నాయకన్‌గూడెం వద్ద జాతీయ రహదారిపై ముక్కలైన రహదారి

ఖమ్మం జిల్లాలో.. వరద నష్టం రూ.1000 కోట్లు

ఖమ్మం జిల్లాలో వాన, వరద, మున్నేరు బీభత్సంతో సుమారు వెయ్యి కోట్ల రూపాయల నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా. జాతీయ, రాష్ట్ర రహదారులు దెబ్బతిన్నాయి. జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో పంటలు ఉండగా.. 60 వేల నుంచి 70వేల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్టు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. వరి, పత్తి, పెసర, మినుము, మిర్చి, తోపాటు పలు కూరగాయల తోటలు భారీవర్షాలు, వరదలకు కొట్టుకుపోగా కొన్నిచోట్ల ఇసుకమేటలు వేశాయి. ఆర్‌అండ్‌బీ పీఆర్, జాతీయ రహదారులకు సుమారు రూ.400 కోట్ల దాకా నష్టం వాటిల్లగా.. మున్నేరు వరదతో విద్యుత్‌శాఖకు సుమారు రూ.10 కోట్ల నుంచి 20 కోట్ల నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనా. వేలాదిగా ఇళ్లు కూలినట్టు సమాచారం. ఆ నష్టం రూ.వందల కోటల్లో ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో..

వరుసగా రెండురోజులపాటు వర్షాలతో అతలాకుతలమైన ఉమ్మడి నల్గొండ జిల్లాలో.. 23,194 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. వరుణుడు శాంతించడంతో సోమవారం అక్కడక్కడా జల్లులు కురిశాయి. హుజూర్‌నగర్‌లోని ముత్యాల బ్రాంచ్ కెనాల్ రెండు చోట్లు గండి పడడంతో నీరు పంట పొలాల్లోకి చేరింది. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రం నుంచి కోదాడకు వెళ్లే ప్రధాన రహదారిపై కందిబండ గ్రామంలో వంతెన.. సోమవారం ఉదయం పదింటికి కూలిపోయింది. కానీ అధికారులు ఆదివారం నుంచే వాహనాల రాకపోకలను నిలిపివేయడంతో ప్రాణనష్టం జరగలేదు. ఇక.. రెండు రోజులుగా నీటిలోనే ఉన్న సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణం సోమవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో తేరుకుంటోంది నీటిలోనే బిక్కుబిక్కుమంటూ గడిపిన ప్రజలు తమ ఇళ్లలోకి చేరిన నీరు తగ్గుముఖం పట్టడంతో.. తమ వస్తువులు, వాహనాలు ఎక్కడ ఉన్నాయో వెతుక్కోవడం కనిపించింది.

ఉమ్మడి పాలమూరులో

రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలతో ఉమ్మడి పాలమూరు జిల్లా జనజీవనం స్తంభించిపోయింది. సోమవారం కొంత సమయం తెరిపి ఇచ్చినప్పటికీ మళ్లీ వర్షం పడుతోంది. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 10,072 ఎకరాల్లో వరి, మిరప, పత్తి, కంది పంటలు దెబ్బతిన్నాయి. అవి పూర్తిగా నీట మునిగినందున.. నీళ్లు తగ్గిపోతేనే పంట నష్టంపై కచ్చితమైన అంచనా వేయగలమని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.


డోర్నకల్ మండలం ముల్కలపల్లిలో ఆకేరు వాగు హైలెవల్ వంతెన పిల్లర్లపై కొట్టుకుపోయిన దృశ్యం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో..

జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో 10 సెంటీమీటర్లకు పైగానే వాన కురిసింది. వర్షబీభత్సానికి వాగులు పొంగి పొర్లుతుండగా.. చెరువులు నిండుకుండల్లా మారాయి. జిల్లాలోని 996 చెరువులకుగాను.. 678 చెరువులు పూర్తిగా నిండి అలుగులు పారుతున్నాయి. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ వదలడంతో కొప్పర్గ, హంగర్గ గ్రామాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. గోదావరికి భారీగా వరద వచ్చిన నేపథ్యంలో.. రెంజల్, నవీపేట, నందిపేట, డొంకేశ్వర్, మెండోరా, ఏర్గట్ల మండలాల పరిధిలోని గోదావరి పరివాహక ప్రాంత గ్రామవాసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. వరద బీభత్సం నేపథ్యంలో మరో మూడు రోజులపాటు అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో చాటింపు వేయించారు. వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా ప్రకారం కామారెడ్డి జిల్లావ్యాప్తంగా 2 వేల ఎకరాలలో మొక్కజొన్న, సోయా, పత్తి పంటలు వరద నీటిలో మునిగాయి. కాగా.. మంగళవారం కూడా భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో.. నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

ఆదిలాబాద్ జిల్లాలో

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కుంటాల, పొచ్చెర, కనకాయి, గాయత్రి జలపాతాలు వరద నీటితో పరవళ్లు పెడుతున్నాయి. పెన్‌గంగా బ్యాక్‌వాటర్‌తో భీంపూర్, తాంసి, జైనథ్, బేల మండలాల్లోని పలు గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1849 ఎకరాలలో పంట నష్టం వాటిల్లినట్లు అంచనా. మరో 48గంటల పాటు జిల్లాకు భారీ వర్షసూచన ఉండడంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఇక.. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా బాసర వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది.


ఖమ్మం జిల్లా నాయకన్‌గూడెం వద్ద కొట్టుకుపోయిన ఎక్స్‌కవేటర్


కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ సమీపంలో తెగిపోయిన కల్వర్టు


జగిత్యాల-గోవిందుపల్లి మధ్య ఎక్స్‌కవేటర్ సాయంతో మహిళను వాగు దాటిస్తున్న దృశ్యం


కొట్టుకుపోయిన కామారెడ్డి జిల్లా లింగంపేటలోని నాగారం బ్రిడ్జి

నష్టం అంచనా

₹ 5,438 కోట్లు

అత్యధికంగా రోడ్లుభవనాల శాఖకు నష్టం

రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో రూ.5,438 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. పలు జిల్లాల్లో పంటలు దెబ్బతినగా.. 84 చోట్ల రోడ్లు తెగిపోయాయి. చాలా చోట్ల రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయి. ఈ నష్టంలో సింహభాగం ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని రోడ్లవేనని స్పష్టమవుతోంది. ఈ శాఖకు కలిగిన నష్టం అంచనాను ప్రభుత్వం రూ.2,362 కోట్లుగా లెక్కగట్టింది. మునిసిపల్ శాఖ పరిధిలో దాదాపు రూ.1,150కోట్ల మేర నష్టం వాటిల్లగా.. దాదాపు 4.15లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని, దీని విలువ దాదాపు రూ.415కోట్లుగా ఉంటుందని అంచనావేసింది. సాగునీటి పారుదల శాఖ పరిధిలో దెబ్బతిన్న చెరువుల మరమ్మతులకు రూ.629కోట్ల మేర ఖర్చవుతుందని పేర్కొంది. ఇంకా.. పంచాయతీరాజ్ శాఖకు రూ.170కోట్లు, వైద్య ఆరోగ్య శాఖకు రూ.12కోట్లు, పశుసంవర్థక శాఖకు రూ.25కోట్లు, ప్రజా ఆస్తులకు రూ.500కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు సీఎంవో ఓ ప్రకటనను విడుదల చేసింది. కాగా.. 110 పునరావాస కేంద్రాల్లో 4,000 మందిని తరలించినట్లు ఆ ప్రకటన స్పష్టం చేస్తోంది. 32 జిల్లాల్లో సుమారు 84 చోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. జాతీయ రహదారుల విషయానికి వస్తే.. దెబ్బతిన్న రోడ్ల తాత్కాలిక మరమ్మతులకు రూ.3 కోట్లు, పూర్తిస్థాయి నిర్మాణాలకు రూ.19 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు.


ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం వీర్దండిలో చెరువును తలపిస్తున్న పంట పొలాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో

మూడురోజులుగా కురుస్తున్న వర్షాలు సోమవారం కొంత తెరిపిచ్చినా.. వరద ఇబ్బందుల నుంచి ప్రజలు ఇంకా తెప్పరిల్లలేదు. చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండిపోయాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి భారీ ఎత్తున వరద నీటిని దిగువకు వదలడంతో రాళ్లవాగు పరివాహకంలో బ్యాక్ వాటర్ పెరిగిపోయింది. వరద నీరు సమీపంలోని ఎన్టీఆర్‌నగర్‌లోని 20 ఇళ్లలోకి నీరు చేరింది. గోదావరి నది సమీపంలోగల మాతా శిశు సంరక్షణ కేంద్రం చుట్టూ నీరు చేరడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బాలింతలు, శిశువులను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పలుచోట్ల పిడుగులు పడి విద్యుత్తు సబ్‌స్టేషన్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్‌పీడీసీఎల్)కు వర్షాల కారణంగా 18,65,000 రూపాయల నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. కరీంనగర్ రూరల్ మండలంలో దాదాపు 150 ఎకరాల పంట పొలాలు వరదనీటిలో మునిగిపోయాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వర్షానికి సుమారు 700 ఎకరాల్లో పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు తవ్వకాలు నిలిచిపోగా, ఓబీ మట్టి తొలగింపు పనులకు ఆటంకం ఏర్పడుతోంది. దాదాపు రూ.19.5 కోట్ల విలువైన బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లింది.

రాజధాని నగరాన్ని వదలని వాన...

రాజధాని హైదరాబాద్ నగరాన్ని వణికిస్తున్న వాన మూడో రోజు జల్లులతో సరిపెట్టింది. సోమవారం ఉదయం నుంచి ముసురు, జల్లులు పడటంతో పలు ప్రాంతాల్లో రహదారులు బురదతో నిండిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం ఉదయం 8 నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు 22 గంటల్లో అత్యధికంగా గచ్చిబౌలి ప్రాంతంలో 9.7 సెం.మీ వర్షం కురిసింది. హెచ్‌సీయూలో 8.5, లింగంపల్లిలో 8.5, హైదర్‌నగర్ -8.0, కూకట్‌పల్లి బాలాజీనగర్- 7.5,చందానగర్- 7.3, యూసుఫ్‌గూడ - 6.9, మాదాపూర్‌లో 6.8 సెం.మీ వర్ష పాతం నమోదయ్యింది. ముఖ్యంగా.. ఆదివారం అర్ధరాత్రి తర్వాత పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, లింగంపల్లి, హైదర్‌నగర్, బాలాజీనగర్, కేపీహెచ్‌బీ, చందానగర్, యూసుఫ్‌గూడ, మాదాపూర్, షేక్‌పేట, హఫీజ్‌పేట, బోరబండ ప్రాంతాల్లో రహదారులపై మోకాళ్లలోతు వరదనీరు నిలిచిపోయింది. కాగా.. మరో రెండురోజుల పాటు గ్రేటర్‌లో తేలికపాటి నుంచి ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని బేగంపేట వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

కన్నీరు మున్నేరు

ఊర్లలోకి వరద.. ఇళ్లలో మోకాలిలోతు బురద


వరదలో తడిసిన బియ్యాన్ని చూపుతున్న ఓ మహిళ

ఖమ్మం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుండబోత వర్షం.. ఫలితంగా ముంచెత్తిన వరద హోరు తగ్గాయి! అయితే అవి మిగిల్చిన విధ్వంసం.. ఇళ్లలో నిత్యావసరాలు సహా అన్నీ కోల్పోయి కట్టుబట్టలతో రోడ్డున పడిన బడుగు జీవుల్లో నిండిన విషాదం ఎప్పుడు పోతుందనేది మాత్రం తెలియదు! ఖమ్మం జిల్లాలో మున్నేరు వాగు ఉప్పొంగి.. జిల్లా కేంద్రం సహా రఘునాథపాలెం, తిరుమలాయపాలెం, కూసుమంచి, చింతకాని, ముదిగొండ, మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేసింది. ఎక్కడ చూసినా మోకాలిలోతు బురదే! ఇళ్లలోనూ బురదే!మాయదారి వరద దెబ్బకు సైకిళ్లు, బైక్‌లతో పాటు టీవీలు, ఫ్రిజ్‌ల వంటి గృహోపకరణాలు పనికిరాకుండా పోయాయి. ఏడాది గాసం కోసం నిల్వ ఉంచుకున్న బియ్యం, పప్పులు అన్నీ వరద పాలవ్వడంతో ఏం తిని బతికేది? అన్న ఆందోళన బాధితుల నుంచి వ్యక్తమవుతోంది. శనివారం రాత్రి మున్నేరు ఉప్పెనతో ఇళ్లలోకి నీళ్లు రావడంతో ప్రాణాలు కాపాడుకునేందుకు కట్టుబట్టలతో పిల్లాపాపలతో కలిసి పునరావాస కేంద్రాలకు పరుగులు తీసిన ప్రజలు అక్కడ బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కాగా మహోగ్రరూపం దాల్చిన మున్నేరు తగ్గుముఖం పట్టింది. ఆదివారం మధ్యాహ్నం 36 అడుగులకు చేరుకున్న మున్నేరు రాత్రినుంచి తగ్గుముఖం పట్టి సోమవారం ఉదయం 19.5 అడుగులకు చేరుకుంది. మున్నేరు వరదలు, భారీ వర్షాల నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో 39 పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి 7,090 మందిని తరలించారు. సోమవారం ఉదయానికి వరద తగ్గడంతో దాదాపు సగం మంది ఇళ్లకు చేరుకున్నారు. కంపు కొడుతున్న పరిసరాల మధ్య ఇళ్లలో పేరుకుపోయిన బురదను శుభ్రం చేసుకుంటున్నారు. ఖమ్మంలోని బొక్కలగడ్డ, మోతినగర్, కవిరాజ్‌నగర్, మమతారోడ్డు, ఖానాపురం, వెంకటేశ్వరనగర్, ధంసలాపురం, దానవాయిగూడెం, రూరల్ మండలంలోని కరుణగిరి, జలగంనగర్ పలు లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లు జలమయం కావడంతో బురద మేటలు వేసింది. ఖమ్మం రూరల్ మండలంలో మున్నేరు వరద కారణంగా విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో పునరుద్ధరణకు, తాగునీరు అందించేందుకూ చర్యలు చేపట్టారు. మున్నేరు వరద, వర్షంనీరు కారణంగా ఖమ్మం పట్టణంలో పంపింగ్‌వెల్స్ పనిచేయకపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. కొన్ని కాలనీల్లో విద్యుత్తు సరఫరా లేక మోటార్లు పనిచేయడం లేదు.


ఖమ్మం నగరం మున్నేరు పరీవాహకంలోని ఓ కాలనీలో వరద బీభత్సం

చూస్తుండగానే మా ఇల్లు మునిగింది

ఇలాంటి వరద ఎప్పుడూ చూడలేదు. ఒక్కసారిగా వరద వచ్చ పడింది. ఇళ్లు, సామగ్రి వదిలేసి భార్యాపిల్లలతో బయటకొచ్చాం. చూస్తుండగానే ఇల్లు మునిగింది. ఇప్పుడు పునరవాస కేంద్రంలో ఉంటున్నాం.. ఇక్కడ భోజనం, వసతి బాగానే ఉంది. ఇంటికి వెళితే మళ్లీ ఎలా బతకాలో అర్థం కావడంలేదు. వరదతో ఉన్నదంతా కోల్పోయాం. ఇంట్లో ఉన్న బియ్యం, పప్పులూ బురదపాలయ్యాయి.

- యడ్లపల్లి నాంచారయ్య

జ్వరంతోనే పరుగు తీశా

ఆ రోజు రాత్రి జ్వరంతో ఇంట్లో పడుకున్నా. వరద పోటెత్తుతోందని చెప్పడంతో తెల్లవారుజామున నేను, నా భర్త, పిల్లలం కలిసి పునరావాస కేంద్రానికి పరుగు తీశాం. ఇంట్లోని బియ్యం, దుస్తులు, నిత్యావసర వస్తువులు అన్నీ కోల్పోయాం. ఇంట్లో మోకాలి లోతు బురద ఉంది. మేము హోటల్‌లో పనిచేసి పొట్ట పోసుకుంటాం. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

- దగ్గు సుమలత, వెంకటేశ్వరనగర్

పాలేరులో మట్టిలో కూరుకుపోయిన కారు





వరద బాధితురాలిని ఓదార్చుతున్న మంత్రి తుమ్మల

మున్నేరుకు వందేళ్లలో రానంత వరద

గంటల్లో 45 సెం.మీవర్షపాతం

కారణంగానే: మంత్రి తుమ్మల

ఖమ్మం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మున్నేరు వాగుకు వందేళ్లలో ఎన్నడూ చూడనంత వరద వచ్చిందని, కొద్ది గంటల్లోనే 45 సెంటీమీటర్ల వర్షం కురవడమే దీనికి కారణమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని వరద ముంపు కాలనీలు, పునరావాస కేంద్రాలను ఆయన పరిశీలించి బాధితులను పరామర్శించారు. మున్నేరు వరదతో వేలాదిమంది నిరాశ్రయులయ్యారని.. పేర్కొన్నారు. టెస్కో నుంచి దుప్పట్లు, చీరలు, ధోతీలు, దుస్తులు పంపిణీ చేస్తామన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి భోజనం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బాధితులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

కూలిన ఇళ్ల స్థానంలో ఇందిరమ్మ ఇల్లు: మంత్రి సీతక్క

మహబూబాబాద్, కేసముద్రం, హైదరాబాద్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లాలో వరద ముంపు ప్రాంతాల్లో సోమవారం మంత్రి సీతక్క అధికారులతో కలిసి పర్యటించారు. దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జిలను పరిశీలించారు. వర్షాలతో కూలిన ఇళ్ల స్థానంలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. కాగా, జిల్లాలో మూడు చోట్ల జాతీయ రహదారులు కోతకు గురయ్యాయి. ప్రధానంగా మహబూబాబాద్-మరిపెడ మార్గంలోని పురుషోత్తమయగూడెం హైలెవల్ వంతెనకు మానుకోట వైపు జాతీయ రహదారి 365 ఒక కిలోమీటర్ అప్రొచ్ రోడ్డు కిలోమీటర్ మేర కొట్టుకుపోయి సుమారు రూ.10 కోట్ల మేర నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు.



మంత్రి పొంగులేటి కాలుకు కట్టుకడుతున్న వైద్యుడు

మంత్రి పొంగులేటి కాలుకు గాయం

కూసుమంచి, సెప్టెంబరు 2: ఖమ్మం మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో బైక్‌పై పర్యటన సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాలుకు గాయమైంది. మున్నేరు వరదతో ఖమ్మం రూరల్ మండలంలో దెబ్బతిన్న రాజీవ్‌గృహకల్ప ఇళ్లను పరిశీలించేందుకు మంత్రి పొంగులేటి బైక్‌పై ఆ ప్రాంతంలో పర్యటించారు. మంత్రి బైక్‌పై వెనుక కూర్చోగా బురదవల్ల ఫుట్‌రెస్ట్‌పై ఉన్న ఎడమ కాలు జారిపోయింది. దీంతో ఆ కాలు బైక్ ఫుట్‌రెస్ట్‌కు తగిలి తీవ్రగాయమైంది. దీంతో ఆయన కూసుమంచి క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ వైద్యుడు మంత్రి కాలుకు చికిత్స చేసి కట్టుకట్టారు. తర్వాత ఆయన వరదతో నష్టపోయిన పంటపొలాలను పరిశీలించారు.



కొణిజర్ల కేజీబీవీ గోడల నుంచి విద్యుత్ షాక్

కొణిజర్ల, సెప్టెంబరు 2 : ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలోని బస్వాపురంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) గోడలకు విద్యుత్ ప్రసరణ కావడంతో విద్యార్థినులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అయితే ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం వాటిల్లలేదు. సోమవారం ఉదయం పాఠశాలలోని రెండు గదుల్లో గోడల నుంచి విద్యుత్ షాక్ వస్తుండటంతో బాలికలు ఆందోళనకు గురై తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు వచ్చి తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు. ఈ పాఠశాలలో 299 మంది బాలికలు చదువుతున్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మండల విద్యాశాఖాధికారి మోదుగు శ్యాంసన్ సందర్శించారు. గదులు తడవటం వల్ల ఎర్తింగ్ సమస్యతో విద్యుత్ వస్తోందని, బాలికలు ఆందోళనతో ఇంటికి వెళ్లారని తెలిపారు.

విల్లాలు విలవిల!

మోకిలాలో 'లా పోలామా'లో మోకాలి లోతు నీళ్లు

మొత్తంగా 212 విల్లాలు.. వరదతో దారులు బంద్

2 మోటార్లతో నీరు తొలగింపు.. ప్రహరీ కూడా బద్దలు

నాలాకు అడ్డుగా నిర్మించడంతోనే ఈ సమస్య!

చేవెళ్ల, సెప్టెంబరు 2: నగరంలో కాలుష్య కోరలు.. చెవులు బద్దలయ్యే ట్రాఫిక్ చప్పుళ్ల నుంచి దూరంగా పచ్చని ప్రకృతి మధ్య ఇల్లు ఉంటే ప్రశాంతంగా ఉండొచ్చనే ఆశతో కోట్లు వెచ్చించి విల్లాలు కొన్న వారికి ఇప్పుడా ప్రశాంతతే కరువైంది! రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిలా గ్రామ పరిధిలోని అత్యంత విలాసవంతమైన 'లా పొలామా' కమ్యూనిటీలోకి వరద ముంచెత్తింది. ఇక్కడ 212 విల్లాలున్నాయి. మొత్తంగా వెయ్యిమంది దాకా ఉంటున్నారు. ఇక్కడ రూ.3 కోట్ల నుంచి గరిష్ఠంగా రూ.6 కోట్ల దాకా వెచ్చించి విల్లాలు కొనుక్కున్నారు. పచ్చని చెట్లు.. పక్షుల కిలకిలరావాలతో హాయి గొలిపే ఆ కమ్యూనిటీలో భారీ వర్షాల కారణంగా మోకాలి లోతు వరద నిలిచింది. లోపల రోడ్లన్నీ మునిగిపోయి చెరువును తలపించాయి. కమ్యూనిటీలోకి వెళ్లే దారులన్నీ బంద్ అయ్యాయి. లోపల 12 విల్లాల్లోకైతే ఇళ్లలోకి కూడా నీళ్లొచ్చాయి. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సోమవారం 'లా పొలామా'కొచ్చారు. ప్రత్యేకంగా రెండు మోటార్లను ఏర్పాటు చేయించడంతో నీటిని సిబ్బంది బయటకు పంపారు. వరద తొలగింపునకు 'లా పొలామా' ప్రహరీని యంత్రాలతో కొంతమేర పగులగొట్టడం గమనార్హం. కాగా నాలా ప్రవాహానికి అడ్డంగా ఈ విల్లాలను నిర్మించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. భారీ వర్షం పడినప్పుడల్లా కొండకల్, కొండకల్ తండా గ్రామాల వైపు ఉన్న నాలాలోకి వెళ్లాల్సిన ప్రవాహం నిలిచిపోయి.. ఆ వరద నీరంతా కమ్యూనిటీలోకి పొంగుతోందని.. ఈసారి వర్షం ఎక్కువగా పడటంతో సమస్య ఎక్కువైందని స్థానికులు చెబుతున్నారు.



చెరువును తలపిస్తున్న విల్లాలు

ఎకరాకు రూ.10 వేలు

(మొదటిపేజీ తరువాయి)

వస్తోందని అన్నారు. ప్రస్తుతం అధికార యంత్రాంగమంతా సహాయక చర్యల్లో నిమగ్నమయిందని, వర్షం తెరిపి ఇవ్వగానే పూర్తి స్థాయి నష్టం అంచనాలు వేస్తామని చెప్పారు. వరదల్లో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. చనిపోయిన వారి కుటుంబాలకు ఇచ్చే పరిహారం రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. దీంతోపాటు పాడి పశువుల పరిహారం రూ.30 వేల నుంచి రూ.50 వేలకు, మేకలు, గొర్రెల పరిహారం రూ.5 వేలకు పెంచి ఇస్తామన్నారు. ఇళ్లు కూలిపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. వర్షాలు, వరదల నేపథ్యంలో ముఖ్యమంత్రి సోమవారం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి.. బాధితులతో మాట్లాడారు. వారిని ఓదార్చారు.

కంటిపై కునుకు లేకుండా...

తొలుత హైదరాబాద్‌లోనిపోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్నతాధికారులతో సమీక్షించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ తరువాత వరద బాధిత ప్రాంతాలకు బయలుదేరి వెళ్లారు. తొలుత సూర్యాపేట జిల్లాలో నష్టాన్ని పరిశీలించి.. మోతెలో అధికారులతో సమీక్షించారు. అనంతరం ఖమ్మం జిల్లాకు చేరుకొని.. నాయకన్‌గూడెం వద్ద పాలేరు కాలువ పొంగి రహదారి తెగిపోవడం, పాలేరు ఎడమ కాలువకు గండి పడడంతో వాటిని పరిశీలించారు. అక్కడి నుంచి ఖమ్మం చేరుకుని, మున్నేరు వరదతో మునిగి తీవ్రంగా నష్టపోయిన పోలేపల్లి, పెద్ద తండా, బొక్కలగడ్డ కాలనీలను పరిశీలించారు. దెబ్బతిన్న ఇళ్లలోకి వెళ్లి, బాధితులను ఓదార్చారు. అనంతరం ఖమ్మం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఆయా సందర్భాల్లో సీఎం మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం వర్షాలు ప్రారంభమైన దగ్గర్నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, డిజాస్టర్ రెస్పాన్స్ కమిషనర్, కలెక్టర్లతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నానని, కంటిపై కునుకు లేకుండా పర్యవేక్షణ చేస్తున్నానని తెలిపారు. ప్రభుత్వం అండగా ఉందనే విశ్వాసం బాధితులకు కల్పించేందుకు స్వయంగా వచ్చానన్నారు. మంత్రులు, అధికారులు అద్భుతంగా పని చేస్తున్నారని కితాబునిచ్చారు. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ ఫాంహౌస్‌లో విశ్రాంతి తీసుకుంటూ మౌనముద్రలో ఉన్నారని విమర్శించారు. స్నేహితులతో కలిసి అమెరికాలో ఎంజాయ్ చేస్తున్న కేటీఆర్.. క్షేత్రస్థాయిలో ఉన్న తమ మంత్రులపై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి..

రాష్ట్రంలో సంభవించిన విపత్తును కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని, రూ.5వేల కోట్లు మంజూరు చేయాలని సీఎం రేవంత్ కోరారు. తక్షణ సాయంగా రూ.2 వేల కోట్లు విడుదల చేసేలా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ చొరవ తీసుకోవాలన్నారు. ప్రధాని మోదీ రాష్ట్రంలో పర్యటించి నష్టాన్ని చూడాలన్నారు. రాష్ట్రంలో వరద కష్టాలకు చలించి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కొంత సహాయం ప్రకటించారని, కల్వకుంట్ల కుటుంబం మాత్రం రూ.లక్షల కోట్లు సంపాదించి కూడా చిల్లిగవ్వ సహాయం చేయరని విమర్శించారు. వరదలతో అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్, మునిసిపల్ అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టాలని, వైద్యారోగ్య శాఖాధికారులు మందులు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. పని చేయని ఉద్యోగులపై కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని, తాము ఆ విధులు నిర్వహిస్తున్నామని, వ్యాపార, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు కూడా ముందుకు వచ్చి బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బాధిత జిల్లాలకు రూ. 5 కోట్ల తక్షణ సాయం..

భారీ వర్షాలకు నష్టపోయిన బాధిత జిల్లాలకు రూ. 5 కోట్ల చొప్పున తక్షణ సహాయాన్ని విడుదల చేస్తున్నట్లు సీఎం రేవంత్ చెప్పారు. సోమవారం ఉదయం ఆయన హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్‌కు వెళ్లి ఉన్నతాధికారులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. వివిధ జిల్లాల్లో జరిగిన విధ్వంసాన్ని వీడియో ఫుటేజీ ద్వారా వీక్షించారు. కాగా, మంగళవారం ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు చెప్పగా.. ఆయా జిల్లాల్లో కలెక్టర్లు, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు.



సూర్యాపేట జిల్లాలో వరద నష్టానికి సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, వివరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



నాగర్‌కర్నూల్, ఎండబెట్ల దారిలో మినీట్యాంక్ బండ్‌పై పారుతున్న అలుగుతో నిలిచిపోయిన రాకపోకలు

వర్షంలో తడుస్తూనే సీఎం పర్యటన

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరద ప్రాంతాల్లో జోరువానలో పర్యటించి వరద బాధితులకు భరోసా ఇచ్చారు. సూర్యాపేట జిల్లాలో పర్యటించి సమీక్ష నిర్వహించిన అనంతరం పాలేరు చేరుకుని అక్కడ వరద కారణంగా పాలేరు-నాగార్జునసాగర్ కాలవకు గండిపడిన ప్రాంతాన్ని పరిశీలించారు. సాయంత్రం వర్షంలోనే ఖమ్మంరూరల్ మండలం కరుణగిరిలో వరద ప్రాంతాన్ని సందర్శించారు. మున్నేరు నది ఉధృతి, బీభత్సాన్ని స్వయంగా పరిశీలించారు. ఓపెన్‌టాప్ జీపులో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి రాజీవ్‌గృహకల్ప కాలనీకి వెళ్లారు. అక్కడ ఒక ఇంటిలోకి వెళ్లి మహిళతో మాట్లాడి జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు. అక్కడినుంచి ఖమ్మం చేరుకున్నారు. మంత్రి తుమ్మలతో కలిసి ఖమ్మంలోని బొక్కలగడ్డ ప్రాంతానికి వెళ్లి వరద బాధితులను కలిశారు. అనంతరం వర్షంలోనే ఓపెన్‌టాప్ జీపుపై ఖమ్మం నగరంలో నష్టాన్ని పరిశీలిస్తూ కలెక్టరేట్‌కు చేరుకుని వరద నష్టంపై సమీక్ష నిర్వహించారు. ఖమ్మంలో మున్నేరుకు రెండువైపులా రిటైనింగ్ వాల్స్ నిర్మించి ఖమ్మం పట్టణంతోపాటు, ఖమ్మం రూరల్ మండలానికి వరద బెడద లేకుండా శాశ్వత చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.650 కోట్లతో టెండర్లు పూర్తిచేయించి పనులు ప్రారంభించామని గుర్తు చేశారు. సోమవారం రాత్రి ఖమ్మం నగరంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసంలో సీఎం రేవంత్ బస చేశారు. కాగా, భారీ వర్షాలతో అతలాకుతలమైన మహబూబాబాద్ జిల్లాకు సీఎం మంగళవారం వెళ్లనున్నారు. ఈ మేరకు జిల్లా అధికార యంత్రాంగానికి సమాచారం రావడంతో మరిపెడ, నెల్లికుదురు మండలాల్లో సీఎం సందర్శించే ప్రాంతాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు.

జీహెచ్ఎంసీ పరిధిలో జాగ్రత్త !

హైదరాబాద్‌లో ఎక్కడా చిన్న అవాంఛనీయ సంఘటన జరగకుండా చూసుకోవాలని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష సందర్భంగా సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. విద్యుత్తు, ట్రాఫిక్, తాగునీరు, శానిటేషన్ విషయాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సహాయ శిబిరాలకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. నిత్యం రెక్కాడితే గాని డొక్కాడని కూలీలకు ఈ సమయంలో పనులు దొరకవని, వారికి రేషన్ అందజేయాలని అన్నారు.

కొట్టుకుపోయినా.. బతికొచ్చాడు!

కొండూర్ వాగులో కొట్టుకుపోయిన యువకుడు

ఈదుకుని రావడంతో ఊపిరిపీల్చుకున్న గ్రామస్థులు

నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం కొండూర్ వద్ద గల ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును బైక్‌పై దాటేందుకు ప్రయత్నించిన నారాయణ అనే యువకుడు వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. కొంతమంది యువకులు అతణ్ని కాపాడ్డానికి ప్రయత్నించినా దొరకలేదు. దీంతో అతడు చనిపోయి ఉంటాడని అంతా భావించారు. కానీ.. అతడు ఒక 10 నిమిషాల తర్వాత ఈత కొట్టుకుంటూ సిరికొండ వైపు ఒడ్డుకు చేరుకున్నాడు. దీంతో అప్పటివరకు టెన్షన్‌తో ఉన్న జనంతో పాటు అధికారులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. అలాగే.. నిజామాబాద్ జిల్లా ఎస్సారెస్పీ గేట్లు తెరవడంతో.. ముగ్గురు సాధువులు ఏర్గట్ల మండలంలోని తడపాకల్- సావెల్ గ్రామాల మధ్యలో గల సాంబయ్య ఆశ్రమంలో చిక్కుకుపోయారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు.. వారిని క్షేమంగా బయటకి తీసుకొచ్చాయి.

15 జిల్లాలకు రెడ్ అలర్ట్

నేడు ఆయా ప్రాంతాల్లో భారీ వర్షాలు..?

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరుసగా రెండో రోజు కూడా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 173 మండలాల్లో భారీ వర్షాలు కురిశాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మూడు మండలాల్లో 20 సెం.మీ.కు పైగా వర్షం కురవగా.. 35 మండలాల్లో 11-20 సెం.మీ., 135 మండలాల్లో 6-11 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. తెలంగాణలో మంగళవారం కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, యాదాద్రి భువనగిరి, ములుగు, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఇక బుధవారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని స్పష్టం చేసింది. మరోవైపు 5 నాటికి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే సూచనలున్నాయని వాతావరణ విభాగం పేర్కొంది.

సోమవారం నమోదైన అత్యధిక వర్షపాతం

జిల్లా	మండలం	వర్షపాతం
కామారెడ్డి	సదాశివనగర్	24 సెం.మీ
కామారెడ్డి	తాడ్వాయి	20 సెం.మీ
కామారెడ్డి	రామారెడ్డి	20 సెం.మీ
కామారెడ్డి	లింగంపేట	20 సెం.మీ
కామారెడ్డి	కామారెడ్డి	20 సెం.మీ
ఆసిఫాబాద్	జైనూర్	17 సెం.మీ

481 రైళ్లు రద్దు

మరో 152 శకటాల దారి మళ్లింపు..

- ప్రత్యేక రైలులో మానుకోటకు 8 ఎక్స్‌కవేటర్లు
- కేసముద్రం-ఇంటికన్నె, మానుకోట-తాళ్లపూసపల్లి
- సెక్షన్ల మధ్య కొట్టుకుపోయిన ట్రాక్‌కు రిపేర్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదలతో పలు ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌లు దెబ్బతినడంతో 481 రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. 13 రైళ్లను పాక్షికంగా రద్దు చేయగా.. 152 రైళ్లను దారి మళ్లించారు. దీంతో దేశంలోని పలు రాష్ట్రాలకు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. మహబూబాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్ మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. శనివారం రాత్రి కురిసిన వర్షానికి కేసముద్రం-ఇంటికన్నె స్టేషన్ల మధ్య 30 మీటర్ల మేర.. మహబూబాబాద్-తాళ్లపూసపల్లి స్టేషన్ల మధ్య 20 మీటర్ల మేర ట్రాక్ కొట్టుకుపోయి పట్టాలు గాలిలో వేలాడాయి. ప్రత్యేక రైలు ద్వారా 8 ఎక్స్‌కవేటర్లను తెప్పించిన అధికారులు.. ఆదివారం నుంచి పగలు, రాత్రి తేడా లేకుండా పట్టాల కింద మట్టిని నింపుతున్నారు. ఆయా ప్రాంతాల్లో ట్రాక్ పునరుద్ధరణ పనులను సోమవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ పరిశీలించారు. వర్షం తెరిపిస్తే మంగళవారం సాయంత్రానికి డబుల్ లైన్లలో ఒకదాన్ని పునరుద్ధరించి రాకపోకలను ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. కాగా, దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో ఐదు రైళ్లు జలదిగ్బంధంలో చిక్కుకుపోవడం ఇదే తొలిసారి అని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఆదివారం ట్రాక్ కొట్టుకుపోయి విజయవాడ-కేసముద్రం సెక్షన్‌లో నిలిచిపోయిన 15 రైళ్లను ఖమ్మం సమీపంలోని మోటుమర్రి స్టేషన్ నుంచి విష్ణుపురం మీదుగా ఇతర మార్గాల్లోకి మళ్లించారు. కేసముద్రం రైల్వే స్టేషన్‌లో జల దిగ్బంధంలో చిక్కుకుపోయిన బెంగళూరు-దానాపూర్, దానాపూర్-బెంగళూరు సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌లలోని ప్రయాణికులను ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లతో బయటకు తెచ్చారు. బస్సుల్లో వారిని కాజీపేట, విజయవాడకు తరలించారు. అక్కడి నుంచి ప్రత్యేక రైళ్ల ద్వారా వారిని దానాపూర్, బెంగళూరుకు పంపించారు. ఏపీ, తెలంగాణలో ట్రాక్‌లు దెబ్బతిన్న ప్రాంతాల్లో నిలిచిపోయిన రైళ్లలోని ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడానికి రైల్వే 158 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక రైళ్లు, బస్సుల్లో సుమారు పది వేల మందికి పైగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చినట్టు వెల్లడించారు. దక్షిణ మధ్య రైల్వే నిర్వహిస్తున్న నాలుగు వందే భారత్ రైళ్లలో రెండింటిని రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం మార్గంలో రెండు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లను పూర్తిగా రద్దు చేయగా, సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్‌ను 5గంటలు ఆలస్యంగా రీ షెడ్యూలు చేశారు.



ఇంటికన్నె సమీపంలో రైల్వే ట్రాక్ వేలాడుతున్న ప్రాంతంలో మరమ్మతు పనులు చేస్తున్న యంత్రాలు

హైదరాబాద్-విజయవాడ

రాకపోకలు షురూ

నల్లగొండ, కోదాడ, హైదరాబాద్, కోహెడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ రూట్లో రాకపోకలు మొదలయ్యాయి! అయితే ఈ రహదారిలో ఇబ్బందులు పూర్తిగా తొలగిపోలేదు. నల్లగొండ జిల్లా కోదాడ వద్ద పాలేరు వంతెన వద్ద వరద తీవ్రత ఎక్కువగా ఉండటంతో నార్కట్‌పల్లి నుంచి నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి మీదుగా మళ్లించారు. వాహనాలు పెరగడంతో రద్దీ కొనసాగింది. నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, దామరచర్ల మీదుగా వాహనాలు విజయవాడకు వెళుతున్నాయి. హైదరాబాద్ లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మూసీ నదికి వరద తగ్గింది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని సంగెం, రుద్రవెల్లి బ్రిడ్జిల నుంచి రాకపోకలకు అనుమతిచ్చారు. జాతీయ రహదారి 65పై పాలేరు బ్యాక్‌వాటర్ రావడంతో రెండు రోజులుగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం వరద నీరు తగ్గడంతో తిరిగి రాకపోకలు కొనసాగాయి. విజయవాడ-హైదరాబాద్ రూట్లో ఏపీ పరిధిలోని గరికపాడు వద్ద పాత వంతెన కుంగిపోవడంతో కొత్తవంతెన నుంచి రాకపోకలకు అనుమతించారు. గరికపాడు వద్ద కుంగిన పాత వంతెనను, నడిగూడెం మండలం కాగిత రాంచంద్రాపురం వద్ద సాగర్ ఎడమకాల్వకు ఏర్పడిన గండి పడిన ప్రదేశాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. కోదాడ పాలేరు వంతెన పొంగిపొర్లుతుండటంతో సూర్యాపేట జిల్లా సరిహద్దులోని దుర్గాపురం నుంచి రామాపురం క్రాస్ రోడ్డు వరకు దాదాపు 2కి.మీ మేర వాహనాలు నిలిచిపోయాయి. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఖమ్మం-విజయవాడ రూట్లో వరద తగ్గకపోవడంతో రాకపోకలు కొనసాగడం లేదు. ఈ రూట్లో సోమవారం 590 ఆర్టీసీ బస్సులు రద్దయ్యాయి. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వునుంచి కోదాడకు వెళ్లే రహదారిపై కందిబండ గ్రామంలో వంతెన కూలిపోయింది. ప్రమాద సమయంలో వాహనాలు లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

3 రోజులుగా వాగులో బిక్కుబిక్కుమంటూ..

8మంది చెంచుల అవస్థ.. బాధితుల్లో ముగ్గురు పిల్లలు

పనులకు వెళితే దుందుభి వాగు ఉధృతికి నీళ్లు

అచ్చంపేట మండలం సిద్దాపూర్ సమీపంలో ఘటన

ఆ వైపు వచ్చిన రైతులను చూసి బిగ్గరగా కేకలు

డ్రోన్లద్వారా ఆహారం అందించే ప్రయత్నాలు

అచ్చంపేట టౌన్, సెప్టెంబరు 2: నలువైపులా వాగు ఉధృతితో ఎటూ వెళ్లలేక.. ఓ పెద్ద గెట్టుపై ఎనిమిది మంది చిక్కుకుపోయారు! శనివారం వారు వాగులో వారు చిక్కుకుపోతే ఈ విషయం బయట ప్రపంచానికి సోమవారం తెలిసింది! దుందుభి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నాగర్‌కర్నూలు జిల్లా సిద్దాపూర్ సమీపంలోని కత్వలో ఆ బాధితులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వరదలో చిక్కుపోయిన వారిలో ముగ్గురు పిల్లలు, ఓ మహిళ ఉన్నారు! బాధితులంతా నల్లగొండ జిల్లా డిండి మండలం గోనబోయిపల్లి గ్రామానికి చెందిన చెంచులు! వీరంతా శనివారం వ్యవసాయ పనుల్లో ఉండగా శనివారం భారీవర్షం కురిసింది. వాగులు పొంగిపొర్లడంతో గ్రామానికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సొంతూరువైపు కాకుండా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట మండలం బొమ్మన్‌పల్లి గ్రామం మీదుగా వెళ్లేందుకు ప్రయత్నించారు. మార్గమధ్యలో దుందుభి వాగు ఉధృతికి సిద్దాపూర్ సమీపంలోని కత్వ వద్ద బండరాళ్లపై ఉండిపోయారు. సోమవారం సాయంత్రం సిద్దాపూర్ గ్రామానికి చెందిన రైతులు వ్యవసాయ పొలాలకు వెళ్లడంతో బాధితులు వారిని చూసి బిగ్గరగా కేకలు వేశారు. ఆ రైతులు విషయాన్ని సిద్దాపూర్ పోలీసులకు చేరవేశారు. అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్ తమ సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటం.. రాత్రి కావడంతో బాధితులను కాపాడే పరిస్థితి కనబడలేదు. అయితే బాధితులకు డ్రోన్ల సాయంతో ఆహారం అందించే ఏర్పాట్లు చేస్తున్నారు.



బాధితులను కాపాడేందుకు ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు



ఎక్స్‌కవేటర్‌పై నుంచి బాధితులను పరామర్శిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

ఏపీ సీఎంవో అంతా కలెక్టరేట్‌లోనే

» బెజవాడ కలెక్టరేట్‌లో చంద్రబాబు

» వరద ప్రాంతాల్లో తిరుగుతూ, విరామంలో కలెక్టరేట్‌లో సమీక్షలు

అమరావతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరద సహాయచర్యలను వరుసగా రెండోరోజూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ముమ్మరం చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌ను తన కార్యాలయంగా మార్చుకున్నారు. యావత్ సీఎం కార్యాలయం కలెక్టరేట్ లోనే తిష్టవేసింది. రోజంతా వరద ప్రాంతాల్లో పర్యటిస్తూ, బాధితులను ప్రత్యక్షంగా కలుసుకుని ధైర్యం చెప్పడం, మధ్యలో విరామంలో కలెక్టరేట్‌కు చేరుకొని సమీక్షలు నిర్వహించడం.. ఇలా అలుపెరగకుండా చంద్రబాబు పనిచేస్తున్నారు. ముఖ్యమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తుండటంతో ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు వరద సహాయక చర్యల్లో అప్రమత్తంగా ఉంటున్నారు. మంత్రులందరూ విజయవాడ కలెక్టరేట్‌కు వచ్చి ఎవరికి తోచిన రీతిలో వారు వరద బాధితులకు సాయం చేయడంలో నిమగ్నమయ్యారు. ఆదివారం కేంద్రంతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడిన తర్వాత, వివిధ రాష్ట్రాల నుంచి పవర్ బోట్లు విజయవాడకు చేరుకున్నాయి. ఆ పడవల ద్వారా విజయవాడలోని అజిత్‌సింగ్‌నగర్ ముంపు ప్రాంతంలో ఆహారం పంపిణీ చేశారు.

రెండు గంటలు మాత్రమే పడుకున్న బాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం రాత్రి కేవలం రెండు గంటలు పడుకొన్నారు. సోమవారం తెల్లవారుజాము వరకూ ఆయన విజయవాడ నగరం, చుట్టుపక్కల వరద ప్రాంతాల్లో పర్యటించారు. విజయవాడ నగరంలో కొంత భాగం బుడమేరు వరద ముంపునకు తీవ్రంగా ప్రభావితమైన బాధితులకు సహాయం అందడం లేదన్న ఫిర్యాదులు బాగా వస్తుండటంతో ఆదివారం అంతా ఆయన దానిపైనే దృష్టి పెట్టారు. తాను చెప్పినట్లుగా బాధితులకు ఆహారం అందుతున్నదీ లేనిదీ క్షేత్ర స్థాయిలో పరిశీలించే నిమిత్తం ఆదివారం రాత్రి పదకొండు గంటలకు ఆయన ముంపు ప్రాంతాలకు బయలుదేరి వెళ్లారు. సోమవారం తెల్లవారుజామ 4 గంటలకు చంద్రబాబు విజయవాడ కలెక్టరేట్‌కు చేరుకొన్నారు. సరిగ్గా రెండు గంటలు మాత్రం విశ్రాంతి తీసుకొన్న తర్వాత సోమవారం ఉదయం 6 గంటలకు ఆయన లేచి తయారై కలెక్టరేట్‌లో సమీక్షలు ప్రారంభించారు.



అర్ధరాత్రి బోట్‌లో వెళ్తూ సహాయక చర్యల్ని పర్యవేక్షిస్తున్న చంద్రబాబు

ఏపీలో 19 మంది మృతి

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 19 మంది మృతి చెందారు. ఎన్టీఆర్ జిల్లాలో 9 మంది మృత్యువాత పడగా మరో ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. ఈ మేరకు ఆయా వివరాలను విపత్తుల నిర్వహణ శాఖ వెల్లడించింది. కాగా, ప్రభుత్వం చేపట్టిన ముందస్తు చర్యల కారణంగా భారీ ప్రాణ నష్టం తప్పినట్టు పేర్కొంది. కాగా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, వరదల కారణంగా 4,31,355 ఎకరాల్లో వ్యవసాయ పంటలు, 37,397 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని అధికారులు అంచనా వేశారు.

ప్రకాశం బ్యారేజీ 'కౌంటర్' కట్

» వరద ఉధృతికి కొట్టుకు వచ్చిన బోట్లు

» గేట్లకు సపోర్టుగా ఉండే వెయిట్లతో ఢీ

» 64, 69 నంబర్ గేట్ల వద్ద దెబ్బతిన్న దిమ్మెలు

విజయవాడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదికి ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతికి కొట్టుకొచ్చిన ఇనుప బోట్ల కారణంగా ప్రకాశం బ్యారేజీ గేట్లకు అనుబంధంగా ఉండే కౌంటర్ వెయింట్లు దెబ్బతిన్నాయి. 64వ నంబరు గేటు వద్ద ఉండే వెయిట్ స్వల్పంగా దెబ్బతినగా.. 69వ గేటు వద్ద ఉండేది పూర్తిగా మధ్యకు విరిగిపోయింది. కాంక్రీట్ సిమెంట్ దిమ్మకు లోపల ఉండే ఇనుప చువ్వలు బయటకు వచ్చేశాయి. కృష్ణా నదికి సోమవారం రికార్డు స్థాయిలో వరద వచ్చింది. ఎగువన భవానీపురం, గొల్లపూడి, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లి బోట్లకు లంగరేశారు. వరద ఉధృతికి వీటిలో 4 బోట్లు కొట్టుకొచ్చాయి. ఇందులో ఒక బోటు 69వ గేటు వద్ద ఉన్న కౌంటర్ వెయిట్‌ను ఢీ కొట్టడంతో విరిగిపోయి ఇరుక్కుపోయింది. మరో బోటు 64వ నంబరు ఖానా వద్ద ఉన్న కౌంటర్ వెయిట్‌ను ఢీ కొట్టడంతో స్వల్పంగా దెబ్బతింది. దెబ్బతిన్న కౌంటర్ వెయిట్లను గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడిని ప్రభుత్వం పిలిపించింది. ఆయన వచ్చి పరిశీలించారు. ఎలాంటి నష్టం జరగలేదని నిర్ధారించారు. వెయిట్‌ను మార్చేసి కొత్తది ఏర్పాటు చేస్తామన్నారు.

ముంపులోనే 2 లక్షలమంది!

ఏపీలో సాయం కోసం వేలమంది ఎదురుచూపు.. ఇంకా వరద గుప్పిట్లో విజయవాడ

విజయవాడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా నదికి భారీ వరద ఓవైపు, బుడమేరు ఉగ్రరూపం మరోవైపు, ఎన్టీఆర్ జిల్లాను కన్నీటి కడలిలో ముంచేశాయి. రెండురోజులుగా వణికిస్తున్న వరద ఉధృతికి సుమారు 2.70 లక్షల మంది ముంపుబారిన పడగా, సోమవారం నాటికి 70 వేల మందిని సహాయక శిబిరాలకు తరలించారు. మరో రెండు లక్షల మంది ఇంకా ముంపులోనే ఉన్నారు. వారికి ఆహారం, తాగునీరు అందించే ప్రక్రియ నడుస్తోంది. కృష్ణానదికి 11.40 లక్షల క్యూసెక్కుల వరద రావడంతో విజయవాడ నగరంలోని భవానీపురం, బ్యారేజీ దిగువన ఉన్న రామలింగేశ్వరనగర్ ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. కృష్ణానది వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో ప్రకాశం బ్యారేజీ నుంచి వరద బయటకు వచ్చి బెర్మ్ పార్కును ముంచేసింది. జాతీయరహదారి మీదుగా భవానీపురంలోకి వరద ప్రవేశించడంతో ఆ ప్రాంతంలో మూడు అడుగుల మేర వరద నీరు నిలిచిపోయింది. మరోవైపు బుడమేరు వరద సోమవారం రెండో రోజూ కొనసాగింది. సహాయక చర్యలు పూర్తి స్థాయిలో అందడం లేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేయడం కనిపించింది. చంద్రబాబు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సమస్త యంత్రాంగాన్ని రంగంలోకి దింపి పరుగులు పెట్టిస్తున్నా.. ఇంకా వేలాది మంది సాయం కోసం ఎదురు చూస్తున్నారు. విజయవాడ దుఃఖదాయనిగా పేరున్న బుడమేరుకు వరద వస్తే దాని పరివాహక ప్రాంతాల్లోని గ్రామాలతోపాటు విజయవాడ పల్లపు ప్రాంతాల ప్రజలకు కంటి మీద కునుకుండదు. గడిచిన 40 ఏళ్లలో బుడమేరుకు ఈ స్థాయిలో వరద వచ్చింది లేదు. అయితే శని, ఆదివారాల్లో బుడమేరుకు 35 వేల క్యూసెక్కుల మేర భారీ వరద వచ్చి చేరింది. ఇలా వస్తున్న వరదను బుడమేరు డైవర్షన్ చానల్ (బీడీసీ) ద్వారా మళ్లించడంతో ఎడమ వైపు ఉన్న కట్టకు కవులూరు - శాంతినగర్ గ్రామాల మధ్య మూడు చోట్ల గండ్లు పడ్డాయి. కుడి వైపు కట్టకు ఏడు చోట్లకు పైగా గండ్లు పడ్డాయి. దీంతో కృష్ణానదికి చేరాల్సిన వరద మొత్తం విజయవాడ వైపు వచ్చేసింది. మరోవైపు ఊహించని వరద బుడమేరును తాకడంతో వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ 11 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఆ వరద మొత్తం కవులూరు, ఈలప్రోలు, పైడూరుపాడు, కొత్తూరు తాడేపల్లి, భవానీపురం, గొల్లపూడి, జక్కంపూడి, రాయనపాడు గ్రామాలతోపాటు విజయవాడ సింగ్‌నగర్ ప్రాంతాన్ని ముంచెత్తింది. ఇబ్రహీంపట్నం మండలంలోని ఏటిపట్టు గ్రామాలతోపాటు విజయవాడ - హైదరాబాద్ పక్కన ఉన్న గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. వరద ముంపునకు గురైన ప్రాంతాల నుంచి ప్రజలు జాతీయ రహదారి పైకి చేరుకుని వంటలు చేసుకోవడం కనిపించింది.



పాయకాపురంలో ఆహారం కోసం ఎగబడుతున్న జనం

జాతీయ రహదారిపై అవస్థలు..

ఆదివారం మునేరు ఉధృతితో నందిగామ మండలం ఐతవరం వద్ద జాతీయ రహదారిపైకి వరద రావడంతో హైదరాబాద్ నుంచి విజయవాడకు రాకపోకలు స్తంభించాయి. జగ్గయ్యపేట మండలం గరికపాడు వద్ద హైదరాబాద్ నుంచి విజయవాడ జాతీయరహదారిపై ఉన్న వంతెన అప్రోచ్ రోడ్డు వరద ఉధృతికి కోసుకుపోయింది. హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను, విజయవాడ వైపు వచ్చే వాహనాలను ఇతర మార్గాల్లో మళ్లించినప్పటికీ లారీలు, భారీ వాహనాల సిబ్బంది, బస్సుల్లోని ప్రయాణికులు పలు ఇబ్బందులు పడుతున్నారు. తినడానికి తిండి, కనీసం గొంతు తడుపుకొనేందుకు మంచినీళ్లు సైతం దొరక్క అల్లాడిపోవాల్సి వచ్చింది. వరద మధ్యలో మెరక ప్రాంతంలో 40కి పైగా వాహనాలు ఇరుక్కుపోయాయి. క్రేన్ సాయంతో జనాలను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.



వరద ముంపు ప్రాంతంలో బాధితులకు డ్రోన్ ద్వారా ఆహారం అందజేత



ప్రకాశం బ్యారేజీ వద్ద కౌంటర్ వెయిట్‌లను ఢీకొట్టిన బోట్లు



నాగార్జున సాగర్ 26 గేట్ల నుంచి దిగువకు ప్రవహిస్తున్న నీరు

జల సాగరాలు

నాగార్జున సాగర్‌కు 5.41 లక్షల క్యూసెక్కుల వరద

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ఇటు కృష్ణా, అటు గోదావరి నదులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జలాశయాల్లోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. నాగార్జునసాగర్‌కు ఏకంగా 5,41,643 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, సోమవారం సాయంత్రానికి 586.80 అడుగులుగా ఉంది. దీంతో సాగర్ నుంచి మొత్తం 5,40,503 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా, నాగార్జునసాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు 3,30,078 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, సోమవారం సాయంత్రానికి 884.40 అడుగులుగా ఉంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టు 10 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 4,73,630 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. దీంతోపాటు కుడిగట్టు జలవిద్యుత్తు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 30,131 క్యూసెక్కులు, ఎడమ గట్టు జలవిద్యుత్తు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,882 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

ప్రకాశం బ్యారేజీకి రికార్డు వరద..

ఏపీలోని ప్రకాశం బ్యారేజీ చరిత్రలోనే రికార్డు స్థాయిలో వరద ముంచెత్తింది. సోమవారం 11,43,201 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. మరో వైపు సమీప వాగులు. కీసర, పాలేరు, బుడమేరు నుంచి కూడా భారీగా వరద వస్తోంది. బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. కృష్ణా నదీ పరివాహక ప్రాంతాలు మరో వారం రోజులు అప్రమత్తంగా ఉండాలని జాతీయ వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. ప్రకాశం బ్యారేజీ ఎగువన పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి నిలకడగా వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం సాయంత్రానికి 5,48,059 క్యూసెక్కులు వరద వస్తుండగా 21 గేట్ల ద్వారా 5,43,617 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు కాగా, సోమవారం సాయంత్రానికి 172.47 అడుగులుగా ఉంది. ఇదిలా ఉండగా.. మూసీ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. హైదరాబాద్ నగరంతోపాటు ఎగువ ప్రాంతాలైన ఆలేరు, బిక్కేరు తదితర ప్రాంతాల నుంచి 7,549 క్యూసెక్కుల నీరు వస్తోంది. రోజంతా గంటగంటకూ ఇన్‌ఫ్లోలో హెచ్చుతగ్గులు ఉండటంతో ఏడు క్రస్టు గేట్లను నాలుగు అడుగుల మేర ఎత్తి 17,600 క్యూసెక్కుల నీటిని దిగువ మూసీకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా, సోమవారం సాయంత్రానికి 641.53 అడుగులకు చేరుకుంది. అయితే ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదలను నిలిపివేశారు. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



శ్రీరాంసాగర్ 41 గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

శ్రీరాంసాగర్ 41 గేట్ల ఎత్తివేత..

వరుస వర్షాలతో నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్‌కు వరద పోటెత్తుతోంది. సోమవారం ప్రాజెక్టులోకి 3, 14,928 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. నీటిమట్టం అంతకంతకూ పెరుగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టులో మరో 7టీఎంసీల నీళ్ల ఇంకా తక్కువగా ఉండగానే వరద గేట్లు ఎత్తారు. ప్రాజెక్టుకు మొత్తం 42 గేట్లు ఉండగా.. 41 గేట్ల ద్వారా ఇన్‌ఫ్లోకు సమానమైన నీటిని దిగువ గోదావరికి విడుదల చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1088.9 అడుగుల మేర నీటి నిల్వ ఉంది. పూర్తి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకుగాను 72.990 టీఎంసీలకు చేరుకుంది. మరోవైపు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు జలవిద్యుత్ కేంద్రం పూర్తిస్థాయిలో ఉత్పత్తిని మొదలు పెట్టింది. ప్రాజెక్టు గేట్లను ఎత్తడంతో నాలుగు యూనిట్ల ద్వారా అధికారులు 36 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఇక శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 2.92 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా.. 2.64 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా, నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టులోకి 3.72 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో సోమవారం రాత్రి 18 గేట్లను ఎత్తారు.ఇక మేడిగడ్డ బ్యారేజీకి సోమవారం 6.79 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి, వచ్చిన నీటిని వచ్చినట్లే విడుదల చేస్తున్నారు. బ్యారేజీ వద్ద 7.40 మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది.

నాగార్జునసాగర్‌లో పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్ జలకళ సంతరించుకోవడం, క్రస్ట్ గేట్లు ఎత్తడంతో పర్యాటకుల సందడి నెలకొంది. వరుస సెలవు దినాలు కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో పర్యాటకులు కృష్ణమ్మ అందాలను తిలకించడానికి వచ్చారు.

వరద కష్టాలపై వెంకయ్య విచారం

» రెండు రాష్ట్రాలకూ రూ.ఐదేసి లక్షల సాయం

» కుమారుడు, కుమార్తె రూ.ఐదేసి లక్షల సాయం



వెంకటాచలం, సెప్టెంబరు 2: తెలుగు రాష్ట్రాల్లో వరద కష్టాలపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుండపోత వర్షాలు, ఉధృతమైన వరదలతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వాటిల్లుతున్న నష్టం తనను తీవ్రంగా కలచి వేసినట్లు సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వరద కష్టాలపై ప్రధాని మోదీకి ఫోన్ చేసి ప్రస్తుత పరిస్థితిని వివరించి, వెంటనే ఆదుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఇప్పటికే రెండు రాష్ట్రాల సీఎంలతో తాను మాట్లాడానని, అక్కడి ప్రభుత్వ యంత్రాంగాలతో కేంద్ర అధికారులు టచ్‌లో ఉన్నారని, రెండు రాష్ట్రాలకూ ఆర్థిక సాయం అందజేస్తామని ప్రధాని హామీ ఇచ్చారని తెలియజేశారు. తన వ్యక్తిగత పెన్షన్ నుంచి ఆంధ్రప్రదేశ్ సీఎం సహాయనిధికి రూ.5లక్షలు, తెలంగాణ సీఎం సహాయనిధికి రూ.5లక్షల చొప్పున పంపించినట్లు వెంకయ్య తెలిపారు. అలాగే, తన కుమారుడు హర్షవర్ధన్ నిర్వహిస్తున్న ముప్పవరపు ఫౌండేషన్ తరఫున ఒక్కో రాష్ట్రానికి రూ.2.5 లక్షలు, తన కుమార్తె దీపా వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్ నుంచి ఒక్కో రాష్ట్రానికి రూ.2.5లక్షల చొప్పునమొత్తం పది లక్షలు అందజేసినట్లు తెలిపారు.

సర్కారు నిర్లక్ష్యానికి 20 మంది బలి: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరద సహాయక చర్యలు చేపట్టడంలో రేవంత్ సర్కారు విఫలమైందని.. ఈ నిర్లక్ష్యం ఖరీదు 20 మంది ప్రాణాలు కోల్పోవడమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా విమర్శించారు. ఏపీ ప్రభుత్వం ఆరు రెస్క్యూ హెలికాప్టర్లను, 150 బోట్లు ఉపయోగించి.. ప్రజలను కాపాడుతోందని, ఇక్కడి ప్రభుత్వం మాత్రం హెలికాప్టర్లు తెప్పించేందుకు కూడా తాత్సారం చేస్తోందని విమర్శించారు. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పనుల వల్లే హైదరాబాద్‌కు వరద ముప్పు తప్పిందని అన్నారు. తెలంగాణ భవన్‌లో మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. 'మంత్రుల పర్యటనకు హెలికాప్టర్ దొరుకుతోంది.. వరదల్లో చిక్కుకున్న ప్రజలను కాపాడ్డానికి మాత్రం ప్రభుత్వానికి హెలికాప్టర్ దొరకడం లేదా?' అని ప్రశ్నించారు.

తెలుగు ప్రజలను కేంద్రం ఆదుకోవాలి: రాహుల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన తెలుగు రాష్ట్రాల ప్రజలను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్స్‌లో డిమాండ్ చేశారు. బాధితులకు పునరావాస ప్యాకేజీలను త్వరగా అందించాలన్నారు. తెలంగాణలో పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు, సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి అక్కడి రాష్ట్ర ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తోందన్నారు. ఏపీలో వరద బాధితులను ఆదుకునేందుకు పునరావాస ప్యాకేజీని అందించాలని అక్కడి సర్కారును కోరారు.

పక్క రాష్ట్ర సీఎం ప్రజల్లో .. రేవంత్ ఇంట్లో: హరీశ్

చేగుంట, హైదరాబాద్, సెప్టెంబర్ 2: ఏపీ సీఎం చంద్రబాబు 74 ఏళ్ల వయసులో ప్రజల్లో తిరుగుతుంటే, 54 ఏళ్ల రేవంత్ ఇంట్లో పడుకున్నాడని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మెదక్ జిల్లా చేగుంటలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. వరదలతో అతలాకుతలమై ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే ఆలస్యంగా మొద్దు నిద్రలేచి సీఎం, డిప్యూటీ సీఎం ప్రతిపక్షాల మీద విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. వరదల కారణంగా 16 మంది చనిపోయారని, తమకున్న సమాచారం ప్రకారం 31 మందికి పైగా చనిపోయి ఉంటారని తెలిపారు. వరదల్లో మృతి చెందిన ఒక్కో కుటుంబానికి రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధమయ్యాయన్నారు. సోషల్ మీడియా వేదికగా మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై బీజేపీ చేస్తున్న అనుచితదాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

నేడు 11 జిల్లాల్లో భారీ వర్షాలు

» అప్రమత్తంగా ఉండాలి

» కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు

హైదరాబాద్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 11 జిల్లాల్లో మంగళవారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున.. ఆ జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. రానున్న 24 గంటల్లో ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, కామారెడ్డి, కుమ్రంభీం-ఆసిఫాబాద్, మెదక్, మేడ్చల్-మల్కాజిగిరి, నిజామాబాద్, పెద్దపెల్లి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించిందన్నారు. ఈ 11 జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సోమవారం ఆమె సచివాలయం నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా వరదల పరిస్థితి, పునరావాస, సహాయక చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ... 11 జిల్లాల కలెక్టర్లు ముందస్తు ప్రణాళికలతో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పోలీసు తదితర శాఖల అధికారులు సమన్వయం చేసుకుని పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిర్మల్ జిల్లాకు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని పంపుతున్నామని తెలిపారు. మహారాష్ట్ర పరీవాహక ప్రాంతం నుంచి గోదావరి నదికి వచ్చే వరద నీటి విషయంలో ఆ రాష్ట్ర అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్ నుంచి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా సంప్రదించాలని కలెక్టర్లకు సూచించారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకునేందుకు క్రేన్‌లను సిద్ధంగా ఉంచుకోవాలని ఎస్పీలను ఆదేశించారు. కాగా, రాష్ట్రంలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, సిబ్బంది హెడ్‌క్వార్టర్ లోనే ఉంటూ మరింత అప్రమత్తంగా ఉండాలని దక్షిణ డిస్కమ్(ఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ కోరారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్ సరఫరా పరిస్థితిపై జిల్లాలు/సర్కిళ్ల చీఫ్ ఇంజనీర్లు, ఎస్ఈలతో విద్యుత్ సరఫరా పరిస్థితిపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సూర్యాపేట జిల్లాలో విద్యుత్ వ్యవస్థకు భారీ నష్టం జరిగిందని, 1,200కు పైగా విద్యుత్ స్తంభాలు, 4 సబ్‌స్టేషన్లు దెబ్బతిన్నాయన్నారు. ప్రస్తుతం సంస్థ పరిధిలో 2,417 విద్యుత్ స్తంభాలు, 21డీటీఆర్ నిర్మాణాలు, 18సబ్‌స్టేషన్లు దెబ్బతిన్నాయని తెలిపారు.


3 రోజుల్లో 1,662 మందిని రక్షించిన అగ్నిమాపక శాఖ

రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో ముంపు ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు అగ్నిమాపక శాఖ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. శని, ఆది, సోమవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా సహాయక చర్యల్లో 1,662మందిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఖమ్మం జిల్లా పరిధిలో 761 మందిని కాపాడారు. హైదరాబాద్, ఖమ్మం, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, నల్లగొండ, హన్మకొండలో 100మంది సిబ్బందితో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు సహాయక చర్యల్లో ఉన్నట్లు అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ ఏఓయూ)- గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు స్టడీసెంటర్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తమకు అనువైనదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్‌లలో భాగంగా కాంటాక్ట్ తరగతులు, ల్యాబొరేటరీ సెషన్స్, అసైన్‌మెంట్స్, వార్షిక పరీక్షలు ఉంటాయి. ఆలిండియా రేడియో ద్వారా నిర్ణీత సమయాల్లో రేడియో పాఠాలు ప్రసారం చేస్తారు. డిగ్రీ ప్రోగ్రామ్‌లలో రెండు, మూడు సంవత్సరాలు; పీజీలో రెండో సంవత్సరం చదువుతున్నవారు; ఓల్డ్ బ్యాచ్ స్టూడెంట్స్ కూడా తమ ట్యూషన్ ఫీజులు చెల్లించవచ్చు.

ఆంధ్రజ్యోతి | దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● మంగళవారం 3 సెప్టెంబరు 2024



అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో డిగ్రీ, పీజీ

డిగ్రీ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి మూడేళ్లు. బీఏ, బీకాం, బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) గ్రూపు అభ్యర్థులు అర్హులు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ లేదా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ నుంచి పన్నెండోతరగతి ఉత్తీర్ణులు; పదోతరగతి తరవాత రెండేళ్ల ఐటీఐ/ఒకేషనల్ కోర్సులు చేసినవారు, మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఇంగ్లీష్ లేదా తెలుగు మాధ్యమాన్ని ఎంచుకోవచ్చు. బీఏ(పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ), బీఎస్సీ(బోటనీ, కెమిస్ట్రీ, జువాలజీ) కోర్సులు ఉర్దూ మీడియంలో కూడా అందుబాటులో ఉన్నాయి.

- బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. దీనిని తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకునే వీలుంది. ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ పూర్తిచేసినవారు; ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రికార్డు అసిస్టెంట్‌గా ఏడాది అనుభవం లేదా డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు(లైబ్రరీ సైన్స్) పూర్తిచేసినవారు అర్హులు.

పీజీ ప్రోగ్రామ్‌లు

- కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ(జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లు మినహా అన్నింటినీ తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లాంగ్వేజెస్‌లో ఎంఏ కోర్సుకు డిగ్రీలో సంబంధిత లాంగ్వేజ్‌ని సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. ఎంకాం కోర్సుకు బీబీఏ/బీబీఎం/బీఏ(కామర్స్) అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ(మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్)కోర్సుకు మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ సైకాలజీకి ఏదేని డిగ్రీ పాసైతే చాలు.

- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఈ కోర్సు ఉంది. కనీసం 40 శాతం మార్కులతో బీఎల్ఐఎస్సీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఏడాది. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన విధంగా సంబంధిత/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: సైకలాజికల్ కౌన్సెలింగ్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఉమెన్ స్టడీస్, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం.

- హ్యూమన్ రైట్స్ ప్రోగ్రామ్‌ను తెలుగు మాధ్యమంలో, మిగిలినవాటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఆర్నెల్లు. విభాగాన్ని అనుసరించి పదో తరగతి/ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.

విభాగాలు: ఎన్‌జీఓస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్.

- ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ఆంగ్ల మాధ్యమంలో, మిగిలిన వాటిని తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **వెబ్‌సైట్:** www.braou.ac.in

నిట్ ఆంధ్రలో పీహెచ్‌డీ

పశ్చిమగోదావరి జిల్లా-తాడేపల్లిగూడెంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్ ఆంధ్ర)- విశ్వేశ్వరాయ స్కీమ్ కింద పీహెచ్‌డీ 2024 ఆగస్టు సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో 5 సీట్లు, పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లో 2 సీట్లు ఉన్నాయి. రిటెన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు.

విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

అర్హత: ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి అభ్యర్థులు ఇంజనీరింగ్/టెక్నాలజీ/సైన్స్ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. డిగ్రీ, పీజీ స్థాయుల్లో ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. గేట్/నెట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే రీసెర్చ్ ఆర్గనైజేషన్‌లు/అకడమిక్ ఇన్‌స్టిట్యూషన్‌లు/ఇండస్ట్రీలలో కనీసం రెండేళ్ల పనిచేసిన అనుభవం ఉండాలి.

ఫెలోషిప్: ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; చివరి మూడేళ్లు నెలకు రూ.43,750లు ఇస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1,20,000 ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **ఈ-మెయిల్:** phdadmissions@nitandhra.ac.in
- **వెబ్‌సైట్:** www.nitandhra.ac.in



జేఎన్‌టీయూఏలో ఐసీపీ సెకండ్ ఫేజ్

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ), స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'బీటెక్ & బీఎస్+ఎంఎస్' ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి సెకండ్ ఫేజ్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. జేఈఈ మెయిన్స్ 2024 ర్యాంక్/ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/టీఎస్ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/ఇతర రాష్ట్రాల ఎంట్రెన్స్ ఎగ్జామ్‌ల స్కోర్లు ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిని అనుసరిస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు
- ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. అభ్యర్థులు మొదటి మూడేళ్లు అనంతపురం జేఎన్‌టీయూలో, చివరి మూడేళ్లు స్వీడన్ బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగేళ్ల కోర్సు పూర్తయిన తరవాత ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. సీఎస్ఈ, ఈసీఈ విభాగాలు ఎంచుకోవచ్చు.
- సీఎస్ఈ అభ్యర్థులు జేఎన్‌టీయూఏ నుంచి బీటెక్(సీఎస్ఈ); స్వీడన్ బీటీహెచ్ నుంచి బీఎస్(కంప్యూటర్ సైన్స్), ఎంఎస్(కంప్యూటర్ సైన్స్/సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్-ఏఐ&ఎంఎల్) చదవాల్సి ఉంటుంది.
- ఈసీఈ అభ్యర్థులు జేఎన్‌టీయూఏ నుంచి బీటెక్(ఈసీఈ); స్వీడన్ బీటీహెచ్ నుంచి బీఎస్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్), ఎంఎస్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-మెషిన్ లెర్నింగ్, సెన్సార్స్ అండ్ సిస్టమ్స్) చదవాలి.

మిగిలిన సీట్ల వివరాలు: కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(సీఎస్ఈ)లో 7 సీట్లు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ)లో 10 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. జేఈఈ మెయిన్స్ 2024 ర్యాంక్/ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/టీఎస్ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/ఇతర రాష్ట్రాల ఎంట్రెన్స్ ఎగ్జామ్‌ల స్కోర్లు ఉండాలి.
- **సెకండ్ ఫేజ్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in

లిటిల్స్


గాడిద నేర్చుకున్న పాఠం

ఒక ఊరిలో రాజు అనే వ్యాపారి దగ్గర ఒక గాడిద ఉండేది. రాజు ప్రతి రోజు నగరంలోని సంతకు వెళ్లి, సరుకులు కొనుగోలు చేసి, ఆ సరుకుల మూటలను గాడిద మీద వేసుకుని తెచ్చి, తన పల్లెలో అమ్మేవాడు.ఒకరోజు రాజు ఉప్పు మూటలను కొని గాడిద వీపు మీద వేసి తిరిగి వస్తుండగా, దారిలోఉన్న ఒక నీటి మడుగును చూసుకోకపోవడం వల్ల, గాడిద మూటలతో సహా ఆ నీళ్లలో పడిపోయింది. నీళ్లలో నుండి లేచాక ఉప్పు చాలా కరిగిపోవడం వల్ల గాడిదకు వీపు మీది బరువు తగ్గి చాలా హాయిగా అనిపించింది. ఆ మర్నాడు కూడా రాజు ఉప్పు మూటలే కొనుగోలు చేయడంతో ఈసారి కావాలనే గాడిద నీటిలో పడిపోయింది. వరుసగా మూడు రోజులు ఇలాగే ఉప్పు మూటలను నీటిలో పడవేస్తూ, తన బరువును తగ్గించుకుంటూ ఉంది.



ఆ రోజు రాజు గాడిద కావాలనే నీటిలో పడిపోయి తనకు నష్టం చేస్తుందని గమనించాడు. దీనికి ఎలాగైనా బుద్ధి చెప్పాలి అనుకున్నాడు. ఆ మర్నాడు కూడా గాడిద సంతకు వెళ్లి, తిరిగి వస్తూ, అలవాటుగా వీపు మీది మూటలను నీళ్లలో పడేసింది. కానీ నీటిలో నుంచి పైకి లేచి చూస్తే, మూటలు అంతకు ముందు కంటే ఇంకా బరువు ఎక్కువై గాడిద కదలలేని పరిస్థితి వచ్చింది. ఎందుకంటే, ఆ రోజు గాడిద బద్ధకానికి సరైన బుద్ధి చెప్పాలని, రాజు దాని వీపు మీద పత్తి మూటలు వేయించాడు. అవి నీటిలో తడిసి ఇంకా ఎక్కువ బరువు అయ్యాయి. ఈ విషయం తెలుసుకుని అలా బుద్ధి తెచ్చుకున్న గాడిద ఆ రోజు నుండి యజమాని చెప్పిన పని చక్కగా చేస్తూ చురుకుగా ఉంది.


7 తేడాలను కనిపెట్టండి



జత ఉన్న బొమ్మ ఏది?



సరైన నీడను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 400

					9		1	
	4		6		5		7	3
			4			8		
8	9							
	7	1				9	5	
							3	6
		7			2			
4	5		3		6		9	
	6		1					

సుడోకు - 399 సమాధానం

2	4	8	6	9	7	1	5	3
9	5	1	3	2	8	4	6	7
6	7	3	4	5	1	9	8	2
7	8	9	2	1	5	6	3	4
4	3	2	8	7	6	5	9	1
1	6	5	9	3	4	2	7	8
5	9	4	1	8	3	7	2	6
8	2	6	7	4	9	3	1	5
3	1	7	5	6	2	8	4	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

జాబ్ కార్నర్

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో ఖాళీలు

ప్రభుత్వరంగ సంస్థ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 14
1. ఔట్‌ఫిట్ అసిస్టెంట్- ఫిట్టర్(పైప్, ప్లంబర్): 2 పోస్టులు
2. మూరింగ్ అండ్ స్కాఫోల్డింగ్ అసిస్టెంట్: 12 పోస్టులు

అర్హత: పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు ఔట్‌ఫిట్ అసిస్టెంట్ పోస్టుకు మొదటి ఏడాదికి రూ.23,300; రెండో ఏడాది రూ.24,000; మూడో ఏడాది రూ.24,800. మూరింగ్ అండ్ స్కాఫోల్డింగ్ అసిస్టెంట్‌కు మొదటి ఏడాది రూ.22,100; రెండో ఏడాది రూ.22,800; మూడో ఏడాది రూ.23,400.

ఎంపిక విధానం: ఫేజ్-1, 2 రాత పరీక్షలు, పని అనుభవం తదితరాల ఆధారంగా

ఫీజు: రూ.300. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 13

వెబ్‌సైట్: https://cochinshipyard.in/

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో గెస్ట్ ఫ్యాకల్టీ

ములుగులోని సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం... 2024-25 సంవత్సరానికి గాను గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 6
1. గెస్ట్ ఫ్యాకల్టీ(ఎకనామిక్స్): 3 పోస్టులు
2. గెస్ట్ ఫ్యాకల్టీ(ఇంగ్లీష్): 3 పోస్టులు

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ(ఎకనామిక్స్/ఇంగ్లీష్)తో పాటు నెట్/జేఆర్ఎఫ్ ఉత్తీర్ణత.

దరఖాస్తు విధానం: ఆసక్తిగల అభ్యర్థులు సీవీతో పాటు స్కాన్ చేసిన సంబంధిత ధ్రువపత్రాలను మెయిల్ ద్వారా పంపాలి.

ఈ - మెయిల్: hr@uohyd.ac.in

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 12


వెబ్‌సైట్: https://ssctu.ac.in/

యూఓహెచ్‌లో ప్రాజెక్ట్ పోస్టులు

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 3
1. రీసెర్చ్ అసోసియేట్: 1 పోస్టు
2. ప్రాజెక్ట్ అసోసియేట్-1: 1 పోస్టు
3. ఫీల్డ్ వర్కర్: 1 పోస్టు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.



వేతనం: నెలకు ఆర్ఏ పోస్టుకు రూ.54,000. పీఏ పోస్టుకు రూ.31,000. ఫీల్డ్ వర్కర్ పోస్టుకు రూ.18,000.


దరఖాస్తు పంపాల్సిన ఈ-మెయిల్: rks@uohyd.ac.in

దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: సెప్టెంబరు 16

వెబ్‌సైట్: uohyd.ac.in/

విపత్తు నిర్వహణ చట్టం(2005) సవరణ బిల్లు 2024

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



(నిన్నటి దిక్సూచి తరువాయి)

విపత్తు నిర్వహణ చట్ట సవరణ బిల్లు 2024పై విమర్శలు

● **రాజ్యాంగ బద్ధత కొరవడింది; రాష్ట్రాల శాసనాధికార పరిధి అతిక్రమించబడింది:** విపత్తు నిర్వహణ అనే పదం కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాల్లో ఎక్కడా లేదు. పైగా వ్యవసాయరంగంలో ఎదురయ్యే చీడపీడల వంటి రాష్ట్ర జాబితాలోని అంశాలు సైతం విపత్తుల జాబితాలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రప్రభుత్వం ఉమ్మడి జాబితాలోని 23వ అంశమైన 'సామాజిక భద్రత, సామాజిక బీమా, ఉపాధి, నిరుద్యోగం' అనే విషయాలకు సంబంధించిన ఎంట్రీ ఆధారంగా విపత్తు నిర్వహణ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. ఇది నిర్బంధంగా రాష్ట్రాల శాసనాధికారాల్లోకి చొచ్చుకుని రావడమే. రాజ్యాంగ అతిక్రమణే అని విపక్షాలు వాదిస్తున్నాయి. ఆదేవిధంగా సామాజిక భద్రత కిందకు అన్ని విపత్తు అంశాలనూ చేర్చలేం. కాబట్టి ఈ బిల్లు అసంపూర్ణమని కూడా విపక్షాలు వాదిస్తున్నాయి.

● **అధికారాల మధ్య వ్యాప్తి, గందరగోళం:** ఈ బిల్లు అనేక అధికారాలను వివిధ స్థాయిల్లోని సంస్థలకు దత్తం చేసింది. ఇది అధికారుల విధి నిర్వహణలో గందరగోళం సృష్టించి విపత్తు సహాయక చర్యలకు ఆటంకం కలిగించే అవకాశం ఉంది.

● **విపత్తు నిర్వహణకు సంబంధించి కేంద్రానికి విస్తృత అధికారాలు:** ఈ బిల్లు అనేక అంశాల దృష్ట్యా విపత్తు నిర్వహణలో కేంద్రానికి విస్తృత అధికారాలు దత్తం చేసింది. అనేక నియమాలు రూపొందించే అధికారం కేంద్రానికి కల్పించింది. ఇది రాష్ట్రాల విపత్తు నిర్వహణ చర్యలకు, ప్రణాళికలకు ప్రతిబంధకం. రాష్ట్రాల వారీగా వాటి ప్రత్యేక పరిస్థితులకు అనుగుణంగా విపత్తు నిర్వహణ విధానాల, కార్యక్రమాల రూపకల్పన జరగాలి.

అయితే ఈ విమర్శలకు ప్రతిస్పందనగా ప్రభుత్వం 2013 నాటి టాస్క్‌ఫోర్స్ నివేదికను, రెండో పరిపాలన సంస్కరణల సంఘం అభిప్రాయాన్ని ముందుకు తెస్తోంది. టాస్క్‌ఫోర్స్ నివేదికలో 1999 నాటి జె.సి.పంత్ అధ్యక్షతన నియమించిన హైపవర్ కమిటీ సూచన ఉటంకించింది. దీని ప్రకారం రాష్ట్రాల జాబితాలో కేవలం రెండు అంశాలు మాత్రమే ఎంట్రీ నంబరు 14(వ్యవసాయం, చీడపీడల నుంచి రక్షణ), ఎంట్రీ నంబరు 17(నీరు, నీటి సరఫరా, నీటిపారుదల, ఎంబార్క్‌మెంట్స్) విపత్తు నిర్వహణ కిందకు వస్తాయి. కాబట్టి దేశవ్యాప్తంగా ఒక సమగ్ర విపత్తు నిర్వహణ ప్రణాళిక తీసుకురావడానికి భారత రాజ్యాంగ షెడ్యూల్ 7లో ఒక ఎంట్రీగా విపత్తు నిర్వహణను చేర్చాల్సి ఉందని అభిప్రాయపడింది.

ఆదేవిధంగా రెండో పరిపాలన సంస్కరణల సంఘం 3వ రిపోర్టు అయిన 'క్రైసిస్ మేనేజ్‌మెంట్ : ఫ్రం డెస్పైర్ టు హోప్' అనే 2006 నాటి నివేదికలో కూడా విపత్తు నిర్వహణ అంశంపై చట్ట అధికారం కేంద్రానిదే అని సూచించింది. ఈ నివేదికలో, రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లో గల మూడు జాబితాల్లో ఏ ఒక్క జాబితాలో కూడా 'విపత్తు నిర్వహణ' అనే అంశం పేర్కొనని కారణంగా, అది అవశిష్ట అధికారం కిందకు వస్తుంది. అవశిష్ట అధికారం మేరకు ఏ జాబితాలోనూ పేర్కొనని అంశాలపై చట్టాలు చేసే అధికారం కేవలం కేంద్రప్రభుత్వానికి మాత్రమే ఉంటుందని ఇతిమిద్ధంగా తెలియజేసింది. కాబట్టి ఈ బిల్లు రాజ్యాంగబద్ధమే, రాష్ట్రాల శాసన అధికారాల అతిక్రమణ కాదని కేంద్రప్రభుత్వ వివరణ.

అయితే విపత్తు నిర్వహణకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా, భవిష్యత్తులో అధికార పరిధులపై వివాదాలు తలెత్తకుండా ఉండే నిమిత్తం 'విపత్తు నిర్వహణ' అంశాన్ని రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లో చేర్చేందుకు సైతం రాజ్యాంగ సవరణ ఆవశ్యకత ఉంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్